శ్రీమత్పరదేవతాయైనమః

శ్రీ

# పాండవాశ్వమేధము

శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవి

ప్రణీతము

[ఆరవ కూర్పు — 1,000 సతులు ]

ప్రకాశకులు:

చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి సన్సు

వేంకటేశ్వర పబ్లికేషన్సు

కడియం - P. O.

తూర్పుగోదావరి జిల్లా.

1954

కాపీరైటు రిజిష్టర్డు]

[వెల రు. 3-00

82 V56 JUNE 1981

# ... చ్చు పాత్రములు

CHECKED 1992

ప్రథమాంకము :-

అశ్వత్థామ
కృపాచార్యులు
కృష్ణుడు
భీముడు
అర్జునుడు
వ్యాసుడు
నారదుడు
ధర్మరాజు
ద్రౌపది

ద్వితీయాంకము :-

ధృతరాష్ట్రుడు
గాంధారి
విదురుడు
వ్యాసుడు
పంచపాండవులు
కృష్ణుడు

తృతీయాంకము :-

నారదుడు
పంచపాండవులు
ద్రౌపది
దౌవారికుడు
కృష్ణుడు
వార్తాహరుడు

చతుర్థాంకము:-

CHECKED June 92

కవి
వర్తకుడు
భీష్ముడు
ధృతరాష్ట్రుడు
విదురుడు
పంచపాండవులు
కృష్ణుడు
వ్యాసుడు
గంగ

పంచమాంకము :-

ధౌమ్యుడు
కాణ్వుడు
సూర్యవర్మ
కేతువర్మ
ధృతవర్మ
మంత్రి
వజ్రదత్తుడు
గంధర్వుడు
దుస్సల

షష్ఠాంకము :-

సూత్రధారుడు
మారిషుడు
అర్జునుడు
బభ్రువాహనుడు
ద్రౌపది
ధర్మరాజు
భీముడు
నకులుండు
సహదేవుడు
ఉలూపి
చిత్రాంగద
కృష్ణుడు
పశుపాలుడు
ధౌమ్యులు

ఓం

శ్రీ మత్పరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము.

(ప్రథమాంకము.)

(నాంది)

ఉ. భారతసంగరాంతమునఁ బాండుతనూభవులందు దుఃఖపున్
భారము దీర్చి వారల కపారపు రాజ్యము నిచ్చి యుత్తరా
దారకు సేమ మారసి పదంపడి వారల నశ్వమేధసం
చారులఁజేయు కృష్ణుఁడు భృశమ్ము యశమ్ము నిశమ్ము శమ్మిడున్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి తెరవంకఁ జూచి)

సూత్ర— మారిష ! ఏల యీ యాలస్యము ? ఇటు రమ్ము.

మారి— (ప్రవేశించి) ఇదిగో వచ్చితిని. ఆలస్యమున కేమున్నది ?

సూత్ర— ఎవరితోడనో యెందులకో వివదించుచున్నట్లున్నావు !

మారి— (తనలో) ఇంతవఱకు వినిపించినదే ! (ప్రకాశముగా) ఇఁక నెవరున్నారు ? మన మైత్రేయుఁడు.

సూత్ర— పాపము శాంతించుఁగాక ! గురువుతో గ్రుద్దులాడ మొదలు పెట్టితివే ? అందునను ఏ గురువు ననుగ్రహమ్మున మనమిట్టి రంగస్థలమున నిర్భయమ్ముగ నిలువఁ గలిగితిమో, అట్టి భారతగురువుతోడ నేనా కలహించుట ?

మారి— (తనలో) భారతగురు వెవరు ? ద్రోణాచార్యులా యేమి ? (యోజించి) కాదు భరతశాస్త్రగురువు గాఁబోలును (ప్రకాశము) గురువుతోఁ గాదు. గురు పుత్రునితో.

సూత్ర— ఓహో ! ఇదియా నీ తెలివి ?

క. గురునకు గురుసుతునకు నం
తరముండునె వెట్టిగాని తత్తనయుని న
గ్గురునిబలె నరయ నేరని
మొఱకులు గూలుదురు నరకమున నిక్కముగన్.

మారి— (గర్వముతో) సమయమువచ్చినచో నేను గురువునే లెక్కించు-వాఁడను గాను. నా కితఁడు లక్ష్యమా?

సూత్రి— (నవ్వుచు) అవును "తల్లిచెవులు త్రెంచువానికిఁ బినతల్లిచెవులు బీఱ పువ్వులును గా" నఁట. సరే ఇంతకును గలహ మెందుకుఁ దట స్థించినది?

మారి— ఎందుకా? ఎందుకేమిటి దుర్మార్గులకు! నిన్నరాత్రి నిదురఁబోవు చున్న మా పిల్లల నితఁడు గొట్టినాఁడఁట.

సూత్రి— అతఁ డేమంత యవివేకి కాఁడే! నిదురబోవువారి నెందుకుఁ గొట్టును? ఎట్టివారినేని యింతకుఁ గొట్టవలసిన యవసరమేమి? ఇది నమ్మఁదగినది కాదు. ఈలా గని నీతోఁ జెప్పినవారెవ్వరు?

మారి— మా యింటి యజమాని పుట్టింటి నవుకరు. ఆపైని నా భార్యకుఁ గోపము వచ్చి యతని నెల్లేని యవమానింపక తప్పదనియు, నందు లకు జరిమానాగా నాతివి శిరోభూషణముఁ దెమ్మనియుఁ బట్టుపట్టినది.

సూత్రి— ఆఁడువాండ్ర మాటలను బుచ్చుకొనిమనము యుక్తాయుక్తములు విడిచి కలహమునకుఁ గాలుద్రివ్వవచ్చునా?

మారి— నేను గలహము గూడదనియే నేప్పగానే యడిగించి నాఁడను.

సూత్రి— (కోపముతో) చీ! చీ! ఇంకను సిగ్గులేక యేమో చెప్పఁబోవు చున్నావు. గురుద్రివ్యాపహారముగూడ నీ కుచితమని తోఁచినదా? (తనలో) ఓహో! ఈప్రశంసలోఁ బ్రకృతము మఱచితినే! (ప్రకా శము) సరే దానింగుఱించి పిదప మాటలాడుకొందముగాని, యీనాఁడు మనము ప్రదర్శింపఁదగిన నాటక మెయ్యది?

మారి— పాండవాశ్వమేధమని యూహించితిని.

సూత్రి— ఎట్లు?

మారి— మీ రొనరించిన నాందినిబట్టి.

సూత్ర— చక్కఁగాఁ బోల్చితివి. ఈగ్రహింపువలననే కాఁబోలును. మీరు తెరలో మొదటి యంకము నప్పుడే కొంత ప్రదర్శించినారు.

మారి— (తనలో) ఓహో! ఈతఁడింకను ఆ విషయమై నన్నెత్తిపొడుచుచునే యున్నాఁడే! (యోజించి) అయినను ఇప్పట్ల నాకిది యనుగ్రహమే. (ప్రకాశము) అవును పాండవులకన్న మన మెక్కువవారమా యేమి? వారు తప్పొనరించిన గురుపుత్రునిఁ బరాభవింపఁ బ్రియత్నింప లేదా?

(తెరలో) ఎవఁడురా నన్నుఁ బరాభవించువాఁడు?

సూత్ర— (అనాకర్ణితముగా) సరే. యీ పోలికలకేమిగాని మనము కవుల ప్రశంస బొత్తిగా సభాస్తారులకు శ్రుతపఱపమైతిమే.

మారి— ఈ కవులంగుఱించి వేఱే మనము చెప్పనక్కఱలేదు. తిరుపతి వేంకటేశ్వరులు, శతావధానులు, చర్ల బ్రహ్మయ్యశాస్త్రులవారి శిష్యులనిన నెల్లరును నెఱిఁగియే యుందురు.

సూత్ర— అవును ఆ మాటనిజమే. వీరు సుప్రసిద్ధులే: వీర లిదివఱకనేక గ్రంథము లొనర్చి యున్నవారలు.

(మరలఁ దెరలో) ఎవఁడురా నన్నుఁ బరాభవించువాఁడు?

మారి— (ఆకర్ణించి) అదిగోఁ జూచితివా? ఇప్పటికిని విరమింపక మైత్రేయుఁడు నాపైఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వుచునే యున్నాఁడు.

సూత్ర— (నవ్వి) నీ గొడవనీది. అతఁడు మైత్రేయుండు గాఁడు. అశ్వత్థామ. మన మీపాటికిఁ బోవుదము. (నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

---

(అంతఁ గత్తి చేతఁబట్టుకొని రక్తసిక్తాంగుఁడై యశ్వత్థామ కృప కృతవర్మలతోఁ బ్రవేశించును.)

అశ్వ— (క్రోధావేశ సంతోషములతో)

ఉ. శత్రుల నెల్లఁ జక్కఁడఁచి స్వామిఋణమ్మును దీర్పఁగంటి; స
త్పుత్రుఁడ నైతిఁ దండ్రితలఁ దుంచిన ఘస్మరు నుగ్గణంచి; లో
కత్రియ రాజ్య మబ్బినను గాదిఁక నింతటికన్న మోద; మీ
గాత్రముతోడఁ జేయఁదగు కార్యము లేదిఁక నాకు నెయ్యెడన్.

(కొంచెమాలోచించి) లేకేమి? పాండవహంతకులును గృష్ణసాత్య
కులును గూడ నీవేషముతోడనే వధింపఁదగినవారు. (తూర్పుదిక్కుఁజూచి)
ఇంకను గొంత రాత్రి మిగిలియే యున్నది. ప్రభాత మగునంతవఱకును
మహేశ్వరుని వర మనుసరింపఁదగినదే. (వెనుకకు మఱలి) సఖా! దుర్యో
ధన! ఇదిగో నీ మనమ్మున నున్న కొఱఁతఁ దీర్ప గురుపుత్రుండ దేగుచున్న
వాఁడు. సజీవుఁడవై యున్న నీకీ వార్త వినిపింపని నన్ను మన్నింపుము.
భీమగదాఘాతంబుల నలిగియున్న నీ వీ మాత్రము వార్తకేని నోఁచవేమో
యని వారల వెదకక త్వరగా జరిగినపట్టు వినిపింప వచ్చితిని. కానిమ్ము.

క. పాండవుల మరణ మదియొ
క్కండున్ దక్కంగ వింటికాదె! కడమ నీ
పిండంబులపై ధారకు
నుండున్ దప్పేమి? యిదియు నొక సంతసమే.

ఓరీ ధర్మజ భీమార్జున నకుల సహదేవులార!

ఉ. మాయలమారి కృష్ణుఁడు ప్రమాదము దప్పఁగఁ జేయఁ బోలు; నీ
రేయి యపాండవంబు నొనరించినవాఁడనె లేక యున్న; మీ
రేయెడనేని యున్న నెదురేగుఁడు; నేనిదె సన్న్యసింపఁగా
నాయిత మైతి; నీ కొదవ యన్నది నాకిఁక నుండకుండుతన్.

(చెవియొగ్గి) ఎక్కడను బ్రతిశబ్దము వినరాదు. పాఱఁబోతులు ప్రత్యు
త్తర మెందు కొసంగుదురు!

చ. హ్రదమున డాఁగెనంచు నృపు నాఁడికూఁతలు కూసినట్టి మీ
రెదురిపుడేల రారుర యిహీ! యిది పౌరుషమౌనురోరి? దు
ర్మద మది యేడఁ బోయెనుర? మాటున భీతిలి డాఁగుకన్నఁ జ
చ్చి దివికిఁ జేరుటొప్పదె యిసీ! యభిమానము లేదె, పందలే?

ఎక్కడ డాఁగుదురో చూచెదంగాక, మిమ్మిత(డు శేషము మిగుల్చ
వాఁడను కొంటిరే. (పోఁబోవును.)

కృపా— (నడుము గట్టిగా వెనుకనుండి పట్టుకొని) గురునందనా ! శాం
తింపుము శాంతింపుము. పాఱిపోయినను జచ్చినను నొకటియేకదా !
ఎందు కీ యకాండ తాండవము.

అశ్వ— మామా ! నీకు నమస్కారము. నన్నిపట్టున నడ్డగింపకుము.

కృపా— ఇంతకన్నను విజయి వగుదువు గాక, ప్రభాతము కావచ్చినది.
ఇప్పు డిఁక వారల వెదుకుటకు వ్యవధిలేదు. శాంతింపుము.

అశ్వ— ఏమి ? యింతకన్నను విజయమా ?

శా. చంపీచంపని రీతిఁ జంపితిని ధృష్టద్యుమ్ను సైన్యమ్ములన్
గుంపుల్ గుంపులుగాఁగఁ గూల్చితిని నేఁగుర్పాండవుల్ దక్క మా
యింపన్ జేసితిఁ బోటుమానిసుల నా కీనాఁటి కయ్యమ్మునం
దింపే వృష్ట దెదుర్కొనన్ గడఁగు వా రెందున్ గనన్ రామిచే.

కృత— గురునందనా! అప్పటి మాటట్టులుంచుము. ఇపుడుమాత్రము నిన్నెవ
రేనిఁ దేఱిపాఱఁజూడఁగలరా ?

తే. గీ. కట్టుపుట్టములెల్ల రక్తమున నిండి
నిదురలేమిని గన్నుల నెత్తురులఁ
బూల నిండు నశోకపు భూరుహమ్ము
ననుకరించునినున్ గన నడలువుట్టు.

కృపా— కుమారా ! నీ వింతకుమున్ను చెప్పినదే యైనను విస్పష్టముగాఁ
దెలియ మిని మరల నడుగుచున్నాఁడను. ఉపపాండవు లేమైరి ?

అశ్వ— ఏమైరా ? మేనమామలకుఁ దోడైరి.

కృపా— శివశివా ! ఎంతపాతకము నొనరించితివి !

అశ్వ— (వెడనవ్వుతో) పాతకము గాక యిందొకటి పుణ్యమున్నదా !

ఉ. పాపమొ పుణ్యమో విను మపాండవమున్ బొనరించువాంఛ నే
నీపనిఁ బూనితిన్ మిగిలి రేవురు వారలు వారిఁ జంపుచే

యీపసిబాలురఁ గెడపు టీపయి వారలు రాజ్యమేలఁగా
నోపరు ; దీనిచే మన సుయోధనుచిత్తము సంతసిల్లెడున్.
ఇఁక నేనీ పాపోపశాంతికై తపంబు చేసికొన నేగెదంగాని మీరీ శుభవార్త
పుత్రశోకాతురుండగు నాంబికేయున కెఱిఁగించి యూఱడింపుదురుగాక।
ఉభయులు— మంచిది (వెళ్ళఁబోవుదురు.)
అశ్వ— మామా ! మాట, రారాజుతో నిందాఁక నీమాట చెప్పితిరా ?
కృపా— ఏమాట ?

క. "ధృష్టద్యుమ్నుని నీకు న
నిష్టుని నిద్రించియున్నయెడ నెన్నెన్నో
కష్టములు పెట్టి తుదకు ని
కృష్టంపుం జంపుఁ జంపి కెడపితి ననుమీ."

ఇట్లు పుణ్యలోకగతుఁడగు మీతండ్రితోఁ జెప్పు మనియేనా ?
అశ్వ— అవును.
కృపా— చెప్పితిమి. మాకు బాగుగ జ్ఞాపకమున్నది.
కృత— ఇదియే కాదు. "తక్కిన మనరాజుల నందఱిని గూడ నడిగితి"
నని సయితము చెప్పుమంటివి నీవీ క్రోధావేశముచే నిప్పుడు మఱచితివి.
అశ్వ— అట్లయినఁ గృతకృత్యుఁడనైతిని. మీరు చనుఁడు. నేనునుం బోవు
చున్నాను. (కృపకృతవర్మలు నిష్క్రమింతురు.)

(అశ్వత్థామ కౌంతవఱకు నడచి తనలో)

అప్పుడే భగవంతుండగు సూర్యుఁ డుదయించినాఁడే ?

క. మందేహు లనెడి రక్కసు
లందఱినిం దునిమి రక్తమది తన దేహం
బం దెల్ల నిండ రవి నా
చందమునఁ బత్పదవికిఁ జనియెడి నడుగో.

అవును. ఇంతకన్న సన్మార్గమేముండును ? సన్న్యస్తశస్త్రుండనై తపంబున
కేగుచుంటిఁగదా ? (దృష్టినిగుడ్చి) అడిగో ద్వైపాయనాశ్రమము.
ఇఁక ఖడ్గ మెందుకు ? (ఖడ్గము నుద్దేశించి)

ఉ. భాగములన్ వధించెడి కసాయి విధమ్మున గుత్తికల్ దెగం
గాఁ గెరలించి రక్తమును గంఠము నిండఁగ సారెసారెకున్
ద్రాగితి తృప్తినొందితి పినాకిపదమ్ముల వ్రాలి మ్రొక్కినా
యాగతి నెల్ల దెల్పఁ జనుమీ యిఁక నిన్నుఁ బరిత్యజించితిన్.

(ఖడ్గమును బాఱవైచి పరిక్రమించి) ఇదిగో ద్వైపాయనాశ్రమమ్ము నకే వచ్చితి నిఁక నిమ్మునలతోఁగూడి వారు చెప్పినచొప్పున నిప్పాతకమ్మునకుఁ బ్రతీకార మ్మొనర్చికొనియెద. (వైమనస్యముతో జందెము చేతఁబట్టుకొని)

క. పుట్టినది బ్రహ్మకుల మెటు
పట్టించితి వాయుధమ్ముఁ బట్టించితి పో
యిట్టిపనులు సేయింతురె
కట్టా ! యజ్ఞోపవీతకమ ! దయవలదే.

( తెరలో )

మ. గురుపుత్రుండని మీకు సందియము గల్గుం గాక భీముండు ము
ష్కరులన్ సైఁచెడివాఁడు గాఁడు గురువౌఁ గా కన్యుఁడౌఁ గాక దు
శ్చరితున్ జంపక యున్నరాజు చెడు వాత్సల్యమ్ము లేనట్టి యి
ద్దురితాత్మున్ వధియించి ద్రోవదికి సంతోషమ్ము గావించెదన్.

(కృష్ణార్జునులతో భీముఁడు ప్రవేశించును.)

అశ్వ— కానిమ్ము దీని కేమి. మంచిపనియే చేయించితివిలే.

తే. గీ. పరశురాముఁడు మును రాజవరులనెల్లఁ
దునిమెనని చెప్పుటది కొంత తప్పుపట్టె
మరలఁ బొగరెక్కె నీ రాచమండలంబు
తిరిగియును బ్రహ్మతేజమ్ము దెలిపితీవు.

అమ్మహాత్ముఁడు పోవుగతికే యేనును బోవుదుఁగాక. (సంశయముతో) అమంగళము శాంతించుఁ గాక. అతఁడు తుట్టతుదకుఁ గురువంశజుఁ డగు భీష్మునిచే నవమానింపఁ బడియె; నట్టు నాకునుం గలిగెడినని స్ఫురించుచున్నదే ! (ధైర్యముతో) కానిమ్ము బ్రహ్మశిరోస్త్రంబు నాయొద్ద

నున్నంతవఱకు నీ కురువంశజులగు నర్జునుండును గిర్జునుండును, భీముం డును, గీముండును నన్నేమి సేయఁగలరు. (నిష్క్రమించును.)

భీము— బావా! యమనందన! నీవింత మెల్లగా రథము నడిపినం గాదు. త్వరగాఁ బోవనిమ్ము. లేదా నేను ముం దేగెదను. మీరు వెనుక రండు. ("గురు పుత్రుండు" అనునది మరలఁ జదివి పోఁబోవును)

కృష్ణు— (చేయి పట్టుకొని) బావా!

చ. గురుసుతుఁ డన్న నేమియనుకొంటివొ! ద్రోణునికన్న నెక్కు డె
వ్వరికి నవధ్యుఁ; డీవు బలవంతుఁడవే యనుకొ; మ్మరైననున్
ద్వరపడు టొప్పునే! యతని దర్ప మెఱుంగనిదే! యుపాయమున్
బఱపినఁ గాక మత్తకరిఁ బట్టుకొనన్ వశ మౌనె యేరికిన్?

భీము— (కోపముతో) ఏమంటివి?

క. ఏమంటివి గురుసుతుఁడా
నాముందఱ నిల్చువాఁడు! నా గద యశ్వ
త్థామను గిశ్వత్థామను
భూమికి బలియీదె, దీని పొగ రెఱుఁగనిదే?

అర్జు— అన్నయ్యా! శాంతింపుము.

తే. గీ. అతఁడు చిరజీవి వివిధశస్త్రాస్త్రవేది
యతనిఁ జంపఁగ మనకెట్టు లలవియగును?
పరిభవ మొనర్చి ద్రుపదాత్మభవకు దుఃఖ
భరము దీర్చుటయే పెద్దభరము తుదకు.

క. ఇరువురము సమానమ్ముగ
గురునొద్దన్ జదివితిమి? యగుం బుత్రుం డా
గురున కతం డే శిష్యుఁడ
విరువురకున్ భేద మింత యిట నుండుఁ జూమీ.

చ. అతఁ డిటువంటి పూన్కి మెయి నాహవభూమికి బుద్ధిపూర్వక
స్థితి నరుదేఁడు; వచ్చినను జేసెడి చేఁతమె లేదు; నేఁడు దు

శ్మతి యగు నా సుయోధను పరాభవమున్ విని స్వామియప్పు డీ
ర్చ్య తలఁపు వుట్టి యిప్పనికిఁ జొచ్చె నతం డతి రౌద్రమూర్తియై.

కృష్ణు— సంశయ మేమి ? వెనుక నారాయణాస్త్రమ్ము ప్రయోగించునప్పు డేమైనది ? అది యాతఁడుమాత్ర మెఱుఁగనిదా ? భీష్మద్రోణకృపాశ్వత్థామలు నల్వురును మన కజేయులే. అయినను, అందు రెండు సముద్రమ్ముల నాయా యుపాయమ్ములం జేసి దాఁటితిమి. తక్కు రెంటితో మన కప్పు డంత యవసరమే లేకపోయినది. ఇప్పు డిప్పనియైనను,

క. అనయమతి యైన దుర్యో
ధనుపంపునఁ జేసెఁ గాని తనయంతన తా
నొనరించునె గురుసుతుఁ డెం
దును ధర్మాధర్మపద్ధతులు నేరఁడొకో.

అర్జు— సంశయమేమి ? ఎంత యోగ్యుల కైనను రాజనిరోధమ్మునఁ గొన్ని యకృత్యమ్ములు పొసఁగుచుండును.

చ. గురుఁడును భీష్ముఁడున్ మనకుఁ గూర్చెడివారలు కారె, వార లి
ర్వురుఁ జనుదేరె యుద్ధమునఁ బోరఁగఁ, జంపరె పెక్కుమంది, నె
వ్వరుఁ దమ పూను వేషమును బట్టి చరించుట యొప్పదే ! మతుల్
దిరుగవె తన్మయం బగుగతిన్ బవరంబు లొనర్చుపట్టునన్.

కృష్ణు— నీవు చెప్పినదియే యిక్కడఁ దగియున్నది. నాటకములోని వేషధారులే యొకప్పుడు తన్మయు లగుచుఁ దత్తత్కృతులకు సిద్ధ మగుదురు. అట్టిచో నిజముగా యుద్ధసన్నద్ధు లగువారి కాయా సమయమ్ముల బంధుత్వాదికంబు పొడకట్టునే ?

భీము— యుద్ధసన్నద్ధు లగువారిం జంపిన నీతఁ డపరాధియే కాఁడు.

క. ఎదఁ జేయి వెట్టికొని పొరి
నిదురించెడి వారిఁ బట్టి నింద్య మనక చం
పెదరపె శూరులు ! లోకం
బిది మెచ్చునె? వరము గలదె ! యిహముండెడినే ?

కృష్ణు— ఆఁతప్పునకే కదా, యితఁడు గురుపుత్త్రుండై నను బరాభవింపవలసి వచ్చినది.

(పరిక్రమింతురు)

అర్జు— అదిగో ద్వైపాయనాశ్రమము. అటఁ బారాశర్యమునీంద్రులు శిష్య సహితముగాఁ బుణ్యగోష్ఠిచేఁ గాలం బపనయించుచున్నారు. వారి దర్శింపవలసినదే కాని వా రిప్పటి మన యుద్యమమ్మున కంతరాయ మ్మొనరింతురు. కాన నిటనుండియే నమస్కరింపుదము. (రథమును దిగుదురు, నమస్కరింతురు)

భీము— (కొంత ముందు నడచి దృష్టి నిగుడ్చి) ఇదియే భాగీరథీతీరము. మన మాతని నీయెడలనే వెదక వలయును.

కృష్ణు— అదుగో! ఒక పిన్నసన్యాసి, కాఁడు కాఁడు అశ్వత్థామ.

తే. గీ. కేలజపమాల మెయినిండ రాలు బూది
దండను గమండలువు మ్రోలదర్భలొప్ప
నయనములు మోడ్చి కృష్ణాజినంబుమీఁదఁ
గూరుచున్నాఁడు తపసియై గురుని కొడుకు.

బావా! పవననందన!

చ. తనపొనరించు దుష్కృతికిఁ దద్దయుఁ బాండవు లల్గి వత్తురో
యనుభయమో, యిసీ! ద్విజుఁడనై పొనరింపఁగ రాని కృత్యమున్
బొనరిచినాఁడ నన్ హృదయమో ద్వయమో గురునందనున్ విర
క్తినిఁ గనఁజేయఁ బోలుఁ బరికింపుమ యీతనిదైన వేషమున్.

(అశ్వత్థామ ప్రవేశించును.)

భీము— (పండ్లు పటపట గొఱుకుచు) నీవు మొదల నుడివిన హేతువే సరిగా నున్నది. (ముందుకునడచుచు) ఓరీ! విప్రకులాధమ! భ్రూణహత్యాపరాయణ!

ఉ. బాణకలాభిమాన మది భగ్నముగా నిసివేశఁ బోయి ని
ద్రాణులఁ జంపి దొంగవలెఁ దాపసివై యిట కేగుదెంచితే!

ద్రోణపుత్రిష్ఠ గంగఁ బడఁ ద్రోచితె ! యింతన చావు దప్పెనే !
ప్రాణము లింత తీపె ? పసిబాలురఁ జంపితి వేమి ? దుర్మతీ !

అశ్వ— (చూచి తనలో) ఓహో భీముఁడా ! వెనుకఁ గృష్ణార్జునులుగూడ నున్నట్లున్నారే ! అగుం గాక, వీరిలక్ష్యమేమి. (ఊరకొనును)

భీము—తే. గీ. లేచిరావేమి రోరి ? నీ పీఁచ మడఁతు
నీచపుం బనిఁ జేసియు నేమమేల ?
గురుసుతుండ పటం చూరకొందు మనుచుఁ
దలఁపఁబోకుమ ! యా దారి తప్పెనేఁడు.

చ. చదివితి వేమి సార్థకము శాస్త్రము వేదము నెల్ల విద్దెలున్ ?
మది నొకయింతయున్ దయయు మానము లేని వివేకహీనపుం
బ్రిదుకును గణ్యమే ? యెటకుఁ బాఱిన నెయ్యెడ సొచ్చినన్ క్షమిం
పదు గద! నే క్షమించినను మద్గద యోరి దయావిహీనుఁడా !

(కృష్ణార్జునులు సమీపించుచున్నారు.)

అశ్వ— (తనలో) మనమూరకున్నను ఈతఁడూరకొనునట్లు లేదు. ఈ ప్రేలరి కిదియే యుత్తరం బగుఁగాక (తృణమునభిమంత్రించి) తల్లీ ! బ్రహ్మశిరంబ ;

చ. ధర కలిగెం గదా ! యనెడి దర్పమునన్ బొగరెక్కి "దేవునై
గురువునునై" యనుంగతిని గ్రొవ్వి చరించెడి యిద్దురాత్మలన్
బొరిగొని నాదుపూన్కి మెయి భూమి నపాండవమున్ బొనర్చి య
క్కురుకులనాథు చిత్తమునకున్ ముదమున్ దనుకంగఁ జేయుమా.

(విడుచును.)

కృష్ణ— (తత్తఱముతో) అర్జునా ! అర్జున !

ఉ. పావనిపల్కులన్ గనలి బ్రహ్మశిరంబు సరంహుఁడై మహీ
దేవసుతుండు నించె నిది ద్రిప్పఁగ నాకును. నీకును మహా
దేవునకున్ గడింది వెస దీనికి దీనినె పంపుమయ్య యా
పైవిధిఁ చూచుకొంద మదె పావని చచ్చెడిఁ జచ్చెడిన్ సఖా !

అర్జు— (శరమభిమంత్రించి విడిచి)

శా. అమ్మా! బ్రహ్మశిరంబ! నాగురుఁడు ద్రోణాచార్యపుత్రుండు జీ
వమ్ముం బాయక యుండఁగా వలయు; మావంశమ్మునున్ మేము సౌ
ఖ్యమ్మున్ గాంచవలెన్; బ్రపంచమునకున్ గష్టమ్ము రా రాదు; నీ
విమ్మైనన్ను ననుగ్రహించి చనుమీ! యీ యస్త్రమున్ ద్రిప్పుమీ!

(తెరలో) ఓహో సాత్యవతేయ! దగ్గఱ నుండియు నిట్టిపని చూచుచు
నూరకుంటివేమి? వారింపుము వారింపుము.

(వ్యాసులు ప్రవేశించును)

వ్యాసు— (ఆకాశము వంకఁ జూచి తనలో) ఓహో! నారదులవారి వాక్య
ములా యివి!

(నారదుఁడు ప్రవేశించును.)

నార— ఓ అశ్వత్థామార్జునులార!

క. ఇప్పటికి నెన్నియుద్ధము
లిప్పుడమిం జరిగె! నెవ్వరేనియు దీనిం
గుప్పిరె? యిది జగ మడఁపదె?
యిప్పాపపుఁ బనికి మీర లెట్లొప్పితిరో?

వ్యాసు— అర్జునా!

క. గురువన గురుసుతుఁ డన నొ
క్కరూపు గాకున్నె? యతఁడు కనలిన మనకుం
ద్వరపడు టుచితమె? శరమున్
మరలింతువు గాక జగము మాయించెదవే?

అర్జు— (వినయముగా) మహాత్ములారా! క్షమించి నామనవిచిత్తగింపవలయు

క. మీయానఁ గట్టువడి నే
నా యస్త్రము గ్రమ్మఱింతు నతఁ డారీతిన్
జేయునొ చేయఁడొ యది మీ
రే యూహింపంగవలెఁ జుఁడీ దయకలిమిన్.

(అస్త్రమువంకఁ జూచి) అస్త్రరాజమా!

తే. గీ. గురువునెడ భక్తిఁగలనేని గూళతనపుఁ
ఒనికిఁ జొరనేని భీతులఁ జెనకనేని
నిన్ను నమ్మి పూజించితినేని శాంతిఁ
జెంది లోకహితంబు సేసెదవుగాక.

నార— కుమారా! నీయస్త్రముం గూడ నుపసంహరింపుము.

అశ్వ— ఇదిగో నుపసంహరింపుచున్నాఁడను. (తనలో)

గీ. అతఁడు దేవాంశసంభవుఁ డగుటఁజేసి
యధిక గురుపాదనిరతాత్ముఁ డగుటఁజేసి
యుపశమింపఁగ నేర్చె నా కుపశమింప
రాదు. చేసెడిదేమి? యీమీఁద నేను.

ఇట్లగుంగాక (ప్రకాశముగా) మహాత్ములారా! వినుండు.

చ. ఎఱుఁగుదు నిట్టి యస్త్రమును నేయుట తప్పని; రాజరాజు నాఁ
బరఁగు సుయోధనున్ శిరము వ్రయ్యఁగఁ దన్నిన దానిచేఁ గృథా
భరము వహింపలేక యిది పాండవులన్ గడతేర్చుపొంలె నేఁ
బఱపితి లోక మీ శరమువారికిఁ దా గుఱి గాక యుండుతన్.

వ్యాసు— ధర్మాత్ములగు పాండవుల వధించుట నీ తరముగాదు. మామాట
విని మఱలింపుము. మఱియు నింకొకటి వినుము.

తే. గీ. పోరు దుర్యోధనునితోడఁ దీఱె మీకు
నిరువురకు నాల మియ్యది యెందుకొఱకు?

నార— ఎందుకొఱ కననేల? ఇతఁ డొనర్చిన యకార్యముంబట్టి సహేతు
కమే యయినను యేదో యొకవిధమున సంధి యగుట శ్రేయము.

వ్యాసు— (ఆలోచించి) గురునందనా! యెవరేని నీది తప్పనక తీరదు.
సత్యప్రతిజ్ఞులగు పార్థులు మిన్నక పోవువారు గారు. కావున,
నీ శిరోమణి వారి కీ నేర్చెదేని
సంధి యగు నింత కొంఁడు పొసంగ దించు.

అశ్వ— (తనలో) ఓహో! మును లెంత పక్షపాతముగాఁ దగవు దిద్దు
చున్నారు. అగుఁగాక. ముని నైతింగదా! ఇఁక వైరము తగదు.

ఈ మణితో నా కేమి యవసరము ? (ప్రకాశముగా)

చ. కురుపతిఁ గెల్చి రత్నములు గొల్లలుగాఁ గొనినట్టి ధర్మభూ
వరునకు నిట్టి రత్న మొక బ్రాఁతియె ? విప్రుల ద్రవ్యమున్ గ్రహిం
చిరె నెగడన్ దలంచు నృపశేఖరు ? లిచ్చితి దీని నో మునీ
శ్వర భవదర్పితమ్ముగ, భవద్వచనం బవిలంఘ్య మౌటచే.

ఇద్దాని ధరించువారలకు నాఁకలియు దప్పియు శ్రాంతియు నెప్పుడును జనింపవు. ఇటి నాప్రాణమ్ము నిచ్చియు నిఁక శాంతి యెట్లుపొంద నేర్తును ; (కోపముతో)

తే. గీ. బ్రాహ్మణస్వాపహారమ్ము పాండవులకు
వేడ్కగావున నిది పాండవేయ దార
గర్భములనెల్ల హరియించుఁగాక పిదప
శాంతి గనుఁగాక కనుఁగాక సంతసంబు.

కృష్ణు— (తనలో) ఓహో ! యీ దురాత్ముఁడు మరల నస్త్రమును బ్రజ్వ లింపఁ జేయుచున్నాఁడే !

మునులు— అందొక్కటి మా వచనంబున నిలుచుఁగాక.

కృష్ణు— విధిగా నట్లగుంగాక.

అశ్వ— (తనలో) ఉత్తరాగర్భము గాఁబోలును. (ప్రకాశముగా) మీ పక్ష పాత వచనమ్ము నిప్పట్ల సాఁగవు.

ఉ. మీరును మీరునుం గలసి మెల్లఁగఁ జల్లని మాట లాడినం
దీటెడిపాటి గాదిది సుతీక్ష్ణము బ్రహ్మశిరోస్త్ర, ముత్తరా
దారకు గర్భమంద భసితం బొనరించెడిఁగాక దానిచేఁ
బోరిది యేల వచ్చెనని పొక్కుచు నుందురుగాక పాండవుల్.

కృష్ణు— గురునందనా ! యిటు చూడుము.

ఉ. నీదగు నస్త్ర మిట్టిదని నేను నెఱుంగుదు; నందుకే కదా !
నీదెస నింత చెప్పితిమి నీ వటు చంపెదవేని వానికే
నే దయఁ బ్రాణ మిచ్చితిని నీవిఁకఁజేసెడి దేమి ? పొమ్ము నిన్
గాదన నేల ! నీకుఁ దగుఁ గా కిది యొద్దకు నెందుఁ జెల్లునే.

అక్రూరుండు నీ మేనమామయొద్దనే యస్త్రవిద్య నేర్చికొని భూమిం బరిపాలించుఁ గాక. నీ విప్పాపమ్ముననం జేసి మూఁడువేలేండ్లన్నవస్త్రమ్ములు దొరకక దుర్గంధదూషితశరీరుండవై తిరుగుదువుగాక.

వ్యాసు— అది తప్పక యమోఘమ్ముగుఁ గాక.

అశ్వ— ఏమీ! నన్ను శపించితివిగా! నీకును నేను బ్రతిశాప మీనేర్తును గాని యయ్యది నేఁట రేపట నొక్క పతివ్రతాశిరోమణిచేఁ గానై యుంటఁజేసి యూరకుంటి.

చ. విదురుని యింట విం దనుచుఁ బెట్టితి సంధి చెడంగ; నాజికిం
గుదురని వానిఁ బార్థుఁ బురికొల్పితి గీత లటంచుఁ జెప్పి; యా
పద గలవేళఁ గర్ణుపయిఁ బంపితి పార్థుశరంబు; చక్రమున్
దుద కొకసారి పట్టితివి; ద్రోహము లియ్యవి కావె? మాధవా!

ఇవి యిట్లుండుంగాక.

చ. నరుఁ డతిధర్మతత్పరుఁ డనం దగు నుత్తముఁ డయ్యు నీ వచ
స్సరణికి లోఁగి కాదె విరసమ్ములు పెక్కులొనర్చె; నాఁటి సం
గరమున సన్న సేయు టది కాపురుషుల్ పొనరించుకృత్యమా?
పరువు గలట్టి యుత్తముల పద్ధతియా? వివరింపు మో హరీ!

నీవు విష్ణ్వంశసంభూతుండ వగు మహానుభావుండ వగుటం జేసి నిన్నేమియు ననఁగూడదు కాని యైనను యథార్థమునకుఁ దప్పుండఁగూడదు గదా.

ఉ. కర్ణుఁడు దుర్జయుం డగుచుఁ గౌరవనాథుని బాడుచేసె? నీ
విర్ణయ మాదరించి యవినీతులు పాండవులైరి; నీవునుం
గర్ణుఁడు లేక యున్నయెడఁ గౌరవపాండవయుద్ధ మున్నదే?
కర్ణుఁ డొకండె దుర్జనుఁడు గాఁడు సుమీ వసుదేవనందనా!

ఇఁక నొకమాట నీతోఁ జెప్పి విరమింప నెంచుకొన్నాఁడను. ఇదియుం గూడ సావధానంబుగ నాకర్ణింపుము.

ఉ. పావనుఁడైన ధర్మజునిఁ బట్టిపలార్చి విరోధపెట్టి నా
చావు వచింపఁజేసి కలశప్రభవున్ గికురించి చంపి; తీ
యేవపుఁగార్యముల్ జగము నెల్లెడ నెవ్వ రెఱుంగనట్టివా?
రీవిఁకఁ గోటిజన్మముల నెత్తిన నిద్దురితమ్ము వాయునే?

ఇంకను నీ దోసమ్ము లనేకములు గలవు గావి నేఁ బోవుచుంటి క్షమించి నాయందు దయ యుంచుము. (నిష్క్రమించును)

వ్యాసు— (రత్నమును భీమునికిచ్చి) నాయనా! పవమాననందన!

ఉ. ఈమణి నిచ్చి ద్రౌణిశిరమే యనుకొమ్మని చెప్పి పుత్రశో
కామయమగ్నయౌ ద్రుపదునాత్మజ నూఱడిలంగఁ బల్కుఁడీ;
క్కామిని ధర్మజుం డెదురుఁ గన్నులు గా మిము వేఁచి యున్నడు; మీ
రీమెయి నిల్వకే చనుఁడ యేమును బోయెద మిచ్చకచ్చగన్.

(వ్యాసాదులు నిష్క్రమింతురు.)

(ధర్మరాజును ద్రౌపదియుఁ బ్రవేశింతురు.)

ద్రౌప— అయ్యో! కుమారులారా! అభిమన్యుని మృతికే విచారించుచుండ మీరుఁ గూడ గన్మొఱంగితిరా? అయ్యో! అన్నలారా అయ్యో తండ్రీ! అక్కటా! పుట్టినదిమొద లెన్నఁడును సుఖమెఱుగనైతిఁ గదా! అన్నా జూదమా! యెంతచేసితివి!

ధర్మ— దేవీ! యూఱడిల్లుమూరడిల్లుము. క్షత్రియపుత్రుల కిట్టిమరణమే యెప్పటికైనఁ దటస్థించెడిది. (తనలో)

మ. గురులన్ జంపి కుమారులన్ గెడపి కోర్కుల్ మన్నుగాఁ జేసి యి
క్కురువంశమ్మును బాండువంశమును బొగ్గుల్ సేసి తే మంచు విన్
జిరకాలమ్ముననుండి రాజవరు లుచ్చేదింపరై రో దురో
దరమా! నీదగు పేరెఱింగియును గట్టా! మోసపోతింజుమీ.

ద్రౌప— అయ్యో! యీదుష్కృత్యము వలదని కృపాచార్యులైన బోధింపకపోయెఁ గాఁబోలును. తండ్రులారా! ఎంతదుర్మార్గురాలనైతినోయి!

(కృపాచార్యులు ప్రవేశించును)

కృపా— ద్రుపదరాజపుత్రీ! నేను బోధింపక పోయినవాఁడఁగాను. తల్లీ! యిది యంతయు నపశ్యంభావియగు కాలపు దౌర్మార్గ్యము అట్లుకాదేని,

ఉ. ఏగురఁ బార్థులన్ మిషమెయిన్ దొలఁగించిన యాదవోత్తముం
డీ గుఱు తించుకం తెఱుఁగఁడే? యిటు లొటకు నొప్పికాదె తా
మేగెడివేళ వీరి విటనే దిగఁద్రోవుట నాఁటఁ బాండవుల్
దాఁగిరి గాని ప్రాణములు దక్కుట దుర్లభ మేరికేనియున్.

ధర్మ— ఆచార్యా! యెప్పటికన్న నాఁటి విశేషమేమి?

కృపా— చెప్పెద నవధరింపుము.

చ. అటులు సుయోధనుం డనుప నయ్యెడ కేగెడివేళ మధ్య నొ
క్కట వికృతాకృతిన్ శివుఁడు గానఁగనై తుదకున్ బ్రసన్నుఁడై
"యిటు విధిచోదితంబ యగు మీవు నిమిత్త" మటంచు ఖడ్గ మొ
క్కటి దయచేసి తా నతని కాయమునం దిమిడెన్ స్వయమ్ముగన్.

ధర్మ— వింటివా? పాంచాల రాజపుత్రీ! ఇది ప్రళయకాలరుద్రుం డొనర్చిన కృత్యముగాని యశ్వత్థామది కాదుసుమీ!

ద్రౌప— మనుజులు నిమిత్తమాత్రులుగాని యన్నింటికిని భగవంతుఁడే మూలము. అయ్యో! తండ్రులారా! మఱఁదులయందు దయగల్గు శ్రీకృష్ణునకు మీయందు దయలేక పోవుటయు నా దురదృష్టమే!

ధర్మ— పతివ్రతా శిరోమణీ! ఇది యవశ్యంభావియే కానిచో,

ఉ. వెన్నుఁ డెఱుంగనట్టి పని వీసము నుండ దెఱుంగనట్టి భం
గిన్నటియించు; భూభరము కేవలమున్ హరియించుపొంతెఁ దాఁ
బన్నెనటంచు వింటిఁ గురుపాండవయుద్ధ, మబద్ధమౌనె? యా
పన్నులఁ బ్రోచుశౌరి కిది భారమె! వీరల కాయు వుండినన్.

కృపా— సమస్తధర్మవేదులగు మీ కొరులు చెప్పవలసినది లేశమునుం గాన రాదు. అమ్మా! ద్రౌపదీ!

ఉ. ఏల సమస్తముం దెలిసి యిట్లు వృధా విలపించెదమ్మ? గో
పాలుఁడు నిన్నుఁ జెల్లెలిని బాలన సేయక మిన్న కుండునే
వీ లోకయింతయున్న? నిది విశ్వజన ప్రళయంబు కానిచో
నాలములోన లేని గురునాత్మజుఁ డేమిటి కల్గఁగావలెన్.

ద్రౌప— ఎందు కల్గిన నేమి. నా కడుపునఁ జిచ్చు వెట్టెనుకదా. అయ్యో! బ్రాహ్మణుఁడై పుట్టి యిట్టి యకృత్యమునకుఁ బాలుపడుట యెచ్చటను గన్నదియు విన్నదియుఁ గాదు. కొడుకులారా! అప్పాపాత్ముఁడు మిమ్మెంత కష్టపెట్టి చంపెనోకదా!

ధర్మ— (ఆలోచించి) ఆచార్యా! యిఁక నొక్క బాహ్యకారణ మియ్యెడ లేకపోలేదు సుమీ!

చ. దుశ్రపమని నాఁటనుండియును ద్రోణునికిం బడఁ దక్కఁతమ్ము నన్
ద్రుపదసుతుండు ద్రోణుతల ద్రుంచె నధర్మము గాఁగ; దానిచేఁ
గుపితమనస్కుఁడై యితడు కోలుమసంగెను సైన్యమెల్లఁ; గో
పపరివృతాత్మ లౌజనులు పాపముఁ బున్నెముఁ జూడ నేర్తురే!

కృపా— అవును. నీవనినదియు యథార్థమే (పరికించి) రాజా! భీమార్జును లెక్కఁడ?

ధర్మ— (సంశయముతో) పుత్రశోకాతుర యగు పాంచాలి నూరార్చ గురుపుత్రునిపై కరిగిరి.

కృపా— (కొంచెము కోపముతో)

గీ. అందఱముసల్పియుంటి మనర్హకృతులు
గణనచేసిన విందు యోగ్యతములెవరు?
నీ వెఱుంగవో సంగతి నేనెఱుఁగనో
భారతమె బొంకుగాదె? యో పార్థివేంద్ర!

ధర్మ— (తనలో) ద్రోణునిమృతికై నాయొనరించినదుష్కృత్యము నుగ్గడించుచున్నాఁడే? (ప్రకాశము) అవును, సత్యమే. నాకు గురుపుత్రునిఁబరాభవించుట యంత యిష్టమేలేదు. మన కర్మమున కతఁడేమియొనర్చును. మీరు భీముని కోప మెఱుఁగని వారు కారుగదా! అతనివెంటఁ గృష్ణార్జునుల నేదో యొకవిధమున సంధి గావింపుఁడని పంచితిని.

కృపా— రాజా! మంచిపని చేసితివి. నీకు సర్వవిధముల వృద్ధియగుఁ గాక!

చ. మిగిలిన వార మేని యిది మే లది కీ డని చెప్పికొంచు దై
వగతికి నక్కజంపడుచు వందురువారల కొండొకళ్ళు శాం
తి గలుగఁ జేసి కొంచు సుగతిన్ గనుమార్గము చూచుకోక యీ
పగ లివి యేల? మీరనఁగఁ బార్థివ మేమన నేఁటివారమే?

క. మీరని కొమరుం డనియును! నారయఁ దొక్కింత భేద మాదేశికుఁ; డా
ధీరుమొగ మైనఁ జూచి వి! చారించితి మంచితోశ్రవ సారాచారా!

ద్రౌప— అయ్యో! పట్టరానిశోకమ్మున మారుతిం బ్రేరేపితి. దీన నేమి యుపద్రవము సంఘటిల్లునో? దైవమా! ఇప్పుడిఁక నేమి చేసినను నా కొమరులు లేచిరారుకదా!

కృపా— (తనలో) ఆహా! యీమె యెంతయోగ్యురాలో కదా! ఇట్టి సమయమ్మునఁ గూడ వంశద్రోహి పట్ల నిట్లు పశ్చాత్తాప పడుచున్నది. (ప్రకాశము) అమంగళము శాంతించుఁ గాక! కృతసంధులై యరుదెంతురుగాక!

(అంతఁ గృష్ణ భీమార్జునులు ప్రవేశింతురు.)

భీము— పాంచాలరాజపుత్రి! ఇదిగో నాతని శిరోరత్నము. నీ ప్రతిన నెరవేర్చుకొనుము.

ద్రౌప— (పుచ్చుకొని) దీనికేమి! యమ్మహాత్ముఁడు నా కొమరులవలెఁ దల్లికి దుఃఖదాయి కాలేదు కదా!

కృష్ణ— వ్యాసాదుల యనుగ్రహముం బట్టియు ద్రోణుని నిష్పక్షపాతముంబట్టియు నిప్పటికి మీయత్తగారును నానెయు ధన్యురాండ్రే.

ధర్మ— (సంశయముతో) అర్జునా! బ్రహ్మశిరంబు ప్రయోగించెనా యేమి?

అర్జు— అన్నగారి పలుకులం గనలి మొట్టమొదటనే యాతఁడు దానినుపయోగించెను.

గీ. గగనమెల్లను మంటలఁ గప్పిపుచ్చు
నమ్మహాస్త్రమ్మునకు నెవ రడ్డుపడుట!
యతనితండ్రియె యస్త్రమైయవతరించి
మనలఁగాపాడె; లేకున్న మనము మనము.

ధర్మ— అమ్మహాత్మునిం దలఁచుకొన్న నా కెవ్వరిచావుకన్న దుఃఖము వొడమెడుఁజుమీ!

చ. కొమరునికన్న నెక్కుడుగఁ గూర్చు తలంపున విద్య చెప్పె! సా
ధ్యమయిన వట్టుఁ దా మనలఁ దాఁకకయే బవరంబొనర్చె; రా
జ్యము మన కీఁదలంచి తనచావున కేనియు నొప్పె; నిట్టి యు
త్తముఁడు దటస్థమౌనె? యిఁకఁ దమ్ముఁడ! జన్మము లెన్ని యెత్తినన్.

అర్జు— ఒక్క యీయనయే యేమి? వీరో,

చ. కృపుఁ డను నామ మీయనకె కేవలముం దగుఁగాక యాలమం
దెపు దెవరిన్ వధించు నటులే కనుపట్టఁ; దసాధ్యమైన బా

హూపటిమ గల్గి యీతఁడిటు లూరక యుండుటఁ జూడ, నస్మదీ
యపరిభవాన కొప్పమియె యొఁజుమి కారణ మెన్నిభంగులన్.

కృపా— నీ వనినట్లే సాధ్యమైనంతవరకు సంచరించినను తుట్టతుద
కీ ఘోరకృత్యమునందు నేనుగూడ నుండవలసివచ్చెఁగదాయని విచా
రించుచున్నాఁడను.

ధర్మ— గురువర్యా! ఇవి యేటిమాటలు?

ఉ. ఉండక తీరునే యొరులయొద్దఁ దగన్ గొలువుండి! యందులో
భండన మాచరించుపనిఁ బట్టి చరించెడునప్డు; శత్రులన్
గండడఁగించు టన్న సరిగా నగునే! యొకవేళఁ గొన్నియు
ద్దండపు గార్యముల్ వలసి తప్పని వయ్యెడుఁ దప్పు మార్గముల్.

ద్రౌప— ఇంతకు నెవరి కర్మమున కెవరు కర్తలు? ఎప్పుడో యిట్టి
దుఃఖము నితరులకుఁ గలిగించితిని. ఇప్పుడనుభవించుచున్నాను.
ఒకరా! యిద్దఱా! అయిదుగురు కొమరులు వోయి రాయివలె
జీవించియున్నదానను.

ధర్మ— ఆశ్చర్యమేమి? నూఱుగురు కొమరులు వోయిన గాంధారి జీవించి
యుండలేదా!

కృష్ణ— ఇఁక నిట్లున్నకొలఁదిని దుఃఖ మతిశయించుచునే యుండును.
లెండు త్వరగా స్నానము లాచరింపుఁడు.

క. పరలోక గతులకొఱకె। వ్వరు నింటన్ దానమాడ వలదు; తటినికై
యరిగియటఁగ్రుంకు లిడుటయ। మరియాద సమస్తధర్మమార్గములందున్.

కృపా— అది యట్లే. నీవెఱుఁగని ధర్మము లేవి గలవు?

ధర్మ—(తనలో) అక్కటా! నాకుఁ బెద్దతండ్రిపోలికయే వచ్చినదిగదా
దైవమా! (అందఱును నిష్క్రమింతురు.)

— గద్య —

ఇది శ్రీ....తిరుపతి వేంకటేశ్వర ప్రణీతంబగు
పాండవాశ్వమేధమ్మునఁ బ్రథమాంకము.

ఓం

శ్రీ మత్సరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము.

(ద్వితీయాంకము.)

(అంత గాంధారీ ధృతరాష్ట్రులు విదురసహితముగాఁ బ్రవేశింతురు.)

ధృత— దేవీ! యూఱడిల్లు మూఱడిల్లుము.

ఉ. ఏకుటిలాత్ము లొడ్ల కెపు డెగ్గు ఘటింతురొ యేరు పెద్దలన్
గైకొని యేలరో సకలకష్టములుం దుది వారి కబ్బు: లో
కైకహితమ్ముగా నడచునట్టి మహాత్ములు సౌఖ్యభాక్కు: లీ
శోక మిదేల? దైవగతి చోద్యమె! శోకము కార్యకారియే?

గాంధా— (దుఃఖముతో) అయ్యో లక్ష్మణకుమారా! నీవైన బ్రతుక
వైతివిగదరా! నాయనా!

ధృత— తండ్రీ! యింత జరుగు నని యెఱింగితి నేని నిన్ను రణరంగ
మునకే పోనీయకపోదును గదరా!

విదు— దేవి నోదార్చుటకు బదులు తాముగూడ నజ్ఞానమునఁ బడెదరేమి?

ఉ. ఇయ్యెడ శోక మందు ఫల మేమి? సమస్తము మున్నెఱుంగమే?
కయ్యము సౌఖ్య మిచ్చుటయుఁ గల్గునె? యా యభిమన్యుఁ డిట్లనే
యయ్యకు నమ్మకుం గడుపునం దనలం బిడఁడే? జగమ్ములో
నెయ్యెడ నిట్టి శోకముల నెవ్వరు కుందనివారు? పార్థివా!

ధృత— (కన్నులు దుడిచికొని) నాయనా! దుర్యోధన!

చ. కడుపు దవానలంబుగఁ బొకాలెడిఁ; గన్నులు మున్నె కానరా;
పడలెడి మాకు నేమి గతి యంచుఁ దలంచితి వయ్య? మార్వరజా

గొడుకులఁ గన్న మాకు నొక కొడ్కును జేతికి సూఁత లేక పో
యెడినె ? విధాత నీయెడల నింత వహించునె పక్షపాతమున్ ?

గాంధా— తండ్రీ ! దుశ్శాసనా ! నిన్ను నేనెట్లు మఱచి పోదు నోయి !

విదు— (తనలో) ఎంత కష్ట మెంత కష్టము. వీరి కేమి చెప్పి యూఱ డిల్లఁజేయఁగలను. ఇట్టి కష్టము శత్రువులకేని లేక పోవుఁగాక (ప్రకాశము) అమ్మా ! వధూనికా !

ఉ. శత్రుల నాజి నోర్చి పెలుచన్ జగ మంతయు నాక్రమించి నీ
పుత్రకు లేలి యేలి తుదిఁబోయిరి యాహవరంగమం; దిదే
క్షత్రియు లైనవారలకు సమ్మత; మేడువ నేల ? ద్రౌపదీ
పుత్రులు పోరె ? జ్ఞాతులకుఁ బోరిత మూరక యిట్లు కల్గెనే !

ధృత— (కొంచెము సంతోషముతో) గురునందనుఁడు మాత్రము తుదకు మంచి పనిఁ జేసినాఁడు సుమీ తమ్ముఁడా ! ఇంతపని కర్ణుఁ డేనియుఁ జేయలేదనియే నా తాత్పర్యము.

విదు— (తనలో) ఇప్పటికిని నితని కీడుర్బుద్ధి వదలనే లేదు. అయినను నిప్పుడేమియు మన మనఁగూడదు. (ప్రకాశము) ఏమంత శ్లాఘ్యమైన పని చేయలేదు. ఈ యకార్యమునకు నీవంటి జ్ఞానవంతులు సంతోషించు టుచితముగాదు. ఇంత యెందుకు ? అతనికి బాసటగా నున్న కృపాచార్యులే యిందులకు సంతోషింపలేదుగదా ! ఈసంగతి యాయన చెప్పినమాటలవలన నీకు స్పష్టపడియే యుండును. "సర్వేజనా స్సుఖినోభవంతు" అందఱును సుఖముగా నుండవలెనని యెవరు కోరుదురో వారికి భగవంతుఁడు శుభముల నొడఁగూర్చును.

గాంధా— అమ్మా ! దుస్సలా ! మామూలమున నీకు వైధవ్యము తటస్థించినదికదా !

ధృత— ఓహో ! పుత్రశోక మెంత తీవ్రమైనది ! తండ్రీ ! దుర్యోధన !

ఉ. అల్లుఁడు పోయినప్పుడుఁ ద్వదాత్మజుఁ డీల్గిన యప్పు డెల్ల రా
ట్టల్లఁజు లేగినప్పుడు నెదం గుదియించితిఁ; గర్ణుపోకకున్

దల్లడ మంతగాఁ గొనని ధైర్య మదెక్కడఁ బోయె నేఁడు నీ
త్రెళ్ళినవార్త వింటిఁ గడతేఱితిఁ జచ్చితిఁబో పొకాలితిన్.

గాంధా— అయ్యో! అయ్యో! (మూర్ఛిల్లును)

విదు— (తనలో) ఆహా! పతివ్రతాశిరోమణీ! నీకడుపున నెంతటి దుండగులు పుట్టిరి? (ప్రకాశము) అమ్మా! గాంధారరాజపుత్రి!

ఉ. కన్నులు లేని భర్తదశఁ గాంచఁ గదమ్మ! యతండు నీదు దుః
ఖోన్నతిఁజేసి ప్రాణముల నూడ్చెడి; సౌఖ్యము నైచి, కష్టముల్
పన్నిన ధాతకై యడలఁ బాడి యటమ్మ? ద్వయమ్ము తుల్యమే
యన్న బుధోక్తులం దలఁపవమ్మ! పురాకృత మీడఁ బోవునే!

గాంధా— (మూర్ఛతెలిసి) అయ్యో! భీముఁ డెంత దుష్కృత్యము చేసినాఁడు.

ధృత— దేవీ! మన బంగారము మంచిదైనఁ గంసాలి యేమిచేయును?

ఉ. "మాయ దురోదరం బుడుగుమా" యననో! "ద్రుపదాత్మజాత న
న్యాయము సేయఁగాఁ దగదురా" యననో! "వెసఁ బాలు పంచి యా
దాయలతోడఁ గూడఁ దగదా" యననో! వినఁడాయె నింతకున్
బాయని మంచిచెడ్డ లవి పల్కలఁ దీఱునె? యింత సేయవే!

(కొంచెము కోపముతో)

గీ. స్యాలకుండవై కొంపను గూలద్రోచి
యాత్మజుల మేనమామవై యడఁచివైచి
తీవు చేసిన ఫల మిప్పుడింత తేట
తెల్లమాయె; వృథా మాట దీరు లనరు.

విదు— అన్నయ్యా! యేమి మీ వెఱ్ఱి. శకుని యేమిచేయును? దైవగతి యిట్లున్నది.

గాంధా— అయ్యో! తమ్ముఁడా! నీ వెందుంటివోయి?

ధృత— (తనలో) ఓహో! ఇది యీమెకు మఱింత దుఃఖహేతువైనదే! (ప్రకాశము) దేవీ! శోకావేశమున నొడ లెఱుఁగక యట్లంటినే కాని

యతఁ డేమి కర్ణుఁ డేమి యెల్లపుడును మన బాగునకే ప్రయత్నించిరి. అయిననేమి? మన మిరువురమును దురదృష్టవంతులము.

గీ. ఎన్నడో పెట్టిపుట్టితి మిన్ని బాము
లనుభవించుచునున్నార మవియె యిపుడు
కాదు కూడదటన్నఁ బోబోదుసుమ్ము
ఎవఁడు చేసిన కర్మమ్ము నెవఁడు గుడుచు?

విదు— (తనలో) ఇట్టిసమయమున నితని నేమియు ననరాదుగాని, ఐనను (ప్రకాశము) అన్నయ్యా! మొదటి నుండియు మీకీ భ్రాంతియే యింత తెచ్చినది.

చ. శకునియుఁ గర్ణుడున్ సలుపు సంగతులం దొకఁడేని మీరు లె
క్కకుఁ గనఁజేయుఁడీ సుకృతకార్యము! వీరల పొత్తుఁ జేసి కొం
పకుఁ గలిగెన్ వినాశనము పార్థివసత్తమ! యెందు బాలనా
యకము నశింపకుండునె! వృథాగ్రహముల్ తుది ముప్పొనర్పవే!

ధృత— అవును. తమ్ముఁడా! ఇది యంతయు నా లోపమే.

చ. పోరిఁ జెవి నిల్లు గట్టుకొని పోరితి; వేనును దేవియుం దురో
దర మది యాదిగాఁ బ్రతిపదమ్మును జెప్పితి; మింత వంత సు
స్థిర మయి యుండఁ బోలుఁ; జెవిఁ జేర్పక పోయె నొకింత యేని య
క్కురుకులపాంసనుండు; కడకున్ మముఁ ద్రోచె విచారనీరధిన్.

(యోజించి)

తే. గీ. అంతరించిన వంశంబు నడఁగ నీక
మన పితామహి కెందు కీ మమత పుట్టఁ
గావలయుఁ? గావలయునిన్ని కానిపనులు
శావలయు దానినాగఁగాఁగలరె యొరులు?

(అంత వ్యాసులు ప్రవేశించును)

వ్యాసు— (తనలో) అయ్యో! ఎంతకష్ట మెంతకష్టము! కొడుకుం గోడలి నే మొగముతోఁ జూతును? అక్కటా! నావంశమున కెంతముప్పు మూఁడినది. ఛీ! అజ్ఞానము నన్నుఁగూడ నావరించుచున్నదే.

ఉ. గీతలు సూత్రిముల్ దగ లగించితి మేటి విర క్తి నంది లో
కాతిగమైన జ్ఞానమున కాస్పద మైతివి; నన్నుఁ గూడ నీ
జ్ఞాతివధానలమ్ము పెలుచన్ గరఁగింపఁగఁ జొచ్చె నక్కటా!
రాతికినేనిఁ దప్పదు భరమ్మగు దుఃఖము చేత మున్నచో.

(విదురునితో ప్రకాశము) ఓహో యింత జరిగినదా?

విదు— మహాత్మా! వీరి దుఃఖమ్ము నాప నావశము గాకున్నయది. తామివ్వారిం దేర్చి యనుగ్రిహింపవలయు.

ధృత— (తనలో) ఏమీ! నా తండ్రియగు సాత్యవతేయుఁడా! (ప్రకాశము) దేవీ! యీఅడిల్లుము.

వ్యాస— ఆంబికేయా! ఏమి నీ యజ్ఞానము!

తే. గీ. ఎవ్వరేనియుఁ జేసెడి దేమి గలదు?
పాండుమరణంబువిని నేను బ్రితుకలేదె?
దానినటులుంచు భీష్మనంతటి సహోద
రుండుపోయియు నిటులొంటి నుండవలసె.

గాంధా— అయ్యో! అయ్యో! యెంత పాపాత్మురాలనైతిని. ఒక కొడుకు నేనియు మిగుల్పవైతివిరా నాయనా భీమన్నా!

విదు— అమ్మా! గాంధారరాజపుత్రి! వ్యాసభగవానులు వచ్చినారు. ఇఁక మనకు దుఃఖోపశాంతి కలుగును. శోకముమాని వారి దివ్యోపదేశములను విందము.

ధృత— తండ్రీ! సాత్యవతేయ!

చ. జగ మఖిలమ్ము నోర్చె జయశాలి భృగూద్వహు నాగెఁ దండ్రిచేఁ
దెగనివరమ్ముఁ గైకొనియె ధీరుఁడు భీష్ముఁడు డ్రెళ్ళనేల? యే
వగ నతఁ డంపశయ్యపయి వందురుచుండెనొ! వంశవృద్ధు ని
ట్టి గతికిఁ దెచ్చు కూళలకు దెప్పరమే యిఁక నేను నాసుతుల్?

వ్యాస— తనయా! అటు లనవలదు.

చ. తన కులమెల్లఁ బోవునని తా మునుమున్న యెఱుంగుఁ గాన నా
యనుజుఁడు స్వేచ్ఛజీవి యగు నైనను జూడఁగలేక యాదిస్నే

పని నెఱవేర్చి కొండొక నెపమ్మున నిట్లొనరించెఁ గానిచో
మన మెటు లొప్పఁ జెప్పుమ ? కుమార ! కుమారుల చావు చూడఁగన్.

అదియునుంగాక,

చ. అతని యనుజ్ఞఁ గైకొనియె యట్లొనరించిరి వారు ; కానిచో
బ్రతుకఁ దరంబె ? కృష్ణు నొక బ్రేఁతిగఁ జూడని భీష్ముముందు దే
వతలకునేని ; నీ కొమరువైఖరు లింతకు నింతఁ దెచ్చె ; దు
ర్మతు లుదయించు వంశములు మాయవె ? పెద్దలు బుద్ధిహీనులే !

విదు— "బుద్ధిఃకర్మానుసారిణీ" ఇంతకు నిది యిట్లు కాక తప్పదు.

చ. ఇరువుర మేలు గోరు జగదీడ్యుఁడు భీష్మునికన్న, వంశపుం
గురువగు ద్రోణుకన్న, ననఁగూడదు గాని, యొరుల్ వలంతులే?
యెఱిఁగియు నాపయిం దురము నేమని తా సరిపెట్టఁడయ్యె న
క్కురుపతి ? సర్వనాశనము గోరకయుండిన నింత సేయునే !

వ్యాసు— మన మిప్పు డేమనుకొన్న నేమిలాభము ?

చ. జరుగవె పెక్కు యుద్ధములు, చావరె పల్వురు, పూర్వకాల మె
వ్వరికిని నిట్టి సంగరము వచ్చినయట్లును నిట్టి దుర్మృతుల్
దొరఁగినయట్లునున్ వినము; దోర్బల ముండిన నుండుఁగాక, యొం
డొరులు నశింతురే ? కడుపు లొక్కటఁ గాలిన యన్నదమ్ములై.

ధృత— అయ్యో ! దైవమా ! సర్వసముఁడ వగు నీకీ పక్షపాత మేఁదుకు?

ఉ. ఐదుగు రైదుగు ర్గలిగి యట్లన యుండిరి సోదరాత్మజుల్;
నాదు సుతుల్ శతంబును వినాశము నందిరి; యుందు నొక్కఁడు
న్నీదయకున్ దగండె ? యవినీతి యొకింతయు లేదె వారియం ?
దేఁ దగువాఁడనే దినము నీపయి వా రిడు పొట్టకూటికిన్ ?

గాంధా— అందుకును భీముఁ దొప్పికొనఁడు. ఇంత వెట్టి యెందుకు ?
కొడుకుల కన్నను మనుమలకన్నను మనకీ మేనులుత్యజింపరానివా ?

ధృత— చక్కగా నుడివితివి.

ఉ. ఇంతకుఁ బూర్తిగాఁ జనర, యేగుచునుందురు; వారి వాకపుం
* బ్రాంతమునందుఁ గూర్చెడి యుపాయము మేను పరిత్యజించుటే;

యంతము లేని దుఃఖముల నార్తి వహించుట కన్నఁ జచ్చుచే
శాంతి; మఱెందు నింత కుపశాంతులు గల్గవు గల్గ వెమ్మెయిన్.

ఎవరురా యక్కడ! మాకుఁ జితిఁ బేర్పింపుము.

వ్యాసు— కుమారా! యేమి నీ యవివేకము!

ఉ. చచ్చినవారితోడఁ బడి చత్తుమె? యాత్మవిఘాతుకత్వముల్
దెచ్చునె సద్గతిన్? వలదె తేఁకువ? యార్యుల సేవ లేదె? యు
ద్యచ్చరితుండు ధర్మజుఁడు తండ్రికి నెక్కుడు నిన్నుఁ జూడఁడే?
నొచ్చుకొనందె నీగతి గసుంగొని? వేఱొక చూపు చూచునే?

క. మీయన్న శుకుఁడు విద్య ల
నాయాసముగాఁ బఠించినట్టిదు బాల
ప్రాయమున మృతిం గన నే
నాయుర్దాయమున నుండనా! గనుగొనుమా.

ధృత— తండ్రీ! నే నెవ్వరిం జూచికొని బ్రతుకుదు?

చ. ఒక కొడుకేని యుండెనని యుందునొ? మన్మలకోస ముందునో?
యకట! యమంగళాస్పదములైన మొగంబులతోడ నేడ్చు కొం
డికతనపున్ వధూమణులు నిండిన సంసృతిఁ జూడనేర్చుచే
సుకరమొ? చావు మేలొ? తగఁ జూచి వచింపుము నాకు నిమ్మెయిన్.

వ్యాసు— నాయనా! విదురునివల్ల సమస్తధర్మములు వినియున్న నీకు నే
నిప్పుడు క్రొత్తగాఁ జెప్పవలసిన దేముండును?

చ. ఎవరినిఁ జూడ నేమిటికి? నెవ్వరి కెవ్వరు? మాలసంత! కా
లవశమునన్ జనుర్మరణలక్షణముల్ జను లొందు చుందు రి
య్యవి గనకే నిరంతరము నాత్మ తిరుండయి యుండు జ్ఞానముం
దవులని వార లియ్యెడ వృథా విలపించెద రింతయేటికిన్.

విదు— సంశయ మేమి? జననమరణప్రవాహభూయిష్ఠ మగు నీ సంసార
మునఁ బ్రాజ్ఞు లంతగా మమత గూర్పంజనదు. అన్నయ్యా!

ఉ. ఎందఱి కీవు తండ్రివొ మఱెందఱికిం దనయుండవో మదిం
గొందల మందనేల? కనుఁగొమ్ము విచారణసేయు మయ్యయో!

తుందుడుకింత చెల్లునె బుధుండవు గావె యెఱుంగవే? ధృతిన్
జెందుము చిత్తవృత్తినిటు చిందఱవందఱఁ జేయ నాయమే?

ధృత— తమ్ముఁడా! యిది యంతయు నిట్టిదే.

ఉ. ఇప్పటి కెన్నిజన్మముల నెత్తితిమో యిక నెన్ని యున్నవో
యెప్పటి కప్పుడే మఱచి యీగతి వందురుచుందు; మేరికిన్
దప్పదు కష్టమున్ సుఖము తాఁగిసునఁ దూగుచునుండు; నైననున్
ముప్పున నిట్టి బాధ ననుబోటికి ధాత విధించి యుంచునే.

వ్యాసు— అదియే యజ్ఞానము.

ఉ. ధాత యెవండు సేయుటకుఁ? దక్కొరు లెవ్వరు? ప్రాక్కృతంపుఁ గ
ర్మాతిశయమ్మునన్ గలుగు నన్నియు; దానిని దాట జాలఁ డా
ధాతయు వానితాతయును; దప్పక తప్పుల మంది తీరుచే
చూతుము కాని వేఱొకటి చూడము చూడఁగనేర రన్యులున్.

గాంధా— అయ్యో! నా దుర్దశవంటి దుర్దశ వినినదియు వినఁబోవునదియుఁ గూడఁ గాదు. దైవమా, దైవమా! యెంత దుర్గతిఁ దెచ్చితివి!

వ్యాసు— గాంధారరాజపుత్రీ! విచారింపకుము.

చ. కొడుకులు పుట్టలేద యనుకొన్ము; కులానఁ గళంకునించు న
క్కొడుకులు కొడుకులే? నయము కొంకక చెప్పితి చెప్పఁజేసి తె
క్కుడుగ; వినండ నీకొడుకు కూళతనంబున నింతకున్ జగం
బడఁచు తలంపుతో నుదయమందె నితండు పతివ్రతామణీ!

ధృత— అయ్యో, దైవమా!

చ. మనమునఁ దాపమాఱఁ గడమా తొకమాఱు తనూజులన్ గనుం
గొనుటకుఁ గన్నులేనిఁ దనకుం దయ సేయవుగా! మఱెంత యాఁ
పిన నదియేమొ దుఃఖమది పెచ్చగుచున్నది; యీపె శోకమున్
గనుఁ గొనఁ జాల; నిందుఁ బ్రతికారము గన్పడ దేమిసేయుదున్?

వ్యాసు— దంపతులారా! మీకట్టి యభిప్రాయమున్నచోఁ జూడుఁడు. శ్రీకృష్ణుం డయ్యెడల దృష్టిని మీకుఁ బ్రసాదింపఁగలఁడు.

విదు— ఇఁక నాలస్య మెందులకు? ఇమ్మహాత్ముని వచనం బమోఘము.

ధర్మజాదులతోఁ గృష్ణుం డీపాటికి నయ్యేడకుఁ వచ్చుచుండ వచ్చును. మనము గూడ నయ్యేడకుఁదక్కంగల జనులతో నరిగి యొకసారి చూచి యుచిత క్రియలు నిర్వర్తించుటయే కర్తవ్యము.

(నిష్క్రమింతురు)

(అంతఁ బాండవులు కృష్ణసహితముగాఁ బ్రవేశింతురు)

ధర్మ— కృష్ణా! వాసుదేవ!

క. ఏ మొగమునఁ గనుగొందును
మోమోట మొకింత దక్క ముది తొక్కల దుః
ఖామయమగ్నుల? నకటా!
యేమాడ్కిన్ వీరిదుఃఖమిది చల్లాఱున్?

కృష్ణ— బావా! మీ శాంతమునకుఁ దగిన ఫలము గలుగనప్పుడు మీరేమి చేసెదరు?

భీము— (కోపముతో) ఓహో! యేమి యీవిరుద్ధము?

ఉ. చచ్చినవాఁడు చావక వెసన్ గురుపుత్త్రినిఁ బిల్చి యాతనిన్
మచ్చికఁజేసి ద్రోవదికుమారులఁ దక్కిన రాజసైన్యముఁ
బొచ్చెముమై వధింపుటకుఁ బుచ్చిన దుర్మదునింక నొక్కమా
ఱెచ్చటనైనఁ జంపవలదే? యటుగామిని గోప మాఱునే?

ధర్మ— భీమన్నా! "మరణాంతాని వైరాణి" యనుట యెఱిఁగియు నిఁక నెందుకోయీ కోపము?

భీము— అన్నయ్యా! ఈ శాస్త్రములు లోకమునకేగాని యీ దురాత్మున కుపచరింపవు. ఏమంటిరా?

చ. మరణముతోడఁ దీఱుదురు మంచిప్రవర్తన గల్గువారు; దు
శ్చరితులు చచ్చియున్ బగఁ బిశాచములై కనఁజేతు; రిట్టి యు
ద్ధురచరితమ్ము గల్గుటనె దుష్టచతుష్టయ మన్నయట్టి యీ
బిరుదు సుయోధనాదులకె పేర్కొనఁగాఁబడెడిన్ జగమ్మునన్.

ధర్మ— తమ్ముఁడా! ఇది సమయముగాదు. శాంతింపుము. (కృష్ణునివంక దిరిగి) వాసుదేవా!

తే. తగుదునని యే మొగమ్ముతోదెగని వగల
బొగులు తలిదండ్రులను గనఁబోదునయ్య
ఇంత కష్టము దోఁపలే దెపుడు నాకు
నాఁడు వనవాస మప్పుడైనను మహాత్మ !

భీము—(కోపముతో)అన్నయ్యా! మీరుమొదటినుండియు (అనుసర్థోక్తిలో)
అర్జు— (వారించి)

చ. ఒకరి నొకళ్ళు చూచుటది యొక్కటితప్పని కార్యమాటచే
నకట ! యిటుల్ చనన్ వలసె ; నంతియెకాని ఘటోత్కచుండు నా
దు కొడుకు ద్రౌపదేయులును దోఁచఁగఁ జేసెడివంతకన్న దు
ష్టకుటిలబుద్ధు లాత్మజు లెడందఁ బగుల్తురె తండ్రిగారికిన్ ?

కృష్ణ— అజాతశత్రూ ! మహారాజ !

ఉ. సామము చెప్పి చూచితిమి సంధికిఁ జొన్పితి; మెందు కేని యా
సోమరి యొక్కటన్ హితవు చూపఁడ ; కార్యము లేక యంత సం
గ్రామము చేయఁబూనితిమి ; కాలము చెల్లినవారు వోయి రి
చ్ఛేమనదోషమేమి ? యనసూయులకున్ సకలంబు దెల్లమే.

నకు— దేవా ! జగన్నాథ !

క. మనమొగము చూచుటెటులని
జనకుఁడు శంకింపవలయు సంధికిఁదాఁ బూ
నినఁ గాకపోవునే ? యా
యనదోషముకాదె ? కులము నడుగంటించెన్.

సహ— బావా ! దేవకీపుత్ర !

క. తల నెరసినంతనే పె
ద్దలె ! తానొక్కింతఁ బూని తన తమ్ముని పు
త్రులమైన మాకుఁ బాలీ
దలఁచినఁ బోకున్నె యిదియుఁ దగదే తనకున్ !

ధర్మ— అన్నలార! యెందుకీ గతజలసేతుబంధనము? ఎటువంటి యార్యుల
కును నొక్కొక సమయంబుల బుద్ధులు తప్పుత్రోవలం బడియెడి.

చ. వనమున ద్వాదశాబ్దములు వాసము సల్పితి మో(గవా సుఖం
బును గనకుంటిమే యపుడు ? పోరొనరించి జయించి రాజ్యముం
గొనుటయకాని లేరు కొడుకుల్, మఱియెవ్వరికోస ? మిప్పుడే
మనుకొన నేమిలాభమగు ? నన్నియు నింతకు( దీఱె( బూర్తిగన్.

భీము— అన్నయ్యా ! అట్లనెదరేమి ? కొడుకులే కావలయునా ? మనుమలు
దినఁగూడదా ?

ధర్మ— అక్కటా, యెంత వెఱ్ఱివా(డవోయి !

ఉ. దుర్భగు(డైన ద్రౌణిశరదుస్సహతాపముచేత( గ్రా( ంటన్
గర్భమునంద చచ్చియును గంజదళాక్షు ననుగ్రహమ్మమై
నర్భకు( డెట్టులో యుదయ మందెడి నుత్తర కాత( డిమ్మహీ
ధూర్భృతి సల్పువా(డనుచు( దోషము వొందుదమయ్య ! తమ్ము(డా !

ఉ. పేరును బెంపునుఙా వెలయ బెట్టిదు(డౌ నభిమన్యు(డున్ మహా
శూరులు ద్రౌపదేయులును సోమునివంశము వృద్ధి నేయ(గా
నేరనియప్పు డీనిసువు నేర్చునటంచు( దలంచు టెట్లు ? సం
సారమునందు( గోర్కి కొనసాగిన వారలు లేరు తమ్ము(డా !

పరిశీలించి చూచినచో నిప్పటి మన సంసారమునకన్న నేది యేనియు
సుఖకరమే.

ఉ. పిల్లనిమోము( జూచి పొరి బెగ్గిలి యుత్తర యేడ్చు: నాపె సొం
పెల్ల నశించెగా యనుచు నేడ్చు సుభద్ర ; గృహం బికెట్లు శో
భిల్లెడి ? గేస్తు లిట్లనుభవింపగలారె సుఖమ్ము ? లంతయున్
జెల్లినమీద రాజ్యమును జేయుటకన్నను దోసముండునే ?

కృష్ణ— (దృష్టినిగుడ్చి) ధర్మనందనా ! అరుగో, విదుర ధృతరాష్ట్రు లిటు
వచ్చుచున్నారు. మనము వారి నెదుర్కొనవలయును.

(పరిక్రమింతురు)

(విదుర ధృతరాష్ట్రులు ప్రవేశింతురు)

విదు— అన్నయ్యా ! అదేపొలికలను, దగ్గఱకువచ్చినారము. ధైర్యమవలం
బించి బందుగులం గను(గొందువుగాక.

ధృత— తమ్ముఁడా ! యింతకన్న ధైర్య మేముండును ?

తే. అందఱుఁ గుమారులును బోయినట్టి వార్త
వినియు నీగతి నుండె జీవనముతోడ
వృక్షమో ! లేక రాయియో ! వీడుమనుజ
జన్మమేమైన విధియెట్లు సంభవించు ?

ధర్మ— (దగ్గఱకరిగి) తండ్రీ !

ఉ. జూదరి జ్ఞాతిఘాతుకుఁడు క్షుద్రుఁడు శీతకరాన్వవాయవి
చ్ఛేది యజాతశత్రుఁ డను చెల్లనిపేరు వహించువాఁడు నీ
మోదము నెల్ల నాఱిపిన మూర్ఖుఁడు కష్టుఁడు వీఁడె నేఁడు నీ
పాదయుగమ్ము మ్రొక్కెడిఁ గృపఁగాగవి తప్పులవెల్ల పైపవే.

ధృత— (కౌగిలించుకొని) నాయనా ! ఇందు నీతప్పే మున్నది ?

శా. ఐదూళ్ళేనియుఁ జాలు నంచు హరి నీ వంపింపఁగాలేదె ? నీ
దేదీనేరము ? ద నిస్సైన తులచే విప్పింపఁగా లేవి నా
దే దౌర్మార్గ్యముగాక ; నిన్ను సుఖిగా జీవించితివ్ దండ్రి ! నీ
వే దిక్కేమని నిన్నుఁ గూడఁ జెఱుప న్నె నెంతు వో పుత్రకా !

భీము— (నమస్కరింపఁబోఁగాఁ గృష్ణుఁడు వారించును.)

ధృత— (ప్రేమతో) నాయనా ! ధర్మనందన ! భీమన్న యే డోయి ?

కృష్ణు— (తనలో) అబ్బో ! యెంత ప్రీతియో, పాపము ! (ప్రకాశము)
ఇడుగో (ఇనుప భీముని ముందఱికిఁ ద్రోయును.)

ధృత— (తనలో)

చ. కొడుకుల నెల్లఁ బొట్టఁ బెట్టుకొన్న దురాత్ముఁడు వీనిఁ జంపి నా
యుడు కొకకొంతఁ దీర్చుకొను బొప్పదె ; యింతకు వీఁడు పాపి, పెం
దొడ గద నుగ్గుఁజేసి తలఁ ద్రొక్కనె ? తత్ఫలమెల్ల వీని వి
ప్పుడ గుడిపించెదన్ ముదము వొంది మదాత్మజుఁ డుబ్బునట్లుగన్.

(ప్రకాశము)

ఉ. ఏల కుమార ! కొంకు గొనవేటికిఁ దబ్బొనరించి నాసుతుల్
కాలముచేసి ; రెవ్వరికిఁ గానివి కష్టసుఖమ్ము ; లందులోఁ

గాలము చేరు వైనవుడు కల్మషపున్ మతు లావహిల్లు; నా
పాలిటి కీవె పుత్రుఁడవు; పల్వురు గల్గిన నేమి లాభమో?

(కౌగిలించుకొని వదలిపివేయును. అందఱును నాశ్చర్యము సూచింతురు)

కృష్ణు— (ఏకసక్కెముగా) మామా! కురుకులగరిష్ఠ!

చ. నిజమగు భీముఁడే యనుచు నీమదిఁ గల్గిన కోపమెల్ల న
క్కజముగఁ జూపి యిన్మ పొడిగా నొనరించితి; నీమనంబు ధ
ర్మజునికిఁ బోలె నా కెఱుగ రానిది గాదుసుమా! యెఱింగి నీ
గజిబిజి మాన్పఁగా నిటుల కల్పన చేసితి నిన్నుభీమునిన్.

ధృత— (వెలవెలఁబోవుచుఁ దనలో) అయ్యో! దుఃఖములో నవమానము
గూడఁ దటస్థించెఁ గదా! ఇఁక నేమి చేయుదును? ఇందుపాయమేమి?

అర్జు— (తనలో)

క. పదివేలేన్గుల బలము
న్నది యాతని కంచు నంద ఱాడుట విని యి,
య్యది యతిశయోక్తి యని నా
మది నెంతు విశింతవాఁడు మహిలోఁ గలఁడే.

నకు— (తనలో)

క. ఇతఁడే నిజముగ సంగ్రా
మ తలమునకు వచ్చెనేని మన మొక లెక్కా!
చతురుదధిపరీతంబగు
క్షితియెల్లను నొక్కడైనఁ జేసెడి దున్నె?

సహ— (తనలో)

గీ. అన్నకన్నను బలవతు లవని లేర
యనుచు ననుకొంటి నితనిముం దాతఁడెంత
పూర్వకాలపు వారి కీ పురుషులకును
నింత భేదము గల్గుట యిపుడు తెలిసె.

భీమ— (సంతంభములో)

ఉ. భీముఁడ నీ కుమారకులఁ బెక్కురఁ జంపినవాఁడ ఘోరసం
గ్రామములోన నీకొడుకు రక్తము గ్రోలినవాఁడ నిన్నుఁ దు
ర్ధీమహితున్ మదగ్రజుని పేర్మిరణఁ జేసి పరామృశింపఁగా
నీమెయి వచ్చినాఁడ నిపు డింతయుఁ జూచినవాఁడ నీకృతిన్.

ధర్మ— (నిర్వేదముతో) తమ్ముఁడా! కాటికిఁ గాళ్ళు చాచుకొన్న కుల
వృద్ధులతో మన కీ యధిక ప్రసంగ మెందుకోయి?

భీము— ఇప్పుడును నన్నే మందలింప వలయునా?

తే. గీ. వృద్ధుఁ డంటివి సత్యమే యెందుకీ దు
రాగ్రహము వృద్ధలక్షణ మందువేమొ
పరమచండాలుఁ డితఁ డెట్టివాఁడయేని
నిజము వద్యుండు వధ్యుండు నీవెఱుఁగవు.

ధర్మ— తమ్ముఁడా! నామాట విని యంతతోఁ జాలింపుము.

క. సుతశోకజ్వరమున సం
ప్రతిపన్నం బయ్యె సన్నిపాత మితని కి
ట్టి తఱిన్ బొనర్చువని దు
ష్కృతమో సుకృతమ్మొ తెలియునే రోగులకున్.

కృష్ణు— మామా! ఆంబికేయ!

గీ. కొడుకులా లేరు! వారల కొడుకులేని
లేరు! వీరల నెల్ల బల్మిని వధించి,
యపయశమునొందుటయెతక్కనక్కటకట
యెవరికిచ్చెదురాజ్యమ్మునెఱుఁగఁజెపుమ.

భీము— ఎవరి కెందు కీవలెను? తానే పరిపాలింపఁ గలఁడు. చేతకాదా
యేమి? భగవంతుఁ డెఱిఁగి గ్రుడ్డివానిగాఁ జేయబట్టి గాని లేనిచోఁ
బ్రపంచమంతయు మ్రింగక పోవునా?

ధర్మ— భీమన్నా! యిక నీ వితనిం గుఱించి మాటాడితివేని పాండునృపా
లువి యడుగులకుఁ దప్పినవాఁడవు. ఏదో చెప్పఁదగిన సంగతి బావ
చెప్పుచున్నాఁడు చాలదా?

కృష్ణు— మామా ! సత్యవతీపౌత్ర !

క. తనకడు పొక్కటియును ద
మ్మునికడు పొక్కటియునే సమున్నతమగు వ
ర్తన గల్గు నుత్తముల ? కే
మన నేరుతు మింతకన్న నధికముగ వినుమా.

విదు— వాసుదేవా ! మహానుభావ !

చ. ఎఱుఁగనివాఁడు గాఁడు "పరమేశ్వరు నంశమ వీ" వటంచు; నీ
యరయుట వీరికిం గలదటంచు నెఱుంగని వాఁడు గాఁడు; స
త్వరమున భీముఁ జంపుటకుఁ బాల్పడి మేటియవజ్ఞ నేసె; సా
దరమతిఁ జూచి యెట్లయినఁ దప్పు క్షమింపఁగదయ్య మాధవా !

ధృత— దేవా ! వసుదేవనందన !

చ. సుతులను జంపె వీఁ డనెడి శోకభరం బది దేహమెల్ల వ్యా
పృతమయి రాజి రాజి యొక పెట్టన బగ్గున మండి యిట్టి దు
ష్కృతిని వివేకమున్ విడిచి చేయఁగఁబూనితి, సత్యమే; కృపా
రతి ననుఁ బ్రోవఁగావలె శరణ్యుని నిన్ శరణంటి మాధవా !

ఉ. మామను ! బెద్దవాఁడను నమస్కృతి చేసెదనన్న దాన నీ
నేమము వోవు నంచు మది చెల్లదు; దేవుఁడ వయ్య నీవు మా
భూమిని బుట్టి చుట్టఱికమున్ మముబోటులతోడఁ గల్పెదే
సూ ! మది నిట్టి సంశయముఁ జొప్పడఁ జేసెడు హేతు వల్లఁడా!

కృష్ణు— మామా ! నీవు నిజముగా నపరాధివయ్యును బశ్చాత్తప్తుండవై నిర్దోషివైతివి (చేత ధర్మజు నిర్దేశించి)

మ. ఎదుటన్ జెప్పఁగరాదు గాని యితఁడీ పృథ్వీభరం బొక్కటా !
త్రిదివం బేనియు నేలఁగాఁ దగిన వర్ధిష్ణుండు; కృష్ణుండు మ్రొ
క్కఁదగున్వాఁ డనుకోకు; మీతఁడుజగత్కళ్యాణశీలుండు మ్రొ
క్కఁదగున్ వాఁడును మాకు నెల్లరకు; నిక్కంబిట్టిఁ డొం డుండునే ?

విదు— కృష్ణా ! మహానుభావ !

ఉ. నీచరితం బదిట్టి దని నిర్ణయ మెవ్వఁడు సేయనేర్చుఁ గా
నీ చతురబ్ధివేష్టిత మహీవలయమ్మున ధర్మసూతి కే
రాజకుమారులున్ సవతు రారనుమాటది నిక్కువంబు సం
కోచము లేదు లోకమునకున్ గురు వీతఁడె శీలసంపదన్.

కృష్ణు— సంశయ మేమి? ఒక శీలముననే కాదు. సర్వవిధములచేతను నితని కౌరవులు సాటిగారు. మామా! కురుకులజ్యేష్ఠ!

ఉ. అట్టి యితండు నీయెడ మహాదరమున్ గడుభక్తియుం గలం
డెట్టియెడన్ సహోదరులు నీతని యాజ్ఞకుఁ గట్టు దప్ప రీ
విట్టికుమారు లుండియును నెందుకు దుఃఖము నొందె? దయ్యయో!
చెట్టలునూర్వు రుండిన విశేషమె? యిట్టిఁ డొకండు చాలఁడే!

ధృత— కృష్ణా! దేవకీనందన!

ఉ. ఈ వవినట్లు ధర్మసుతుఁ డిట్టిఁడ, బుద్ధి జనించె నాకు నీ
సేవ కతమ్మునన్ మునుపు చేసిన పాపము లెల్లఁ బోయెఁ గా
నీ వగ పింకనున్ మనము నీఱుగఁ జేయుచు నున్న దయ్యః యో
దేవ! మహానుభావ! యిది తీర్పగ వేడితి నిమ్ను మాటికిన్.

నిన్నొక్కసారి కన్నులారఁ జూచినం గాని నాకీ దుఃఖ ముపశమింపదు.

ఉ. మున్నొకసారి జూచితిని; ముద్దులు మూటలు గట్టఁ జాలు నీ
యన్నువ రూపు; దాని నిపు డారయఁ జేయు మిఁకొక్కసారి; యే
జన్మములన్ దపమ్ములను సాగనిసౌఖ్యము దానఁ గల్గు నం
చున్నది లోనఁ గోర్కి; దయ యుంచుము భక్తపరా! పరాత్పరా!

కృష్ణు— (తనలో) పాపము కొడుకుల నందఱిం గడసారి జూచుటకై కాఁబోలు నిట్లు కోరుచున్నాఁడు. (ప్రకాశము)

తే. గీ. కనుఁగొనుము నేఁడు నీపుత్రగణమునెల్ల
రాజబంధులతోఁగూడ, రమణితోడ
విచ్చితిని దృష్టి. పొలికలనిదుగో చూడు
మా! యొకించుక దూరాన మానవేంద్ర!

ధృత— (కలయంజూచి) నాయనా! యొక్కసారి దగ్గఱగాఁ దీసికొని పోయి చూపింపుము.

కృష్ణ— ఇదిగో, నిటురమ్ము. (అందఱును బరిక్రమింతురు.)

ధృత— (చూచి)

చ. విఱిగినతేరులా యివి! భువిన్ బడిపోయిన గౌరుబారులా!
సురిగిన సూరులా! యకట! చూడఁగఁ జాల జనార్దనా! మహా
భరమనిపించుచున్నది; కృపన్ మరలింపఁ గదన్న దృష్టి; యే
వరమును మందభాగ్యుఁ డగువానికి మోదము గూర్పఁజాలునే!

(తెరలో)

శా. కోదండైకగురుండు తండ్రి; యసదృక్షుల్ పెద్దతండ్రుల్ పితృ
వ్యాదుల్; వీర లటుండఁ గేవలము లోకాధ్యుండు జీవం బిడం
గా దక్షుం డగు మేనమామ; రిపుచక్రం బెట్లు నిన్ జంపె నా
దౌ దౌర్భాగ్యమ కాక నీకు రిపు లన్నా! గడ్డిపోచల్ గదా!

కృష్ణ— (విని) బావా! సుభద్ర కాబోలును దుఃఖించుచు నిటు వచ్చు చున్నది. నీవు పోయి యోదార్చి వెనుకకుఁ బంపుము.

నకు— (నిష్క్రమించును)

(మరలఁ దెరలో)

చ. అన్న ప్రతిజ్ఞ త్రిప్పుటకునై చని యే బ్రతిమాలుకొందు నా
పన్న శరణ్యుఁ డాతఁడు కృపణా "బతిభిక్ష" మటన్న "లేదు పొ"
మ్మన్నను "గాదు కూడ" దని యప్పటి కెట్టులొ "యొప్పఁ జెప్పుదా
నన్నరు'' నంటి నాపలుకు నాటకపోయె నిఁకేమి సేయుదున్.

ధర్మ— (విని) అర్జునా! దుస్సల కాఁబోలును. నీవే పోయి యాపె నోదార్పుము.

అర్జు— (నిష్క్రమించును)

(మరలఁ దెరలో)

ఉ. పేరును పెంపునున్ వెలయు పెద్దలు ద్రోణుఁడు మున్నుగాఁగ నా
వీరులు కౌరవేశ్వరుని ప్రేరణ కారణమై యహో! దురా

చార మటం చెఱింగియు నసాధ్యు నినున్ బొరిఁ జుట్టుముట్టిరే!
వేరముదీర్చి యే మనుభవించిరి వా రపకీర్తి దక్కఁనన్?

ధృత— పాపము. ఉత్తర కాఁబోలును. అయ్యో! దైవమా! యెక్కడఁ
జూచినను రోదనధ్వని తప్ప రెండవ ధ్వని వినఁబడదుకదా!

ధర్మ— తమ్ముఁడా! నీ వరిగి యాపె నోదార్పుము.

సహ— (నిష్క్రమించును)

(మరలఁ దెరలో)

ఉ. ఒక్కరో యిద్దఱో శతము నొక్క మొగిఁ బలియిచ్చి భీముఁడన్
దెక్కలిశక్తి, కెక్కరణిఁ దీవ్రపుశోకముఁ బట్టనేర్తు; న
మ్మక్క! యిదేమి దారుణమొ ప్రాణము వోవదు పొమ్మటన్న; నే
నక్కలు రావు నాదరికి నందను మెక్కుచు నున్న వక్కటా!

క. కొడుకా; యంతటి రాజ్యము
విడిచి జనకు విడిచి నన్ను విడిచి యనుజులున్
గొడుకులును దోడ రాన
ట్టడవిని నిలు గట్టికొంటివటరా! తండ్రీ!

ధర్మ— (విని) తమ్ముడా! ఆపె పరమపూజ్యురాలగు గాంధారరాజపుత్రి.
మనకుఁ బెద్దతల్లి! ఆమెకుఁ గోపోపశాంతిగా వేడికొని యామె
యనుగ్రహముం బడయుట కిట్లు ప్రార్థింపుము.

ఉ. అమ్మరో! నీదుపుత్రికుల నందఱఁ జంపితి ధర్మమో యధ
ర్మమ్మొ రణమ్మునం, దనపరాధిగఁ జూచి కృపారసాభిషే
కమ్మొనరించు చూడ్కులను గాంచగదమ్మ! భవత్పదంబుఁ బా
తమ్ములుదక్క నిష్కృతిపథ మ్మిఁకలేదు గదమ్మ! యెమ్మెయిన్.

భీము— (వెళ్ళఁబోవును)

కృష్ణ— బావా! మాట. (రహస్యముగా) ఆమె ని న్నిట్లనంగలదు.

గీ. "పోరుదురుగాక రిపులజంపుదురుగాక
రాజ్యమును గొందురుగా కెందు రాజవరులు
రక్తమును గ్రోలినట్టు లే రాజ్యమందు
మున్నువింటిమె? యోరోరిమూర్ఖతముఁడ"

ఇందుకు నీవిట్లు త్తరమిమ్ము.

చ. "పరమపతివ్రతన్ ద్రుపదుపట్టిని బట్టి భవత్సుతుండు దు
ష్కరమున వల్వ లొల్చుతఱిఁ గట్టినయట్టి ప్రతిజ్ఞకై నిజా
ధర మొకయింత రక్తమునఁ దడ్పితి నంతియకాని యంత త
ప్పెఱుఁగనివాఁడనమ్మ ! మది యేవము పైచునటమ్మ ! నమ్ముమా."

భీము— (విష్క్రమించును)

( తెరలో )

క. రారాజపై యశేషధ
రారమణులు గొల్చు నిన్ను గ్రద్దలు చుట్టం
జేరెనె ? ధర్మజునకుముద
మాఱెనె ? నీదగు నవస్థ మాఱెనె ? తనయా !

ధృత— కృష్ణా ! నీవొసంగిన దృష్టి మా దంపతుల కెంత యపకార మగు
చున్నదోయీ తండ్రీ !

ధర్మ— (తెరవంకఁ జూచి) అమ్మా ! గాంధారరాజపుత్రీ !

క. నీకొడుకులఁ జంపించితి
నాకొడుకులఁ జంపుకొంటి నయహీనుఁడ దు
ర్ధీకుఁడఁ బాపాత్ముఁడ శో
చ్యాకారుఁడ నాకు శాప మర్పింపఁ దగున్.

ధృత— తండ్రీ ! నిష్కలుషుండ వగు నీకు శాప మెందు కీవలయు ?

విదు— గీ. ధర్మమకదాయనుచుఁ గేల ధర్మమూని
గుణమకద యంచు నద్దాన గుణముఁ గూర్చి
తంతియే కాని నీవేరి కాహవమున
నపకృతి యొనర్చి యెఱుఁగ వయ్యయ్యో రాజ !

(తెరలో) కృష్ణా ! కురువంశ కృష్ణవర్త్మ !

ఉ. కూకటివేళ్ళతోడఁ గురుకోటికురుబ్బటలిన్ వెలార్చి తీ
వే కుటిలాత్మ ! జ్ఞాతులకు నింతలు పుట్టునె లేకయున్న, లే

వే కలహమ్ము లెయ్యెడను ? నీయసురంతయు విన్ను నల్లివే
తాఁకి నశింపఁజేయు నిది తప్పదు నేనొక సాధ్వి నైన చో౯.

కృష్ణు— (లేవి సంతోషముతో) అత్తా ! నీవు నాకు శాపమిచ్చినను నది యనుగ్రహముగానే పరిణమించినది సుమీ !

ఉ. యాదవు లేరికి౯ సమరమం దవిజేయులు చచ్చు టెట్లొకో
యీ దురహంకృతుల్ భువికి నేగతిఁ దీఱునొకో భరం బటం
చేఁ దలపోతు; నీకొడుకులే యనుకొంటిని నీవుఁ గూడ నా
పై దయఁ జూపి భూభరము వాపితి వంతియ చాలు నెమ్మియి౯.

ధర్మ— బావా ! పాండవులవలనఁ గదా మీవంశమునకుఁ గూడ నిట్టి యాపత్తు ఘటించుచున్నది. అయ్యో ! పుణ్యమునకుఁ బోయినఁ బాప మెదురగుట యిదియే కాఁబోలును !

గీ. ఎన్నివిధముల సంధికి నియ్యకొల్పి
తెంత కష్టించితివి పోయె నిదియునెల్ల
నక్కటా ! యాపెయొక్కఁతయరయదయ్యొ
పై పగదవయ్యమాతల్లిసాహసంబు.

కృష్ణు— ధర్మనందనా ! నీకింత నిర్వేద మెందుకు ? ఇది యీమె శాపంబు వలననే కాఁదగినది కాదు. మున్నిట్లు యాదవులకు బ్రాహ్మణ శాపం బున్నది. అది యట్లుండ,

క. ఎందులకు నేనియును జం
కందగుఁ జావునకు జంకగా రా దది తా
నందుట యొక్కపరియె యగుఁ
గుందగ నేమిటికి దీనికోస మ్మనఘా.

విదు— దేవా ! మహానుభావ ! అజ్ఞులకుఁ గాని యెప్పట్ల భవాదృశులకు దుఃఖ మెక్కడిది ? ఆపె యేనియు సమస్తధర్మము లెఱిఁగినదైయెనను నెందులకో యిప్పట్ల తొందరపడినది. ఇంతకును నీ వనినట్లు,

తే. గీ. ఇతరమగు శాపమిచ్చిన నింతకంత
జంకఁగావలెఁ గాని యీ శాపమునకు

జింకఁ బనిలేదు; చావక శాశ్వతమ్ము
గా నిలుచువార లంథు జగానఁ గలరె!

ధృత— దేవా! జగన్నాథ! మాతప్పు లన్నియు క్షమించి మమ్ము మన్నింపుము.

కృష్ణ— ఇం దెవరి తప్పును లేదు. ఏది యెట్లు జరుగునో అట్లు కాక మానదు. మనము నిమిత్తమాత్రముగా నుండక తీరదు.

(తెరలోఁ బెద్ద రోదనధ్వనులు)

విదు— (విని) అరుగో! అంతఃపుర జను లందఱును నొక్క పెట్టఁ దమ తమ బంధుజనంబులకు విలపించుచు నిటు వచ్చుచున్నారు. మన మీ పాటికి వీరలనందఱిని నోదార్చి యుచితక్రియలు నెరవేర్పఁ బోవుదము.

కృష్ణ— ఇఁక నిట్లున్నకొలదిని దుఃఖ మతిశయించుచునే యుండును గావున నట్లొనరించుటయే మంచిది. (అందఱును నిష్క్రమింతురు)

— గద్య —

ఇది శ్రీ....తిరుపతి వేంకటేశ్వర ప్రణీతంబగు
పాండవాశ్వమేథమ్మున ద్వితీయాంకము.

శ్రీ మత్సరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము.

## తృతీయాంకము.

(నారదుఁడు ప్రవేశించును)

నార— ఓహో ! నేఁటి దినమున ధర్మజుని పట్టాభిషేకమహోత్సవమఁట. అట కరిగెదను. అయ్యెడ శ్రీకృష్ణదర్శనము నైతముఁ గలుగును. కావఁ దీర్థమును స్వార్థమును గూడఁ గలసివచ్చును. (పరిక్రమించి) ఏమీ ! యీ బ్రాహ్మణు లందఱును గుంపులు గుంపులుగా నేమేమో చెప్పుకొనుచుఁబోవుచున్నారు. "విఘ్నేశ్వరుని పెండ్లికి వేయి విఘ్నము" లన్నట్టు లేదేని యంతరాయము రాలేదుకదా ! (దివ్యదృష్టింజూచి) నే ననుకొన్నట్లే జరిగినదే ! పాపము !

క. ఇంత దనుక దాచిన యా
కుంతికి నే మంతవచ్చెఁ గొడు కని కర్ణున్
మంతనము విడిచి చెప్ప ర
వంతేనియు సిగ్గువలదె ! యాఁడుదిగాదే !

ఇంతకు నామె యేమిచేయును ! కర్మలోపమునకు శంకించి నొడివి యుండును. (కోపముతో)

గీ. ఎదుటనన్నను గోపించి యెగిరి మీదఁ
బడి శపించునుగాని దుర్వాసు లకట
కొంపతీతకుగాక తాఁ గుంతి కేల
యీయగావలెఁ గన్నియ కిట్టి వరము ?

ఛరే. ఆపె చేసిన శుశ్రూషకుఁ బ్రతిఫలముగా విచ్చియుండును దానికేమి.

తే. గీ. సూర్యుఁడేమంత యోగ్యుఁడు ! సుదతిదన్నుఁ
బిలుచుగాకవరమ్మదితెలిసికొనఁగ
వచ్చెఁబో ! మునియాజ్ఞయవార్యమౌటఁ
దప్పుక్షమియింపు మన్నప్పు డొప్పవలదె.

దీనికేమి గాని కర్ణుని మనోనిశ్చయము మాత్రము కొనియాడఁదగినది.

క. ఎఱుఁగును బాండుసుతులు సో
దరులని; యస్లైటీఁగి మనమునం దించుకయున్
గరుణ జనియింపకుండ బ
వరమున నరికట్టుటన్నఁ బైపైఁ గలదే !

ఇతడిట్టివాఁడు గనుకనే యనేకులు యోధవరులుండఁ "గర్ణునితల భారత" మను పేరితనికి వచ్చినది. సరే ఇంతకు మనము వచ్చినపని వాకిటనే నెఱవేఱినది. ఇఁక మరలిపోకెందుకు ? (మరలి) పోసి వచ్చిన వాఁడను రానే వచ్చినాను. ఒకసారి చూచిపోవుట మంచిది గదా (కొం డొక పరిక్రమించి) అదిగో ధర్మజుం డచటనే విచారముగాఁ బాంచాలీ సహితముగ సోదరులతోఁ గూర్చున్నాఁడు. పోయి పాపమాతని నోదార్చెద.

(అంతఁ బాండవులు ద్రౌపదితోఁ బ్రవేశింతురు.)

ధర్మ— (అర్జునుంజూచి కోపముతో) అక్కటా ! ల్లి యెంతపనిచేసినది ! ఇఁక స్త్రీల కీరహస్యగోపనశక్తి లేకపోవుఁగాక (శాంతముతో) తమ్ముఁడా ! ఆమె లోపముకన్నను నా తెలివితక్కువ యిక్కడ నెక్కు డనకతప్పదు.

ఉ. కుంతిమొగమ్ము తీరచటఁ గొండొక గన్పడ సంశయించి "యీ
వింత యిదేమి" యంచడుగ వేమఱు నాలుక జాఱఁబోవ న
ల్లంతనె "భావ్యమౌనె యిది" యంచు మరల్చితిఁ గాని యాపెతో
మంతనమందుఁ బల్కిన సమస్తము నా కెఱిఁగింపకుండునే.

నార— దౌవారికా ! మేము వచ్చితిమని చెప్పుము.

దౌవా— (ప్రవేశించి) జయము జయము నారదులవారు విచ్చేసిరి.

ధర్మ— ప్రవేశపెట్టుము.

ద్రౌణా— స్వామీ! ఇటు దయచేయుఁడు. (అందఱను లేతురు)

ధర్మ— బ్రహ్మపుత్రా! నమస్కారము. ఆ యాసనము నధిష్ఠింపుఁడు.

(అందఱును గూర్చుందురు)

నార— అభీష్టావాప్తి ర్భూయాత్.

చ. హరి కరుణావిశేషమున నర్జును గాండివపాటవమ్మునన్
గరువలిపట్టి బాహుబలగర్వమునన్ రిపులన్ జయించి భూ
భర మడఁగించి రాజ్యమును బాలన నేయుచు నుంటివే! వసుం
ధరసుకృతమ్ము లిప్పటికిఁ దద్దయుఁ బండెనె? గోర్కి నిండెనే?

ధర్మ— (విచారముతో) దేవా! మహానుభావ!

ఉ. జ్ఞాతుల నెల్లఁ జంపి సిరిఁ గైకొనినట్టి యపాత్రు ధర్మనం
జాతుని మిమ్ము బోటి మునిసత్తము లింత ప్రశంస చేయఁగాఁ
జూతురె! యెల్లవారలును సూతతనూజుని గాగఁ జూచు స
ద్వ్రాతిశయుండు సోదరుఁడె యౌనఁట! మాకిక నేమిసేయుదున్.

ఉ. తల్లి వంచించె నాడు పితృతర్పణముల్ పచరించునప్పు "దా
సల్లలితుండు సూర్యుని ప్రసాద" మటం చతఁ డేము నైనచో
నెల్లజగమ్ము లొక్కటయి యెత్తి పయిన్ బడెనేని లక్ష్యమా?
చెల్లె సమస్త మిప్పటికిఁ జేసెడిదేమి? మునీంద్రచంద్రమా!

భీము— (విషాదముతో)

ఉ. "నన్నుఁ బరాభవింపఁ దగునాయకుఁ డెవ్వఁడు రా!" యటంచునే
మున్ననుకొందు నేటికి సమూల మెఱింగితి నక్కటక్కటా!
మున్నరికంపు మాటల పముద్ధతిఁ జూపితిఁ బాపి నైతి నా
యన్న యటం చెఱుంగక మహాత్మ! కడుం జెడిపోతి వింతకున్.

అర్జు— (విచారముతో)

చ. అతఁ డెదురైన యప్పు డవి నర్కులు వేవురు దోఁచినట్లు నా
మతిఁ గనుపట్టి "శూద్రుఁడను మాటిది నిక్కవ మౌనొకో! యదే
ఋతమగునేని యిట్టిధృతి యింతటి చే వితువంటి పౌరుషో
న్నతియు ఘటించునే?" యనుచు నామది నెంతు ననేకభంగులన్.

వకు—

ఉ. ఎన్నఁడు నేరిఁ జూచి భయ మించుకయుం గని యే నెఱుంగ; నా
కన్నరనాథుఁ జూచినపు డాత్మ నదేమొ, భయోదయంబు మా
యన్న యజాతశత్రుఁ గనినప్పటికన్నను గొంత హెచ్చెడున్;
మన్ననఁ జేసి తత్పదనమస్కృతి సేయఁగ బుద్ధి పుట్టెడున్.

సహ— క. అని నతని నప్పుడప్పుడు
గని "యింతటి మేటి కొల్వు గావించునె? యొ
క్కనిచెంత" నను చు నామది
ననుకొంటిని గాని, యిట్టు లనుకొననైతిన్.

ద్రౌప— అక్కటా! నాడు సభామధ్యమున నన్ను నెకసక్కెపుమాటల గేలిసేయ, నదియేమో! సుయోధనునియెడఁ గనలిన మన మిమ్మహాత్మునియెడ నంతగాఁ గనలక సమ్మతిం గనఁ జేసెను. అయ్యో! అత్తగారు మీతోఁ జెప్పక పోయిన నాతోడనైన నించుక చెప్పక పోయిరి గదా!

నార— అమ్మా! ద్రుపదరాజనందని!

ఉ. ఇంత యమాయికత్వ మది యెచ్చటఁ జూచి యెఱుంగ; గారణం
బింతకు నిట్టు లుండ మఱి యెవ్వరు నేటికిఁ జెప్పగావలెన్?
వంత ధ్రువమ్ముగా మిము నవశ్యము చెంద విధించె ధాత యే
మంతన మిట్లు డాగెనను మాటలు మున్నెపుడేని వింటిమే.

క. తనకుఁ దనతండ్రి చెప్పఁడొ!
జనని వచింపదొ యి దిట్టిసంగతి యని! మం
తనమునఁ గృష్ణుఁడు చెప్పఁడొ!
వినఁజాలెనె యతఁడు? మీకు వెఱ్ఱి యిదేలా.

ధర్మ— మునీంద్రా! యెవరు చెప్పినను మాయన్నగారితోడనే చెప్పిరిగాని మాకు నొక్కింత చెప్పక పోయిరి కదా! పోనిండు.

ఉ. ఎట్టి రహస్యమైన మది నించుకవేపు వహింపలేవి మీ
యట్టి మహానుభావులును నస్మ దదృష్ట మదేమొ? నాయుకః

గట్టిగ బిగ్గఁ బట్టి మముఁ గాపురుషాగ్రిణులం బొనర్చి య
ట్టి ట్టవరాని దుఃఖమున కిక్కలఁ జేసితి రేమి పాపమో!

నార— (సంశయముతో) రాజా! యిప్పట్టున నేను గూడ వ్రతభంగం బొనర్చుకొన్నమాట సత్యమే. ఏమంటివా! దానికిఁ గారణము లేక పోలేదు.

క. కారణ మెటులైనను భూ
భారహరణమునకె మున్ను బ్రహ్మాదులు దా
మేరుపఱచి; రిట విఘ్నము
నారదుఁ డొనరించె ననుచు నాపైఁ బడరే?

అప్పటికేనియు నేను దాఁచెడివాఁడను గాను గాని,

క. సనకాదులతో సరిగ
ద్దెను గూర్చుండఁ దగువాఁడ దీనిని నే నే
మని నీతోఁ దగుదు నటం
చును జెప్పుదు ననుచు లజ్జ చొప్పడె ననఘా.

ధర్మ— మునివర్యా! తమ రిప్పు డిట్లు తప్పుకొనుచున్నారు గాని నిజముగా మా యందుఁ దమ కనుగ్రహ మున్నయెడల,

తే. అవయమును మాకు శాత్రవుఁడైనయట్టి
యల సుయోధనుతోనైన గలతెఱంగు
తాము గరుణించి చెప్పిన దానిమీఁద
నతడు ఖండనమునకేల యనుమతించు?

(కర్ణు నుద్దేశించి)

శా. అన్నా! నీవు గతించుమీఁద భవదీయంబైన రాజ్యంబు గై
కొన్నన్ గొంటిను గాక న్యాయ్యమగుటన్, గుంతీమహాదేవి యా
జ్ఞ న్నీకే మునుమున్న భార్య యగు పాంచాలిన్ గురుద్రోహినై
యి న్నీచుండు పరిగ్రహించె నకటా యీదోషముం బోవునే!

భీమ— అన్నా! హరిదశ్వనందన!

చ. "కురుపతి యంగరాజ్యమునకు న్ననుఁ బట్టముగట్టె" నంచు సం
బరపడి; తెవ్వఁ డాతఁడు? భవత్పరిపాల్యముకాదె యర్ధరా
జ్యరమయు దీనిలోన లవమైనను నుండునె యంగభూమి, బం
గరు మసిపాఁత గట్టఁ బడెఁ; గార్యము లేదిఁక నేమి వేయుదున్?

అర్జు— అన్నా! లోకైకవీర!

క. "ఎన యొకరి కొకరు కర్ణా
ర్జును" లని జనులాడుకొన నసూయవడుదు "నా
కెనయౌనె? సూతసుతుఁ" డని
మనుపమ యీ తపో్నకఁడు మన్నించినను౯.

సీ. "పాంచాలికాసతీ పరిణయమ్మునను నీ
తోఁ బోరి విన్ బాఱఁదోలితి"నని
"ఉత్తరగోగ్రహణోత్సవమ్మున విను
మించి వెన్నంటి భంజించితి" నని
"సర్పముఖాస్త్రపరిసారంబు కృష్ణుని
దయఁ దప్పె లేకున్నఁ దప్పని" దని
"అసమయమ్మునఁ బాడియగుఁగా దనక బాణ
మేయకుండిన దెగఁ డీతఁ" డనియు

తే. గీ. నొక్కొకప్పుడు మనమున నూహ సేతు
నంతియేకాని నాజయ మభిలషించి
"యీవుపేషించితి" వటంచు నెఱుఁగనైతిఁ
గ్రూరమతినైతిఁ గృష్ణుండు కొంపదీసె.

(కృష్ణుఁడు ప్రవేశించును)

కృష్ణ— అవును, పాపము నేనే కాదు కొంపతీసినది! మీయన్న తీయలేదు కాఁబోలును. ఆవేళ నతనిచే నవమానింపఁబడి నిన్నును నన్నును నేమనియెనో జ్ఞప్తికిఁ దెచ్చికొనుము! ఇంతకును జీతమును బత్తెమును లేని మీకొలువు గొలిచినందులకు నన్నిటు లనవలసినదే.

ధర్మ— ఇంతకు మాకర్మ మిట్లున్నప్పుడు నీవేమి చేసెదవు?

ఉ. "సూతజుఁ జంపలే వయితి కూరుఁడ నంచుఁ బ్రగల్భుపున్ వచ
శ్చాతురిఁ జూపఁ గాఁ గలవె, చాలును గాండివ మింకనేల నీ
చేత ధరించెదో?" యనుచుఁ జిన్నెలు వన్నెలు వెట్టి తిట్టితిన్
బాతకినై తి ముక్కు తెగబారెఁడు చేసితి నిక్క మచ్యుతా!

భీము— సరే, అందులకు మాత్రమితఁడే కాఁడా నిమిత్తము?

ధర్మ— తమ్ముఁడా! అతఁ డేమి చేయును? సంధి కరిగినప్పుడు మంతన
మ్మున నమ్మహా మహానితోఁ గలతెఱంగు వచియించెనుగదా! అతఁ
డొప్పవి యప్పు డితని తప్పేమున్నది?

భీము— అంతతో నేమిలాభము?

ఉ. చెప్పెనె యన్న "తమ్ములను జేరుము నీ" వని యంత మాత్రఁ దా
నొప్పెడివాఁడె కర్ణుఁడు మఱొక్కరి యట్టిఁడె! యన్నమాటకున్
దప్పునె? యా సుయోధనునిఁ దన్నెద నమ్మినవాని నూరకే
యొప్పరికించునంతటి యయోగ్యుఁడె? నీ కెనఁగాడె యన్నిటన్!

నకు— బావా! నీకుఁ గోపము లేవిచో నేనొకటి మనవి చేసికొను
చున్నాఁడను.

చ. ఎఱుఁగవియప్డు "సూతజుఁడనే" యను బుద్ధి సుయోధనుఁ నిరం
తరము భజించి తత్కృపను దా నొకరాజయి "పార్థునోర్తు సం
గరమున" నంచుఁ బల్కి, తఱి గల్గినయప్పు డెఱింగి తానమై
మరలి మమున్ గనుంగొనెడి మాత్రమె? యాతని శౌర్య మల్పమే?

సహ— బావా! నీమనమున నిజముగాఁ గపటమే లేనియెడల మాతో
వించుక చెప్పవలసినది.

గీ. అట్లు చెప్పితివేని మాయన్నగారు
కోరి బ్రతిమాలి రాధతోఁగొంత చెప్పి
యొప్పఁగాఁ జేసి యీపక్షమందునటుల
నలిపి యాతని రాజుఁగా నిలుపకున్నె?

ధర్మ— తమ్ముఁడా! అంతవఱ కెందుకోయి?

ఉ. అన్నగదా! మనందఱికి నాతనిమాటకు నడ్డువారమే?
యన్నరుఁ డేనుఁ బావనియు నీరలుఁ; గృష్ణుఁ డొకింత చెప్పకే
కన్నులు మూసెఁగాని "యలకౌరవనాథుఁడె నాకు సమ్మతుం"
డన్నను "మంచిదే" యనమె? యాతనిఁ గొల్చుట కొప్పకుందుమే?

ద్రౌప— అవును, మీరు "రాజ్యము వదలి యరణ్యమునకుఁ బదం" డనిన నెదురు చెప్పనివా రమ్మహామహుఁడు "దుర్యోధనునికే రాజ్య మి" మ్మన్న నట్లొనరించుటకు సందియమేమి?

నార— (తనలో) వీరల కించుక కలహమును బెంచెదఁగాక. (ప్రకాశము) అవును. తక్కినవారి మాటకేమిగాని శ్రీకృష్ణులవారు మాత్రము కొంచెము సూచనయైనఁ జేయవలసినది.

కృష్ణ— (క్రోధహాసములతో) మహానుభావా! కలహభోజన! యేమి ఇట్లు సెలవిచ్చుచున్నారు!

ఉ. ఏనటు చెప్పుచే నిజమ యేనియు వీరలు నేసినట్టి య
న్యాయ్యనములౌ ప్రతిజ్ఞలవి యొప్పునె? వీరలు సమతించు టె
ట్లైనను నూరువుల్ విఱుచుటా! రుధిరమ్మునుగ్రోలుటా! మృతుం
గా నొనరించుటా! యొకటికాదు గదా! మఱి యేరి కిన్నియున్!

అర్జు— బావా! బలభద్రసోదర!

చ. ప్రతిన యనంగ శత్రువులపైఁ బ్రసరించునె కాని యెయ్యెడన్
హితులకు నన్నదమ్ములకు నిట్లగునయ్య? స్మరింపు మమ్మహో
ద్ధతు వధియింపలేని నను ధర్మజుఁ డించుక దూఱ నేనుఁ జి
న్నతనము చూప నే మనుచు నాఁడు వచించితి వీవు? మాధవా!

ద్రౌప— (కొంచెము నవ్వుతో) అన్నా! నిన్ను వారు వృథాగా నాడిననాడు దురుగాక, నే నట్లనుదానను గాను గదా. ఇయ్యెడల నెఱిఁగియో యెఱుఁగకో నీయందు లోపము మాత్రము లేకపోలేదు. నీ శక్తి యెవ్వరెఱుఁగనిది?

నార— (తనలో) అయిన నేమిగాని చక్కఁగా నడిగినది. దీనికేమి యుత్తర మిచ్చునో?

కృష్ణ— (భారముగా) ఇంతకు "నేను గపటముగాఁ గర్ణునిఁ జంపించినా" నని కదా ! మీరందఱును వింధించుచున్నారు. సరే మంచియో చెడ్డయో యిందులకు నేనొప్పుకొన్నాఁడను గాని.

చ. అలయభిమన్యువిన్ ద్రుపదునాత్మజులన్ మఱి నీకుమారులన్
గలన వధించువాఁ డితఁడు గాఁడు గదా ! కపటమ్ము పన్ని, వా
రల బ్రతికించుకొం దవల రాధసుతున్ బ్రతికించి యేను వా
తల నిడినట్టి తప్పిదము తప్పఁగఁ ద్రోసెద వింత యేటికిన్ ?

నార— ఎందులకేని నీవే సమర్థుండవు గాని వీరలవలన నేమగును ?

ద్రౌప— మహాత్మా ! చక్కఁగా సెలవిచ్చితిరి.

భీము— బావా ! అభిమన్యునిమాటకు నేను జెప్పఁజాలను గాని తక్కనవారి మరణమునకు నీవు గాక మఱియెవ్వరు నిమిత్తము ?

తే. గీ. మమ్ము నెద్దియొ యొకనిమిత్తమ్ము సెప్పి
శిబిరమును బాపినట్టి విశిష్టదృష్టి
యూరకే కల్గెనే నీకు ? గారణమ్ము
నెఱిగియును జెప్పకుంటచే వింతపుట్టె.

అర్జు— బావా ! క్షమింపుము.

శా. నీతోఁబుట్టువు పూర్ణగర్భవతికి న్నేఁ గాలమున్ బుచ్చఁ గం
జాతవ్యూహవిధమ్ము సెప్పునెడ నాసాధ్వీవతంసమ్ము ని
ద్రాతైక్ష్ణ్యమ్మునఁ గన్మొగుడ్ప శిశు వంతస్థాయి యూకొట్టుచోఁ
గాతర్యమ్మున మధ్య వచ్చి యది విఘ్నమ్మొందగాఁ జేయవే ?

నార— అవును. ఈసంగతి నేను స్వర్గమున నప్పుడప్పుడు విన్నదే. ఆత వికిఁ బద్మవ్యూహము చొచ్చుటయే కావి మరల వచ్చుటఁ దెలియమి కిదే హేతువని మాత్రము ప్రవాద మొకటి లేకపోలేదు.

కృష్ణ— మహానుభావా ! మీరుఁ గూడ నాయెడల వింత యనుగ్రహించు చున్నారేమి ? కొంచెము సందర్భాసందర్భములు విచారించ వక్కఱలేదా ? ఊరకే యనినంతలో నేమగును ? గర్భములోని శిశు వెక్కడనేవి యూఁకొట్టునా ? యూఁకొట్టునే యనుఁడు. దానిచే నాకుఁ గాతర్య

మెందుకు ! సరే, అప్పుడు నేను విఘ్నముచేసినచో మఱియొకప్పు డితఁడు తనకొమరున కా శేషమును బోధింపఁగూడదా ?

నార— చిగురు సంగతికి నే నుత్తరము చెప్పఁజాలను గావి దావి వెనుక సంగతికిఁ జెప్పఁ గలను.

కృష్ణు— (తనలో) ఔహో ! ఈయన నిష్కారణముగా నాపై లేనిపోని తుట్ట వేయుచున్నాఁడే ! (ప్రకాశము) పోనీ దానికేని తగిన యుత్తరము సెలవిండు.

నార— ఎందుకా కాతర్యము, సంపూర్ణముగా విన్నచో నభిమన్యుని జయించువా రెవరును నుండరుగదా ! అప్పుడతనికై మరల నీవే యవతరింప వలసి వచ్చును. "గోళ్ళం దీరెడిపనికి గొడ్డళ్ళెందుల" కని యట్లొనరించి యుండవచ్చును.

కృష్ణు— (నవ్వుచుఁ గొంచెము కోపముతో) మునీంద్రా ! మీరు మఱియుఁ జక్కఁగా సమర్థించు చున్నారే !

తే. గీ. లేకలేకొక్కఁ చెలియ లాలేమకొక్కఁ
దే సుతుండఁట ! యవ్వానికితఁడు మేన
మామయఁట ! వానివృద్ధికై మానసమున
గనలునఁట ! కంటిమే యిట్టికట్టుకథలు

నకు— బావా ! క్షమింపుము.

క. నరకాసురుండు నీకుఁ గొ
మరుఁడేకద ! యతని నీవు మడియింపవె ? భూ
భరము నివారించెడి నీ
కరయఁగఁ బుత్రుఁడనిఁ శత్రు వనియుం గలదే.

కృష్ణు— దుర్మార్గుఁడైనచో భూమికి భరముగలిగించుగాని సన్మార్గుఁ డట్లు చేయఁడు కదా ! అభిమన్యునకును నరకునకును నెక్కడిసాటి !

తే. వరగుణుండైన పార్థుని పట్టి నాకు
మేనయల్లుండు సుగుణవిధాన మకట !

యతని కతమునఁ బుడమి కే యదరుగల్గు?
నెవ్వరును నమ్మరీగాధలింతనిజము.

నార— భవిష్యత్సందర్భము లెఱింగిన నీతో మాటలాడఁ గల మఁట కాని.

తే. ఒక్కఁడెవ్వండొదక్క నీయుద్ధమందు
మఱియు రాజులు లోకసమ్మతులుగారె!
వీరు భూభారకారులు గార యేని
యెందులకుఁ దెచ్చిపెట్టితి విట్టి రణము?

ధర్మ— (తనలో) ఓహో! యితరుల కలహమునుజూచి సంతసిల్లెడు నారదుఁడు స్వయముగనే కలహమునకు దిగుచున్నాఁడే! (ప్రకాశము కృష్ణునివంకఁ జూచి) కృష్ణా! వాసుదేవా!

ఉ. ఏవిషయమ్ముఁగూడ "నిద మిత్థ" మటంచు వచింప లేము గా
నీ విను మొక్కమాట, యెది యేనియు గోచరమౌను నీకు; నే
కోపిదు లేని యిప్పలుకుగూడ దనం గలవారు కారు, నీ
సేవకులైన పాండవుల నేగికి నెప్పుడు నొప్ప వచ్యుతా!

నార— రాజా! నీవు చిగురునఁ జెప్పినమాట సత్యమే, ఈతడు పాండవుల నేగి కెప్పుడును నొప్పలేదు.

కృష్ణు— (తనలో) ఓహో! వీరు విరమించినను నిమ్మని విరమింపక మరల నేదో రెట్టించుచున్నాఁడే! (ప్రకాశము) మునీంద్రా! బ్రహ్మ మానసపుత్రా!

ఉ. ఏ నొక మర్త్యుఁడన్ సకల మెట్టు లెఱింగెద మిమ్మువంటి ప్ర
జ్ఞానిధులైన సన్మునుల సంగతి నించుకెఱింగి యున్న మా
చే నిజమైన నయ్యది బహిం బడవైచుట తప్పుకాదె? క
ర్మాను గతుల్ మరల్పఁ దరమా పరమాత్మకునేని? నారదా!

ధర్మ— ఇంతకును నతఁడు చెప్పినట్లు కర్మ మనివార్యము.

ఉ. కడచిన దానికిన్ వగచి కార్యము లే దిఁకమీఁద నైన నీ
గొడవలు మాని పాపమునకున్ దగు నిష్కృతి చేసి కొంచు న

ట్టడవిని మిమ్ముఁ బోలెడు మహాత్ములఁ గొల్చుచుఁ గాలశేష మి
ట్లురుపఁ దలంచి రాజ్యమిది యొప్పఁగఁ జెప్పితి వాయు సూతికిన్.

అర్జు— (తనలో) ఓహో ! తిరిగియు నన్నగారు పూర్వపు వైరాగ్యము లోనికి దిగుచున్నారే ! ఇందు కేమి యుపాయము ?

ద్రౌప— ఆయన మీ తమ్ములు గారా ? మీ కున్న యడవు లాయనకు లేవా ? తీరఁదగు ముచ్చట లన్నియు నిప్పటికే తీరినవి. ఇక నిప్పు డరణ్యావాస మెందుకు ? పోనిండు. అట్లొనర్చిన మీయన్నగారు గావి తక్కినవారు గాని లేచి వచ్చెదరా ?

నార— రాజా ! ఆమెయుఁ బుట్టెడుదుఃఖములో నున్నది. నీకై ధైర్య మవలంబించి యాఁడుది యైనను నిట్లు పలుకుచున్నది. ఆ పలుకు విశ్వసించి,

తే. శిష్టరక్షణమును దుష్టశిక్షణంబు
సల్పుచును లోకులెల్లరు జయ మనంగ
ధర్మరాజను పేరు సార్థకము గాక
నేలుకొనుమయ్య ధరణికి మేలుగాగ.

భీము— అన్నయ్యా ! ఇందులకుఁ దా మొప్పితిరా సరే. అట్లుకాదేని,

చ. కొడుకులొ కొమ్మలో యెవరికోసము రాజ్యము నాకుమాత్ర ; మే
జడమతి నయ్యు మీకతన జ్ఞానము కొంచెము నేర్తు ; మీర లె
య్యెడ వసియింతురో యచట నేనును మీపదసేవ నేయుచున్
గడపెదఁ గాల ; మాజ్ఞ యిడఁగాఁ దగు నాకు ననుగ్రహమ్మునన్.

ధర్మ— (విసువుతో) తమ్ముఁడా ! నేనొక్కటి చెప్పెద నాలింపుము.

గీ. ఆదినుండియు నాకు రాజ్యమున గాంక్ష
యంతగా లేదు నిజమిదియనియెఱుంగు
దానిపై నిన్నికష్టముల్ దాపరించి
'ఛీ' యని విరక్తిపొడమె నాచేతమునకు.

అర్జు— (తనలో) ఈయన కెవరు బోధింపఁగలరు ? మొదల నుండియు నీయన యభిప్రాయ మిట్టిదియే (ప్రకాశము) అన్నా ! ధర్మనందన !

క. ఇపు డీ వొనర్పు యెత్నం
బపుడే యొనరింప రాదె? యాత్మజులును భూ
మిపతులు జ్ఞాతులు నీదగు
కృపను బ్రతికిపోదు; రెసఁగు గీర్తియుమనకున్.

ద్రౌప— సంశయ మేమి? అప్పుడే గట్టిగా నామనోనిశ్చయ మిట్టిదనిన్న
విం దొప్పనివా రెవరు? ఇప్పు డిట్లనిన నేమి లాభము? వారికిని
లేదాయె. మన కంతకన్న లేదాయె, ఇట్టి వృథాప్రయాస మెందుకుఁ
బడవలెను?

ధర్మ— ఎందుకా? ఇందుకు.

క. "అరులకు భయపడి యీతం
డరణ్యములు దిరుగు" ననెడి యపయశమది నా
కు రుచించెనేనియును మీ
కు రుచింపమి నిందు దిగితిఁ గ్రూరుఁడనై తిన్.

కృష్ణు— సరే, అట్లయినచో,

క. "ఇల నేలలేక కానన
ములకేగెన్ ధర్మజుండు మొగి" ననియెడి ప
ల్కులు వైపలేరు నీ త
మ్ములు వీరి ననుగ్రహింపు మనుపటివలెనే.

ద్రౌప— (తనలో) ఇప్పట్ల నన్న మంచి సమాధానము చెప్పినాఁడు.

భీము— అన్నయ్యా!

తే. "కడు విరక్తిని నన్న కాఅడవి కేగఁ
దగిన తమ్ములుగల్గియుఁ దగవు చెప్పి
మాన్పలేరై" రటంచు ధీమంతు లనెడి
పల్కు లేగతి సహియించు వారమయ్య?

నార— (తనలో) కొంచెము త్రోవఁజూపినచో ధర్మరాజునకుఁ దగినయుత్త
రము చెప్పఁదగినవాఁడు భీముఁడే; ఈ యంకుశము లేనిచో నా మత్త
గజ మదివఱకే యడవులం బడి పోవును.

నకు— అన్నా! కౌంతేయాగ్రజ!

క. రణ మన్న యప్పుడే మా
రణ కర్మముగాదె? యది హరణమునకే కా
రణ మగునుగాని సుఖకా
రణ మగునే? దీనిచే విరాగము తగునే?

సహ— అన్నా! సకలధర్మవేదివగు నీకొరులు సెప్పవలయునా?

తే. నృపున కన్నయుఁ దమ్ముఁడు నితరులును
నధర్మవర్తనులగునెడ దండ్యులెకద?
కర్ణుఁడు నధర్మవర్తియౌ కతన దండ్యుఁ
డయ్యె నియ్యెడ సందియమందనేల?

వార— (తనలో) చిన్నవాఁడైనను మంచి ఖండితోత్తరముగాఁ జెప్పినాఁడు భీమార్జునులు చెప్పినను నింత నిరాఘాటముగాఁ గనుపట్టదు. ఇంతకు నితఁడు చెప్పినట్లు వారెట్లు చెప్పఁగలరు. ఏకగర్భజనితులుగదా. వీరి కైదుగురకును నట్టి భేదములేదు గాని, ఐనను ఆవ్రేలి కావ్రే లెట్లైని యుఁ గొంచెము దూరము కాకపోవునా?

కృష్ణ— ఇప్పట్లు నితఁడు చెప్పినమాట కడుశ్లాఘాపాత్రముగా నున్నది. రాజులకు శత్రు మిత్రాది భేదము లెట్లు కుదురును. శాస్త్రమునుబట్టి పోవలయును. లేదా నరకము సిద్ధము.

ధర్మ— (నిర్వేదముతో) ఏమీ! నేనా అమ్మహాత్ముని శిక్షించువాఁడను!

ఉ. అక్కట! యిట్టులాడఁ దగునయ్య? పరాక్రమశాలి దాతృతా
ధిక్కృతకల్పపాదపుఁడు దీనజనావనపక్షపాతి పే
రెక్కినవాఁడు "స్వామికృతి కింతటిసాహసి తే" డటంచు నే
నెక్కడ, యాతఁడెక్కడ! యిసీ? జగ మిప్పని కుత్సహించునే.

అతఁడు విధేయులమగు మాయెడల నెట్లు నటించినను నది తప్పు కానేరదు. మాకుఁ దక్క నతఁ డెవ్వరి కేమి యపకృతి చేసెను?

చ. ఎవని భుజాబలమ్మునను యింద్రతనూజుని వాయుపుత్రునిన్
గవలను విన్ను నన్నెదురగా గమకించె సుయోధనుండు దా

నెవనికి దాసుఁడై మెలగె నీజగతీతల మెల్ల నేలియున్,
శివశివ ! యమ్మహామహానిజెప్పి మఱొక్కనిఁ జెప్పనున్నదే !

బావా ! ఇంత యెందుకు ! సంగరమున నొక్క యర్జునుం దక్క మమ్ము నలువురను నతఁ డవమానించుట నీ వెఱుంగనిది కాదు గదా ! చేఁజిక్కినప్పుడు వదలిపెట్టుట కాతని నీతిధురంధరత్వము తప్ప వేఱొండు కారణము చూపుము ! నాకన్ననే కాదు, ఎవరికన్నను నతఁడు లోకోత్తరుఁడు. చక్కని బుద్ధితోఁ బరికించిన నతనియెడ దోసము వీసమేనియు నుండదు. (నిర్వేదముతో) అయ్యో ! దాతృత్వమా ! వీవు దిక్కులేని దానవైతివి సుమీ !

నార— నిజమున కతఁ డిట్టివాఁడే కాని దుర్యోధనునియొద్ద నుంటచే నతని యోగ్యత కనుపట్టినది గాదు. ఆశ్రయ విశేషమునం గదా గుణములు శోభించ వలయును ! అందులో "దాతృత్వ మతనితోఁబోయిన" దన్న నది యతిశయోక్తి గాదు.

ఉ. ఆతని దాతృతామహిమ మయ్యమరేంద్రుఁ డెఱుంగు "నిచ్చచోఁ
జేతికి నెమ్ము లే" దను ప్రసిద్ధికి నీతఁడె తగ్గవాఁడు ; ప్ర
ఖ్యాతశరీరి కర్ణుఁ డిపు డైనను జావఁగ లేదు నిక్కమే
దాతృత దిక్కు లేనిదయి తా నశియించెఁ జుమీ యమాత్మజా !

క. బలిశిబిదధీచు లిల ముమ
గల రెక్కుడు దాత లందుఁ గర్ణునితోడన్
దులదూగువార లిరువురె
బలి కీతని దొరయుపాటి బలముం గలదే ?

కృష్ణ— సంశయమేమి ? తమరు సెలవిచ్చినట్లే.

గీ. అర్థమీవచ్చుగాక సమస్తరాజ్య
మీయగావచ్చుగాక వెన్నెమ్ముమాంస
మీయగా శక్యమే చర్మమేరికేని
వితవికే వారికే తగె నింతవట్టు.

ధర్మ— (కన్నీటితో)

ఉ. అట్టి మహానుభావుఁ డిల యంతయు నేలిననేలుఁ గాక నా
యట్టిడు తాదృశుండగు సుదారుని రాజ్యముఁ బూని యేలినన్
దిట్టరె పండితుల్ ? కవులు దిట్టరె ? పేదలు దిట్టిపోయరే ?
"వట్టి పినాసి వీఁ" డనెడు వా డెటు నే మెడఁ గట్టి కొందునో ?

కృష్ణు— బావా ! నీ వా దాతృతయందును నాతనికిఁ దమ్ముఁడవే సంశయ మేమి ?

చ. వెనుకటి రాజసూయమున విప్రుల నెందఱి నెన్ని భంగులన్
దనిపితి ! చక్రవర్తివిగదా యిపు డంతకు నెక్కుడైన చ
క్కని సుకృతమ్ములన్ విరివిగా నొనరింపుము; జ్ఞాతివర్గఖం
డనజనితాఘసంహతు లణంపుము చింతిలనేల దీనికిన్ ?

భీము— అన్నా ! దండధరనందన !

చ. అమలమనీష నీవు ముద మారఁగఁ జేయఁ గదయ్య యశ్వమే
ధము దురితమ్ము లెల్లను యథా యథలై నశియించు దాన; "ద్ర
వ్య మిపుడు లేదుగా" యని లవమ్మును సందియ మందఁ బోకు, వి
క్రమధనులైన సోదరులకన్నను ద్రవ్య మొకండు గల్గునే !

నార— రాజా ! మేము విధింపఁదగిన యంశమ్మును ధర్మజ్ఞుఁ డగు నీ తమ్ముఁడే బోధించుచున్నాఁడు. కావున నవశ్య మట్లొనరింతువు గాక.

అర్జు— తే. ద్రవ్యమున కేమి సంపత్ప్రదాత్రియైన
యంబుజాక్షుని దయ మనయందుఁ గలదు;
కామధేనువు నట్టింటఁ గట్టిపెట్టి
"కోర్కె లొనగూర్చు" మని యొరుఁగోరనేల ?

నకు— (పౌరుషముతో) అన్నా ! ధర్మవిదగ్రగణ్య ! అట్లేదో నిష్కృతి యొనరించుకొను టుచితము. అంతియేకాని.

తే. రాచపుట్టువుఁబుట్టి యరణ్యసీమఁ
దిరుగుదురె ? బ్రాహ్మణులమె ? విధించె ధాత
మనకు భూభారభరణ మమ్మహితు నాజ్ఞ
నమ్మ సేయుట మీవంటివారి కగునె ?

సహ— అన్నా! కౌంతేయాగ్రిజ! ఇదియేవియుఁ బ్రాయశ్చిత్తార్థము చేయనక్కఱలేదు. రాజులకు నవశ్యాచరణీయ మగుట వొనర్పఁ దగినది.

తే. జ్ఞాతులను మన మేటికిఁ జంపినార!
మంతరించిరి వా రెల్ల నాత్మదోష
ముల కతమ్మున; నీవంటి పుడమి లేఁడు
జాతిధర్మమ్ము విడిచిన జగము నెడదె?

ధర్మ— అన్నలార! యెతిఁగియెఱుఁగని మాటలు చెప్పకుఁడు. కుల వృద్ధగు భీష్ముఁ డేమంత దోషియై యంతరించెను?

[అంత నొక పురుషుడు ప్రవేశించును.
"ఇదిగో" యని ఉత్తరమిచ్చిపోవును.]

ధర్మ— (విప్పిచూచి తనలో)

క. తమ్ముంగుఱ్ఱలఁ గృష్ణుని
నిమ్మునివరు నెట్టులేని యే నొప్పింపం
గ మ్మది నెంచితి; గులగురు
నిమ్మాడ్కి విధించెఁధాత; యిక నేమందున్.

కృష్ణ— ఏమిది రహస్యమా, మీలో మీరే యోజించుచున్నారు!
ధర్మ— (చేతికిచ్చును)
కృష్ణ— (చదువును)

క. "శ్రీరస్తు చిరంజీవికి
పారావారున కజాతశత్రునకు ముదం
బారఁగ శంతనసుతుఁ డా
శీరాద్యంతమున వ్రాయు నేమపువార్తల్"

ద్రౌప— (తనలో) ఏమని వ్రాయునో?
భీము— (తనలో) ప్రతికృతానుగుణముగా నున్నచోఁ జక్కగా నుండును.
అర్జు— (తనలో)

గీ. అకట ! నాదు శరమ్ముల నంపసెజ్జఁ
గూలియుండి రవంతేని గోపమొంద
కిపుడు దీవించియే వాఁడియు నిద్ధచరితు
శాంతి నా కెంతయేని లజ్జాకరంబు.

నార– తరువాత ?

కృష్ణ– క. "అరుల జయించితి రాజ్యము
కరగతముగఁ జేసికొంటి కావున ధర్మ
స్ఫురణమ్మ వలయు నీకది
యరసి వచింపఁగఁ దలంతు నరుదెమ్మిటకున్"

ద్రౌప–(తనలో)పాపము! ఆయన యిప్పటి యీయుద్యమం బెఱుఁగఁడు.

నార– అవును, ధర్మరాజునకుఁగూడ ధర్మములు చెప్పుట కా యనఘుఁడే తగిన వాఁడు. తరువాత ?

కృష్ణ– క. "ఏ నిపుడు చెప్పనెంచిన
యీనీతులు రాజ్య మూనియే వినవలె వే
వే నీవు పట్టభద్రుఁడ
వై నాకడ కరుగుదేగదయ్య కుమారా"

ద్రౌప– (తనలో) అమ్మయ్యా ! ఇప్పటికి బ్రతికితిమి.. ఎవరిమాట తీసి వేసినను ఆయనమాట తీసివేయఁగూడదు.

భీము– (తనలో సంతోషముతో) ఇయ్యనఘుని వైరాగ్యగజమునకు మంచి యంకుశము తటస్థించినది.

నార– (ఏకసక్కెముగా)

గీ. నారదుఁడు గాఁడు దేవకీనందనుండు
గాఁడు భీముఁడునుం గాఁడు కవలు గారుఁ
క్రీఁడి గాఁడు ద్రోవదిగాదు 'కూడ' దనిన
దీర దిఁక భీష్ముఁ డితం డుదీర్ణగుణుఁడు.

ధర్మ– (వినయముగా) మీరందఱును నాకుఁ దెలుపఁదగినవారు కారా ? అందులో దమ రేమి హరి యేమి, ఆయనకన్నను మాన్యులు.

క. నా మనము కేవలము చిం
తా మగ్నంబైన కతనఁ దమయాజ్ఞకు నే
నై మొగియ నైతి దయతో
నీ మూర్ఖు క్షమింపవలయు నియ్యెడ ననఘా!

నార— (నవ్వుచు) రాజా! నే నూరక యిట్లంటినే కాని దేవవ్రతుఁడు మా యిరువురకన్న వేయి రెట్లధికుఁడు.

కృష్ణ— సంశయ మేమి?

సీ. జననంబు నెంతుమా! సకలాఘసంహృతి
క్షమమగు గంగ గర్భమునఁబుట్టె;
పౌరుషం బెంతుమా! పార్థివాంతకుఁడైన
పరశురాముని నాజి భంగపఱచె;
సత్యమ్ము నెంతుమా! జనకుని పెండ్లికై
తా నన్నమాట నిం దనుక నిల్పె;
వ్రతనిష్ఠ నెంతుమా! పార్థుచేఁ గూలి పు
ణ్య దినమ్ముపఱకుఁ దా నట్టె నిలిచె;
గీ. నిందు నొక్కొక్కటియె కడు నెన్నఁదగిన
విన్ని యునుగల్గు భీష్మున కెవరుసాటి?
మ మ్మటుంచుము భువనైక మాన్యులైన
మూడుమూర్తు లియ్యనఘుతో మొనయఁ గలరె!

ధర్మ— (విచారముతో) ఇట్టి మా తాతగారును, నట్టి ద్రోణాచార్యులవారును వీరల తోడనే పోల్పఁ దగు మా యన్నగారును నేలకో యీ రణమున నిహతులైరి. అక్కటా! కాల మెంత యనివార్య మైనది!

నార— రాజా! ఇం దాశ్చర్య మేమున్నది? భీష్మ ద్రోణు లిరువురును న్యాయైక పక్షపాతమున మీ కుపకార మాచరింప నెంచి యస్థిరమ్మగు కాయమ్ము విడచి సుస్థిరమ్మగు యశమ్ము సంపాదించుకొనిరి. "నిష్పక్షపాతముగఁ బోరాడినవాఁడు మీ యన్నగా రొక్కఁడే" యని నిష్కర్షగాఁ జెప్పవచ్చును.

సీ. గోవధమ్మునకు సంకోచించి వేడిన
తఱిని విప్రుఁడు దయ దాపఁ దేని
బ్రహ్మాస్త్రమును గొను పట్టున భార్గవుఁ
డెఱిఁగి చెచ్చెర శపియింపఁదేని
పార్థునందలి పక్షపాతబుద్ధిని నిందుఁ
దరిగి తన్నును బిచ్చ మడుగఁ దేని
యర్ధరథునిఁ జేసి యవమానపఱచి భీ
ష్మం డసూయ నొకింతఁ జూపఁ దేని

గీ. కుంతి "వర" మని పలుమాఱుఁ గోరదేని
శల్యసారథ్యమను ముప్పెసంగదేని
కృష్ణుఁడన్యాయపథము సాగింపఁదేని
గర్ణు నోడించువారు జగాన గలరె!

ధర్మ— మహాత్మా! యయ్యనఘుని గుణము లెన్ని విన్నను దఱుగవు. దుర్యోధనుడొనర్చిన యకృత్యములకుఁ గోపము గల్గియును నీతని ముఖము చూచు నంతనే యయ్యది పటాపంచలై పోయెడిది. కారణా న్వేషణమునకు మనము ప్రయత్నించియు నిట్లు జరుగుట యవశ్యం భావి యగుటచేఁ గాఁబోలు నంత దీక్ష మాత్రము వహించినది కాదు.

క. జనకుండు చిన్నతనమునఁ
జనె; నగ్రజుఁ డిట్టులాయె; సంసారము నె
త్తినిబడియె; "విడిచిపెట్టెద"
ననుకొన్నను వీలు చిక్క దార్యుల కతనన్.

నార— రాజా! యీ యాశ్రమమున కే యాశ్రమమును సరికాదు సుమా! ఏమందువేని,

సీ. వేదవ్రతముల నాపాదించి చరియించు
బ్రహ్మచారులకెల్లఁ బట్టుగొమ్మ
అతిథులై చరియించునట్టి గృహస్థుల
నాదరింపంగఁ గల్పాగమంబు

భార్యైకయుక్తులై వనమునఁ దిరుగు వా
నప్రస్థులకు రక్షణప్రసక్తి
సంసార హింసా రిరంసా విరక్తులౌ
సన్న్యాసులకును విశ్రాంతిభూమి
గీ. యైన గార్హస్థ్యమున నుండి యఖిల కర్మ
ములనొనర్చి తుదకుముక్తిఁబొందవచ్చు
నట్లుకాదేని యవ్వసిష్ఠాదిమునుల
కేల గార్హస్థ్యముననుండు టెఱుగఁ జెపుమ ?

ధర్మ— మహాత్మా ! మీయాజ్ఞ శిరసా వహించుచున్నాఁడను.

భీము— (సంతోషముతో) నకుల సహదేవులారా !

ఉ. ఇంతకు మున్న వచ్చిన నృపేంద్రకుమారుల కెల్ల నేటి యీ
వింత నెఱుంగఁ జేయుటయు, వీ డఖిలంబు నలంకృతమ్ముగా
నెంతయు వేడ్క సల్పుటయు, నిప్పటికిం దగు కార్యముల్; పొసం
గింతురు గాక యిప్పను లొగిం దగువారల నేర్పరించుచున్.

(నకుల సహదేవులు నిష్క్రమింతురు)

ధర్మ— అర్జునా !

గీ. ఇప్పటి విశేషములనెల్ల నెఱుగఁజెప్పి
"వలయు సాధనసామగ్రి గలయఁగూర్పుఁ"
డనుచు ధౌమ్యులతో వినయమున నేను
మనవి చేసితినని చెప్పుమా కుమార.

(అర్జునుఁడు నిష్క్రమించును)

నార— రాజా ! మేము తిరిగియుఁ బట్టాభిషేక కాలమున కరుగు దెంతుము.

కృష్ణ— బావా ! నే నిప్పటికిఁ జని యుత్సవసమయమునకు సకుటుంబ ముగా నరుదెంచెదను.

ధర్మ— అట్లనే యొనరింపుము.

చ. శషభిష లంతగా సలుపఁజాలవు నీవు, హలాయుధుం దక
ల్మషహృదయుండెయైన మనమాటఁ దలంచినమాత్రి మంచు, నా
ఋషితులితపరిభావునకు నేగతినేనియు నొప్పఁజెప్పి బల్
కృషి నొనరించి యియ్యెడకు నెట్లయినం గొనితేవలెం జుమీ.

నీవెంబడి భీమునిం గూడఁ దీసికొనిపోయి యతనిచేఁ దగు మాటలు
నెప్పించి యతనికిఁ గోపోపశాంతి కావించి యిందులకు సమ్మతింపఁ
జేసి తోడ్కొని వత్తువుగాక!

కృష్ణు— మంచిది. (భీమునితో నిష్క్రమించును.)

ధర్మ— దేవీ! ద్రుపదరాజనందని!

ఉ. పట్టపుదేవినైతి నను భావమునన్ గరువంబు దాల్ప కె
ట్టెట్టులు నేరి నేరఁ దనియింపుట యొప్పగు నట్టు లట్టు లి
వ్పట్టున వారి వారికి సపర్యల నర్పణ నేసి కీర్తికిన్
బట్టగునట్టు లుండఁ దగు భారము నీతలఁ బెట్టితిం జుమీ!

గీ. ధనములా శాశ్వతముగావు; తనువు లంత
కన్న శాశ్వతములుగావు; కలిమిలేము
లబ్బుతఱి నుబ్బుటయును దబ్బిబ్బువడుట
సారవిదులైనవారి లక్షణము గాదు.

ద్రౌప— నాథా! తమ యానతి చొప్పుననే సకలము నిర్వర్తించుదానను.
మన మిరువురమును దుఃఖాంబుధిమగ్నులగు మీ తల్లిదండ్రులకడ
కరిగి యోదార్చి యెట్టులేని యిందులకు వచ్చునట్లు ప్రార్థింప
వలయును.

ధర్మ— దేవీ! చక్కగా బోధించితివి. ఇప్పుడేపోయి యట్లొనరింతము.
(నిష్క్రమింతురు.)

— గద్య —

ఇది శ్రీ....తిరుపతి వేంకటేశ్వర ప్రణీతంబగు
పాండవాశ్వమేధమ్మున తృతీయాంకము.

ఓం

శ్రీ మత్పరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము.

చతుర్థాంకము.

(అంతట నొక కవి ప్రవేశించును)

కవి— (విసువుతో)

ఉ. ఎక్కడి కేగినన్ శిశువులే నృపతుల్ కవితారసాయనం
బెక్కడ! కుక్షి లెక్కడ! యిసీ! యిటు లందఱి రాజులన్ యశో
భాక్కుల దాతృతాఖనులఁ బాండవు లేమని చంపిరో కదా!
యక్కట! సత్కవీశ్వరుల కన్న మిఁ కేగతిఁ గల్గఁగా వలెన్.

(పరిక్రమించి చెవియొగ్గి) ఇయ్యెడ రాజు నెట్లు పొగడుచున్నారో!

(తెరలో)

గీ. ఇంత శాంతుండులేఁడు లేఁడింత దాంతుఁ
డింత సదయుండులేఁడు లేఁడింత దాత
ఇంతటి నిగర్వి లేఁడు లేఁ డింత యోగ్యుఁ
డింతటి యశస్విలేఁడు లేఁడింత రాజు.

కవి— ఇట్లెల్లయెడలం గొనియాడఁ బడుచున్న యీ రాజు నిజముగా "పంటవలంతి నోచుకొన్న నోములపంట" యనినం దప్పేమి? ఇట్టి మహానుభావుని దర్శనమునకుఁ బోవుచుంటివి గదా! ఒక పద్యమేవియు రచించుకొనవలదా? (రచించుట నభినయించి)

చ. కృతయుగ మాది నిప్పటికి నెందఱు రాజులుగారు! రామభూ
పతి యొకరుండు దక్క నినువంటి నృపాలకు లేరి? యాతఁడుం

"బ్రతి" యని జెప్పఁజాల మొకపట్టున; నింతటి భాగ్యశాలివై
క్షితి నలరించు నీకు దయసేయు రమాపతి సర్వసౌఖ్యముల్.

పద్య మనుకూలముగాఁ గుదిరి యుండునా? కుదుర కేమి? కాని కొంచె మతిశయోక్తి పడినట్లు మాత్రము తోచుచున్నది. లేదు! రాముఁడు తప్ప నింతటి రాజు లేనేలేఁడు. ఉన్నచో నాదికావ్యమును రచించిన వాల్మీకి యాతని చరిత్రమునే యేల కైకొనవలెను? తరువాతఁ దిరిగియు నట్టి కవి యున్నచో నీతని చరిత్రము వ్రాయఁ దగినది. ఇందులకు నిప్పటి వారిలో వ్యాసులవారే తగినవారు. ఒక్కొక పట్టున ని య్యనఘునికి శ్రీరాముఁడుం దుల్యుఁడుగాఁడు. సత్యమే! ద్రౌపదిం జెఱగొన్న సైంధవు నీతండు ప్రాణావశేషముగా విడిచినాఁడు, రాముఁడో! సీతం జెఱగొన్న రావణునిఁ బుత్రమిత్రసమేతముగ నశింపఁజేసెను. సరే, ఇక్కడికిఁబద్యము కుదిరినది. రిక్తహస్తములతో రాజుం జూడఁ గూడదు. (దృష్టి నిగుడించి) అడుగోఁ, బండ్లమ్ముకొనువాఁ డొకఁ డటు పోవుచున్నాఁడు. వాని నిటు పిల్చెదఁగాక. ఓయీ! పండ్ల వర్తకుఁడా! ఇటు రమ్మ.

(అంత వర్తకుఁడు ప్రవేశించును)

వర్త— ఏమయ్యా పిల్చినావు?

కవి— పండ్లు కావలెను.

వర్త— ఇదిగోఁ గొనుండు.

కవి— వెల యెట్లు?

వర్త— జో దద్దషావలా.

కవి— ఇఁక నొక మాట చెప్పు.

వర్త— ఎన్నిసారులు చెప్పినను అంతే.

కవి— సరేగాని మీ రాజుగారు మంచివారు కదా?

వర్త— ఇంత మంచివా రెక్కడను లేనేలేరు.

కవి— తఱచుగాఁ గవీశ్వరులు వచ్చుచుందురా?

వర్త— రాకేమి, తఱచు పండితులతోడనే కాలక్షేపము. తమరుఁ గూడఁ గవీశ్వరులవలెనే యున్నారే! రాజుగారు గ్రామములో లేరు.

కవి— (విషాదముతో) ఏమీ. యెక్కడికివెళ్ళినారు ? ఎప్పుడు వత్తురు ?

వర్త— భీష్ములవారియొద్దకు వెళ్ళినారు. వా రీదినమున స్వర్గమునకు వెళ్ళెదరఁట.

కవి— (తనలో) ఇక్కడికి వచ్చినను మన దరిద్రదేవత వెంటనే వచ్చినదే ! (ప్రకాశము) అయినచో నాకీఫలము లక్కఱలేదు.

వర్త— పోనిండు (నిష్క్రమించును)

కవి— ఈగొడవ యడఁగినమీఁదఁ దిరిగియు వచ్చెదగాక. (నిష్క్రమించును)

(అంత శరతల్పగతుఁడగు భీష్ముఁడును పాండవులును విదుర ధృతరాష్ట్రులును గృష్ణుఁడును ప్రవేశింతురు)

భీష్మ— (దీనస్వరముగా) నాయనా ! ధర్మనందన !

ఉ. నీ పరిపాలనమ్ము విని నిత్యము సంతస మందు చుంటి నే
యాపద లేక భూమిప్రజ లందఱునున్ సుఖ మందు చుండి రో
హో ! పరమాత్ముఁ డిప్పటికి యోగ్యతము న్నిను రాజుఁ జేసి సం
తాపము నందు భూసతికిఁ దానొనరించె ముదం బతంద్రుఁడై.

ధర్మ— (విచారముతో) పితామహా ! గాంగేయ ! సర్వబంధుసంహారం బొనరించి నే నిప్పుడెట్లు పాలించిన నేమి లాభము ? అయినను

ఉ. భవదుపదేశవాక్యములపై మది నిల్పి త్రికాలవేది మా
ధవు ననుశాసనమ్ము గొని తమ్ముల సమ్మతి యూఁత గాఁగఁ బె
ద్దవిభుని యాజ్ఞ చొప్పున సదా విదురానుమతిన్ గృపార్యు శా
స్త్రవిధికి లోఁగి నేనును యథామతిఁ జూతు సమస్త సంగతుల్.

కృష్ణ— తాతా ! లోకైకపూత !

ఉ. ఎవరు సహాయు లెందులకు నీయనఘాత్మున కెన్ని యెన్ని ధ
ర్మవిధులు గల్గు నన్నియును మాన్యచరిత్రుఁడ వైనయట్టి నీ
సవిధమువంద శిష్యుఁడయి సంగ్రహణం బొనరించెఁ; దాము పాం
డవులకుఁ గాదె దేహము కడంగి వహించితి రింతకాలమున్ !

భీష్మ— కృష్ణా ! వాసుదేవ !

గీ. ఎవనిలో నుండు లోకమ్ము లెవఁడు లోక
మెల్లెడ వసించు నట్టి యోగీశ్వరేశ్వ
రుండ వీవుండ వేఱొక్కరుండవలెనె?
పాండవుల పాలి పరమబంధుండ వీవు.

విదు- సంశయ మేమి?

గీ. ఎన్నియో కారణమ్ముల నిమ్మహాత్ము
నవతరించుటకై పెద్ద లంద్రు గాని
పాండుసుతరక్షణైకతత్పరతకుఁ బని
గట్టికొని పుట్టె నని నమ్మకమ్మునాకు.

భీష్మ- విదురా! జ్ఞానవిదుర! నీయూహ చక్కగనే యున్నది. వినను,

గీ. ఇమ్మహాత్ముని యవతార మెన్నియేని
గారణమ్ములు గలయది గాని యందు
దిక్కుమాలిన నావంటి దీనులకు వి
ముక్తి నొసఁగుటయేసుమ్ము ముఖ్యఫలము.

ధృత- (కన్నీటితో) తండ్రీ! నీవు నిజముగా దిక్కుమాలినవాఁడవే యైతివి.

గీ. వీర వీరార్చిత! విచిత్రవీర్యునకు వి
వాహ మొనరించితివి కష్టపడి జయించి;
అతడు నేఁటికి బ్రత్యుపకృతిని నిట్టు
లాచరించెను నావంటి యధము కతన.

అర్జు- (విచారముతో) తండ్రీ! యిప్పట్ల నీవుగాని నీ కొమరులు గాని లేశమును నింద్యులు గారు.

ఉ. అని నొనరింప లేక చని యాచనఁ జేసె నజాతశత్రుఁ; డీ
మనుమనియం దనుగ్రహముమైఁ దన చచ్చు నుపాయముం గృపా
ఖని వచియించెఁ దాత; "యగుఁ గా" దన కేనటు లాచరించి యి
య్యనఘుని నిట్లొనర్చితి నహా! మము నిర్వర దూఱుటొప్పగుం.

ధర్మ- తాతా! శంతనుపుత్రా!

ఉ. "ఏమనికోరె వీఁడు గుణహీనుఁడు ద్రోహి దురూహుఁ డక్కటా !
పామరుఁ" డంచు నెంచక కృపామతి గుట్టెఱిఁగించి తీవు మా
నేమముఁ గోరి; "యిట్టిపని సేయుట త" ప్పని యే నెఱింగియున్
భూమికి నాసఁ జేసితిఁ; దపోమహితున్ గులవృద్ధుఁ జంపితిన్.

భీమ— (విచారముతో) తాతా ! శాంతిగుణోపేత !

క. కులవృద్ధు ని ట్లొనర్చిన
ఖలులకుఁ గులవృద్ధి గలదె ? కాబట్టియె ని
ష్కలుషులు సుతులు నశించిరి
కలనెల్లను దీరుపై నకారణ మనఘా.

అర్జు— అందునను, నేను బరమ దుర్మార్గుఁడను.

గీ. పరశురాము జయించిన బల్లిదుండు
తాత; యాతనిమెప్పుఁ దద్దయువహించి
నట్టి చెట్టంత కొడుకు దానాహవమునఁ
గూలునే ! దోసములుకట్టి కుడుపకున్నె ?

ధృత— తండ్రీ ! అర్జున !

గీ. కొడుక ! మీరేల నిందించుకొనెదరోయి ?
దోషమిది యెల్లనాదు పుత్రులది నాది
దాయభాగమ్ము హాయిరింపఁదలఁపకున్న
నింత పుట్టునె ? యిట్లొనె శాంతనవుఁడు !

ధర్మ— తండ్రీ ! ఆంబికేయ !

ఉ. నీకొడు కేమిసేయు ? నవినీతుఁడనై చని యేను "తాత ! నీ
పోక కుపాయముం దెలిపి భూమికి నన్ బతిఁజేయు" మంటి "నీ
దౌ కడిమిన్ సహింపఁ గలమా ? దయ యుంచు" మటంటి; దానఁ గా
దే ! కులవృద్ధు నిట్లు బలి యిచ్చితి రాజ్యరమన్ గ్రహించితిన్.

(భీష్ము నుద్దేశించి) తాతా ! ధార్మికాగ్రేసర !

గీ. తొడల నిడికొని కడుముద్దు దొడర నెత్తి
పెంచితివి పెద్దఁజేసితి వంచితముగ;

పాపజాతికిఁ బాల్పోయుపగిది యయ్యెఁ;
నెన్ని జన్మములకును నాకిదియ చాలు.

భీష్మ— తండ్రీ! ధర్మనందన!

ఉ. ఏల విచార మందెద? వహీనులు మీ రొక రుండఁ బట్టియే
యాలములోన నాకు మృతి యబ్బె; నిదే కద క్షత్రజాతికిన్
బోలెడిచావు! యుద్ధమున ముద్దిడుకొందురె యెవ్వరేని? దు
ష్కీలురకున్ సహాయములు చేసెడివార లదండ్యు లౌదురే?

క. నాకేమి పెద్దవాఁడను
జీఁకు కుమారుండు వీని చేతులలో నా
పోక యుచితంబ కాదొకొ?
శోకించుట తగునె జ్ఞానశూరుఁడ వయ్యున్?

కృష్ణ— (కన్నీటితో) తాతా! స్వాయత్తజీవన!

ఉ. చక్రము కేలఁ గైకొని విశాంపతు లంద "ఛీఛీ! యసీ! యసీ
యక్రమ" మంచు దూఱ, రయ మారఁగ బాహులు వట్టి వెన్కకీ
శక్రసుతుండు లాగ, నినుఁ జంపు తలంపున వచ్చునట్టి యీ
వక్రచరిత్రు తప్పిదము వాపి క్షమించి యనుగ్రహింపవే.

భీష్మ— (చిఱునవ్వుతోఁగూడిన భక్తితో) కృష్ణా! లీలామానుష విగ్రహ!

క. ఎందుకుఁ గనుగప్పెదు? గో
విందుఁడ వని మొదలనుండి విని యుంటి న్నీ
చందం బెఱుఁగుదు స్వామీ!
వందనములు నీ కొనర్తు వందలు వేలున్.

కృష్ణ— పితామహా! కురుకులాలంకార! నేను గోవిందుఁడనైన నగుదుం
గాక దానికేమి?

మ. అవనీచక్రము నెల్ల గెల్చితివి లోకారాధ్యుఁడైనట్టి వి
ష్ణ్వవతారుణ్ భృగుపుత్రు మించితివి వీ వాజన్మమున్ బ్రహ్మచా
రివి స్వాయత్తుఁడ వాత్మశుద్ధుఁడవు వారింప న్నినున్ శక్యమే?
యవివేకమ్మున నట్లొనర్చితిని తాతా! తప్పు సైరింపవే.

భీష్మ— కృష్ణా ! పాపారణ్యకృష్ణవర్త్మ ! నాజన్మమునకెల్ల నేనొనర్చినవే యీ రెండు తప్పులు. ఒకటి గురునితో నెదుర్కొనుటయు, రెండు నీ కెదురుగా నుండి యనిసల్పుటయు; భార్గవు నోర్చుట కేవలము నాశక్తి చేతనే యన వలను పడదు.

క. గురు వగుట వృద్ధుఁ డగుటన్
గరుణాంతఃకరుణుఁ డగుటఁ గలనన్నే న
ప్పరమాత్ము నోర్వఁగల్గితిఁ
దురిత మ్మొడిగట్టి కొంటి దుర్మతి వైతిన్.

ఇంతకు నప్పటి కయ్యనఘునియందు విష్ణ్వంశము లేకపోవుట ముఖ్య కారణము.

అర్జు— తాతా ! ధానుష్కైకశరణ్య ! ఇయ్యెడ నీ తప్పేమున్నది ?

ఉ. ఆయన కాయనై రణమునందలి కోర్కె నినున్ వరించె; లే
దే యిట దోష మించుకయు; నే మొనరించితి మెట్టికూళలున్
జేయఁగ రానికృత్యము ! లజేయ నినున్, గురునిన్ భవత్సమున్
మాయమెయిన్ వధించితి మమాయికులన్ గరుణాంతరంగులన్.

భీష్మ— నాయనా ! ఇంద్రినందన !

ఆ. వె. నరుఁడ వీ వితండు నారాయణుండు మీ
చరిత మెఱుఁగనట్టి జడుఁడఁ గాను
మీర లుండి రనెడి కారణమ్మున నె యు
ద్ధమున నేను సమ్మతమ్ము గంటి.

(సంతోషముతో)

గీ. మరణకాలమ్మునం దొక్కపరి నొడివిన
నెవని నామంబు మోక్షమ్ము నిచ్చుతీరు
నట్టి విష్ణుండు నాదు ప్రియాణసమయ
మునకు దయచేసె నాపుణ్యమునన కాదె.

భీము— (కన్నీటితో) తాతా ! త్రిలోకవంద్య !

శా. ఆయాసమ్ముగ నుండఁ బోలు నిఁక మాటాడంగ లే వేమొ నీ
దాయాదాపకృతుల్ క్షమించి కరుణన్ దైవార నీక్షించి యి
మ్మా యాశీర్వచనంబు! పాదములు తెమ్మా యొత్తెదన్ మ్రొక్కెదన్
గాయంబుల్ నిలువెల్లఁ గల్గియును శక్యంబే యిటుల్ నిల్వఁగన్ ?

భీష్మ— తండ్రీ ! వాయునందన !

చ. జనక వరప్రసాదమున సాయకబాధ యొకింత లేదు; నీ
మన మతి నిర్మలం బెపుడు మాయ నెఱుంగవు వెట్టికోపమున్
గనుటయ కాని, యంతటనె కారుణికత్వముఁ దాల్తు; సేవ చే
సిన సుకృతమ్ము గైకొనుము చెందె మనమ్ము ఘనప్రమోదమున్.

(కృష్ణునుద్దేశించి) కృష్ణా ! పరలోకబాంధవ !

చ. మృదు వగు వెన్న వంటిది శరీరము నీయది, యెట్టి కష్ట మ
న్నది సయిపంగ నేరదు పదాఱుసహస్రము లిందుకై సదా
మది జపియింత్రు గోపికలు, మాధవ ! నిష్కరుణుండనైన నా
ప్రదరము లిందు నాటి యపరాధ మొనర్చె ననుగ్రహింపవే.

ధృత— (కన్నీటితో) తండ్రీ ! నాగతి యేమి చెప్పితివి ?

గీ. కన్నులా లేవు, మదికి సౌఖ్యమ్ములేదు
కొడుకులా ? మన్మలా ? యెందుకోసమేను ?
నన్ను నీవెంటఁగొనిపొమ్మనాథమైన
ప్రేత మిందున్న నందున్న నేమిఫలము ?

భీష్మ— నాయనా ! ఆంబికేయ !

ఉ. ఏల యధైర్యముం గనెద వేగురు పుత్త్రిలు గల్గి యుండియున్
బేలవె ? కూళలౌ సుతులు పెక్కురు గల్గిన నేమి, యొక్కఁడే
చాలుగదా సుశీలుఁడు ! విశాలనయుల్ మఱి వీర లందఱున్
జాలిఁ బడంగ నిత్తురె ! విచారము నొంవకుమయ్య పుత్రకా !

విదు— (కన్నీటితో)

క. ఏ సందియమ్ము గల్గిన
నా సందియ మంతలోన నడఁగించు నుప

న్యాసకు నిన్నుం దండ్రిని
బాసి యెటుల్ ప్రాణములను బాయక నిలుతున్-

భీష్మ— విదురా ! జ్ఞానవిదుర !

తే. కృష్ణునికి నీవనిన దయ కేవలముగ
స్వయముగా బండితుఁడవీవు చతురమతివి
నేను జెప్పనక్కఱలేదుగాని యిమ్మ
హామహాఁభజింపు మిహాముఁను నబ్బుఁబరము.

కృష్ణ— తాతా ! దేవవ్రత !

క. ధన్యుండ వీవు మును రా
జన్యులు పెక్కండ్రు గలరు జ్ఞానమున ధృతిన్
జన్యమ్మున నన్యమ్మున
మాన్యత నీవంటి మేటి మానిసు లేరీ ?

భీష్మ— కృష్ణా ! వసుదేవనందన !

గీ. ఆలుబిడ్డలు లేకున్న యట్టి నాకు
సమయమున కబ్బె నీదుదర్శన సుకృతము
సెలవుదయసేయుమయ్యా ! నీచే ననుజ్ఞ
గొంటినా పరమున నెందుఁగొదువలేదు.

అర్జు— (కన్నీటితో) తాతా ! సద్గుణవ్రాత !

క. గీతలలో హరి సెప్పిన
యాతీరెల్ల భవదీయమగు మరణమునన్
జూతు నిటువంటి విజ్ఞా
నాతీతులు కోటి కొక్కరైనను గలరే !

భీష్మ— నాయనా ! హరినందన !

క. హరి యనఁగ నీవనఁగ నొం
డొరువులె ? యవతారపురుషు లొక్కొక కార్యాం
తరముల నిటు జన్మింతురు
నరనారాయణులు; వింటి నారదు కతనన్.

కృష్ణ— తాతా! భువనైకపవిత్రచరిత్రుండవగు నీ కెవరియాజ్ఞతో నేమి యవసరము.

ఆ. వె. ఈవు ధర్మపరుఁడ వెఱుగని దొక్కటి
లేదు నాయెడల మహాదరమ్ము
గలుగు కతన నిట్లుగాఁ బల్కితివి నీయ
భీష్టసిద్ధియగుఁ బ్రకృష్టహృదయ!

భీష్మ— (సంతోషముతో)

క. నీయాజ్ఞ వడసితిని నా
కేయేలోకముల నేని నిఁక లోపము రా
దో యదునందన! కృష్ణా!
ఓయెద దయయుంచు పురుషపుంగవ! నృహరీ!

(ధృతరాష్ట్రాదుల నుద్దేశించి) తండ్రీ, ధృతరాష్ట్రి! నాయనా, విదుర! కుమారా, ధర్మనందన! మీయందఱిచేత ననుజ్ఞాతుండనై పరసుఖమ్మున కేగుచుంటి. నాకై విచారింపకుఁడు.

కృష్ణ— తాతా! నేడు మాఘశుద్ధ ద్వాదశి. ఇట్టి పుణ్యదినమ్మున నీవు దేహత్యాగం బొనరించి పరమ్ము నలంకరించుచుంటివి. కాన నీదినము స్వతఃపవిత్రమైన దయ్యు మఱింత వన్నె కెక్కి నీపేరఁ బ్రసిద్ధి వడయుఁగాక! మఱియు,

గీ. విప్రులెల్లరు నీకుఁదృప్తిగను నేటి
దినము ప్రతివత్సరమ్ము నుదీర్ణచరితు
నిన్ను ధ్యానించి మిగుల మన్నించి తర్ప
ణముల నిత్తురుగాక పుణ్యమును గోరి.

భీష్మ— దేవా! నీయనుగ్రహమ్మున నాకొక్కటియుఁ గొదువలేదు. నేను యోగ మార్గమ్మునఁ బ్రాణమ్ములు విడువం దలంతుఁ గాన నా కించుక యావరణం బేర్పఱచి మీరందఱును గొందొకదవ్వున నిలుతురు గాక.

ధర్మ— ఎవరురా, అక్కడ! (తెరవైతురు)

కృష్ణ— (తెరసందునుండి చూచి ధర్మజునితో)

క. చూచితివె ? ధర్మజా ! స
త్యాచారుండైన యిమ్మహామహు యోగ
ప్రాచుర్య మ్మిటువలె నే
యాచార్యులు నేర రిది యథార్థము సుమ్మీ !

విదు— (అట్లనేచూచి) ఓహో ! యిది విచారకరమయ్యును నత్యాశ్చర్యం బగుచున్నది.

గీ. ప్రాణ ముడిగినపట్ల శల్యములులేవు
కలవె ? యిట్టివియును యోగగరిమ లెందు
(ఆకాశమువంకఁ జూచి)
అదిగో ! బ్రహ్మరంధ్రమునుండి యనుపమాన
మైన తేజం బొకం డేగు నంబరమున.

(అందఱును నాశ్చర్యపడుదురు. పుష్పవృష్టి కురియును)

కృష్ణ— (ఆశ్చర్యముతో)

ఉ. చావులులేవె ? యిట్టిక్రియఁ జచ్చినవారల నెందుఁ జూడ; మీ
పావను కారణమ్మునన భారతవంశము వన్నె కెక్కె ; జ
న్మావధిఁ జచ్చునంతకు రవంతయు లోటును లేనివారి నెం
దే వినియుంటిమే ? కనిరె యిట్టి విచిత్రము లెందు నెవ్వరున్ ?

ధర్మ— (కన్నీటితో) కృష్ణా ! ఆర్తత్రాణపరాయణ !

గీ. అక్కటా ! యెందఱో రణ మాచరించి
రందుఁబెక్కండ్రుగలరు బలాతిశయులు
కొడుకనియుఁ దాతయని చెప్పికొనుటగాదు
నిక్క మీయిర్వురకు సాటి నేనుగాన.

ధృత— అక్కటా ! యెంత మందభాగ్యుఁడను ? ఎన్ని దుఃఖములు భరించుచున్నాఁడను ?

గీ. కొడుకు లందఱు వోవుటకున్ సహించి
నట్టిమనమేమొ ? యిదిసవ్యమని యెఱిఁగియు

బొంగిపొరలు దుఃఖాంబుధి గ్రుంగుదువడు
దండ్రి నేటికి నన్నుఁ బెద్దగ నొనర్చె.

విదు— సచ్చరితుల్ల మరణమునకు జగమంతయు దుఃఖించును. ఇప్పట్ల బంధుత్వాదిక మనవసరము. (కన్నీటితో) తండ్రీ! గాంగేయ!

గీ. ఏను వృషలుండనయ్యు విజ్ఞానివైన
నీవు చేపట్టి పేర్మి మన్నించు కతనఁ
బ్రబలి రాజులచే నిమ్మపంద నైతిఁ
గలదె లేకున్న నాకిట్టి గౌరవంబు ?

(వ్యాసులు ప్రవేశించును)

వ్యాసు— గీ. బ్రతుకఁదగినంత కాలమ్ము బ్రతికి కులము
వన్నెకెక్కించి జగతికిఁదన్నుదెలిపి
యరిగె నాసోదరుం డమరాలయమునఁ
దన్నెదురు చూచువారి ముదమ్ము దీర్ప.

ధర్మ— (విచారముతో) తాతా! సాత్యవతేయ!

గీ. తండ్రిలేని పిల్లలమని దయఁదలంచి
తక్కు మనుమలకన్న నదనముగాంచి,
పెంచి విద్దెయు బుద్ధి చెప్పించినట్టి
తాత నిటు చేసినారము చేతులార.

వ్యాసు— తండ్రీ! ధర్మనందన!

గీ. ఎవ్వరోయొక్కరు నిమిత్తమింతెకాని
యితరుఁడితరుని జంపుటయే హుళక్కి
అందులో నీతఁ డనిన స్వచ్ఛందజీవి
యేల పరితాప మందె దోయీ కుమార!

చ. మరణ మలంఘ్య మేరికిఁ; గ్రమమ్మన వృద్ధుల పోక యందులోఁ
బరమశుభంబు దానికి లవమ్మును జింతిల రార్య; లిట్టి సో
దరుఁడు గతింప నేను బరితాపముఁజెందుట మానుచేని నీ
వరసి మనంబునం దుడుగుమయ్య విచార ముదారవర్తనా!

కృష్ణ— బావా! వారి యుపదేశమునందలి సారమును గ్రహించి దుఃఖ
ముడుగుము. అదే భాగీరథీతీరము. మన మందఱమును నిప్పట్ల
నప్పరమపావనియందు స్నానం బొనర్చి యిమ్మహామహుని కనం
తరకృత్యములు నెఱవేర్ప నుంకింపవలయు నటు చనుండు.

(పరిక్రమింతురు)

(గంగ ప్రవేశించును.)

గంగ— అయ్యో, అయ్యో! తండ్రీ! వ్యాసాదులతోపాటు చిరంజీవి
వగుదు వనుకొంటిఁ గాని యింతలో నిట్లగుట యెఱుఁగనైతినోయి!

క. ఎనమండ్రు కొడుకులకు నొ
క్కని కేనియు నోచనైతిఁ గాలస్థితికే
మని వగతు గొంతికొడు కే
మని నిన్నువధించె? నేడి యాతఁడు కొడుకా!

తే. జనన మందినదాది యీసరికి లెక్క
కొక్క తప్పేని లేని నిన్నోకుమార!
వంశవృద్ధనియేనిఁ గవ్వడి యెఱుంగఁ
డాయెనా? నాయనా! యేమిసేయనయ్య?

అర్జు— (తలవంచికొనును.)

కృష్ణ— (అర్జునునికడ్డముగాఁ దాను నిలిచి) అమ్మా, త్రిలోకపావని!

చ. ఎఱుఁగనిదానవేని యెవరేని వచించుట నీకుమారునిన్
నరుఁడు వధించె నన్న నెటు నమ్మితివమ్మ? తదగ్రమందు నీ
నరు లటులుండ రక్కసులు నాకనివాసులు నొక్కలెక్కయే!
దరమునఁ గాదె భృత్యుని విధమ్మున మృత్యువు నిల్చె దవ్వగన్!

వ్యాసు— అమ్మా, త్రిలోకజనని!

క. నరుఁడీతని వధియింపఁగ
హరశిష్యుండైన జామదగ్న్యునికన్నన్
శరవిద్య నధికుఁడే? యి
ప్పరముఁడు తనయంతవిడిచెఁ బ్రాణముల నొగిన్.

కృష్ణ— సర్వజ్ఞవగు నీ వెఱుఁగని దేమున్నది ?

తే. అతడు వసువులలో నొక్కడని యెఱుఁగవా ?
శాపవశమునబుట్టు నంశమ్మెఱుఁగవా ?
తండ్రియిచ్చిన వరము విధమ్మెఱుఁగవా ?
సకలమెఱిఁగి శోకించుట చనునె నీకు ?

గంగ— (కోపముతో) కృష్ణా ! కురుకులమారక !

తే. అంతయును నిక్కమేయగు; నైననేమి
కడుపు దరికొనిమండు నెక్కరణిపైతు ?
నాయుసురు మిన్నకయపోదు నరునిశిరము
కొలదికాలమ్మునన త్రెళ్ళఁగలదుధ్రువము.

ధృత— (విదురునితో జనాంతికము) ఆఁడుదియైనను నీమె మంచి శాస్త్తి చేసినది. నూఱుగురు కొడుకులను జంపినను నూరకొనుటకు గ్రుడ్డి ధృతరాష్ట్రుఁడు గాడు. కాని యీ శిక్ష భీమునకుజరిగినచో నాకడుపు మంట గొంతచల్లారును. ఎట్లయిన నాఁడువాండ్రలో నీమెయు, మగ వాండ్రలో నశ్వత్థామయు, వీర లిరువురే వీరల నధఃపాతాళ మడఁగఁ ద్రొక్కినవారు.

విదు— (జనాంతికము) అన్నయ్యా ! యేమి నీ యవివేకము ? మొదల నుండియు నీకీ యవివేకమే యింతతెచ్చినది. ఎప్పుడును ధర్మము జయించును; అధర్మ మడుగంటును. ఇంతకు గంగ శపించె ననికదా నీవు సంతసించుట ! ఆపెయు నిప్పట్ల నీవలెనే యవివేకురాలు.

తే. ఎవనిపాదమ్మునను జనియించు కతనఁ
దనకు నింతటి ఘనత పావనత గలిగె
నతడు శ్రీకృష్ణుఁ డితనికి నర్జునునకు
జచ్చినను జత్తు మన్నంత సఖ్య మమరు.

ధృత— (జనాంతికముగాఁ బశ్చాత్తాపముతో)అవును. నీవన్నమాటనిక్కమే.

క. సుతులునశించిన కతమున
మతిచెడి యిట్లంటిగాని మహనీయులు పాం

డు తనయు లందును గృష్ణుని
చతురత వారలకుఁ బెద్దసాయ మ్మనఘా.

విదు– (జనాంతికము) అదుగో! కృష్ణుఁ డేమో చెప్పుచున్నాడు. అది వినుము. మనమిప్పు డిట్లు గుసగుసలాడుకొనుచుండుట యంత భావ్యముగానుండదు.

కృష్ణ– దేవీ, విష్ణుపాదోద్భవి!

గీ. ఎన్నఁడును లేని కోపమ్ము నిట్టులూనఁ
దగునె? మనుమఁడు ధర్మతత్పరుఁడు సుగుణి
వినయవంతుండు మిగుల వివేకి నీకు
భక్తుఁ డీతని కిట్టిశాపమ్మె? యకట!

వ్యాసు– (అర్జునునిచే మ్రొక్కించి)

క. మునిమనుమనిపైఁ గించి
త్తనుగ్రహము సూపుమమ్మ! యాతనియాజ్ఞం
గొనియే యేసె నితం డో
జననీ! శాపాంతమును బ్రసాదింపఁ దగున్.

గంగ– (శాంతముగా) కృష్ణా! కృష్ణద్వైపాయన!

క. ఇతఁ డుత్తముండె యగు నే
నితని శపించుటకు హేతు వీ రెఱిగినదే
మృతిగని యొకింతలోపల
బ్రతుకున్ దద్విధము చెప్ప వలనుపడదిటన్.

వ్యాసు– (తనలో) ఓహో, ఇదియా హేతువు! అన్నా! వసువు లెంత పట్టు పట్టినారు!

తే. అయిన నేమాయె దానికి నహికులావ
తంసమైన యులూపి ప్రశంసనీయ
మైన పనిజేసె వసువుల నాశ్రయించి
నరకమునకన్ననిదియె యెంతయుహితంబు.

కృష్ణ– (తనలో)

తే. బభ్రువాహను కతమున బవరమున శి
రంబు దెగు సీతనికి, దన రమణి నాగ
కన్య బ్రతికించు, గాంగేయు గలనఁగపట
వృత్తిఁజంపిన దొసఁగున కిదియెశాంతి.

ధృత— (విదురునితో జనాంతికముగా) తమ్ముఁడా! భాగీరథి యేమో కొంత దాఁచిపెట్టినది, యది నీవు గుఱుతింపఁగలవా? భావికార్యవేత్తవుగదా?

విదు— (ధ్యానము నటించి) ఆ! తెలిసినది కాని యది దేవరహస్యము. బయలుసేయ వలనుపడదు. ఇట్లు జరుగును. (చెవిలోఁ జెప్పును)

ధృత— (తనలో)

గీ. తీర్థయాత్రను భార్యగాఁదీసికొన్న
యందులకుఁదగ్గ యుపకృతి నాచరించి
తే, యులూపి! మ దాత్మజుఁడిట్టికాంత
నొక్కతెను గట్టికొన్నవాఁడొకఁడులేఁడు.

ఈ రహస్యము వెలిబుచ్చినచో "బభ్రువాహనునితో నర్జునునకు సంగరమే లేకపోవు" నని కాఁబోలును దేవధుని గప్పిపుచ్చినది. (తల పంకించి) పోనీ దీని నేను బయలుచేయుదునా? (పెదవివిఱిచి) అయిన నేమగును?

క. తాత నిటు చంపినందుల
కీతని కొక కొంత నరక మేర్పడు దానఁ
నాతనపి తీరునే? యిటు
లేతన్మాత్రమ్ము నరక మేరికి లేదే.

ఇంతకు విదియేని భీమునికైనం గదా, యేను సంతసింపవలసినది. విదురుఁడు చెప్పిన ట్లదియును సమంజసము గాదు.

గీ. కన్నకొడుకులకన్న మిక్కటపుఁబేర్మి
నన్ను మన్నించుచున్న పాండవులయెడల
దొసఁగు దలఁచుటకన్నను దోసమున్నె?
తిన్నయింటి వాసమ్ముల నెన్నదగునె?

నాకింతటినుండియేని భగవంతుఁడు మంచి బుద్ధినిఁ బ్రసాదించుఁగాక.

ధర్మ— (తనలో) ఏదో యొక గొప్ప యిక్కట్టును దప్పించుటకై యీమె యిట్లు శపించియుండును. ఇంతకన్న గొప్ప కష్ట మేముండునో ! (యోజించి) ఉండకేమి. నరక మన్నిటికన్నను దురంత మైనది కదా ! (ప్రకాశము) దేవీ ! శాపాంతము ననుగ్రహించి నా తమ్ముని మరల నా కిచ్చితివి.

ఉ. నీకొమరుండు వోవుటకు నేను బ్రధాననిమిత్త మిట్టి దు
ర్ధీకుని నన్నుఁ బోవిడిచి దీనుఁడు తమ్ముని కల్గ నేల ? నా
కీకతనన్ మహానరక మెల్లొదఁగూడదొ ? చెప్పు మమ్మ ; నీ
వేకద ! యెట్టి పాతకుల నేనిఁ బవిత్రులఁ జేతు వెమ్మెయిన్.

గంగ— (శాంతముగ) తండ్రీ ! నీ కన్నిటికిని గృష్ణుఁడే కలఁడు.

గీ. అశ్వమేధమ్ము నొనరింపు మఖిలదోష
ములు నశించు నక్కతమునఁ బుణ్యలోక
మునకుఁబోనేర్తువీవు, తమ్ములకు నెట్టు
లేని నరకమ్ము దప్పనిదే నిజంబు.

ధర్మ— (విచారముతో) తల్లీ ! నాతమ్ములు లేని స్వర్గమునకన్న నాకును నరకమే యనుగ్రహింపుము.

గంగ— కుమారా ! యేది యనుగ్రహించుటకేని యొకరి వశమా ? వారి వారి సుకృత దుష్కృతములంబట్టి యుండును. నీకు నరకమ్ము దర్శన మాత్రమ్మునం దీఱు. నీ తమ్ములకును ద్రోవదికిని బుత్రులకును దక్కంగల్గు వారలకును యత్కించి దనుభవంబునం గాని తీఱదు. పదపడి యందఱికిని బుణ్యలోకమ్ము గల్గు. వత్సా ! యొకపరి కొమరునిఁ గడసారి చూచుటకునై మనము తత్తఱపడుచున్నది. నా కచటికిఁ ద్రోవఁజూపుము.

ధృత— (సమీపించి) తల్లీ ! నే నెప్పటికిని నిట్టు లుండవలసిన వాఁడనే కద ! నాకు విముక్తి ననుగ్రహించి రక్షింపుము.

క. పోయినవారలు వోయిన
నీ యనఘుల యెదుట నైన నేఁ గాయంబున్

బాయుదునో! లే కిట్లన
రాయిక్రియన్ మోడుకరణిఁ గ్రాలుదునొక్కో!

గంగ— తండ్రీ! అది యెవరితరము, ఇది ఎవరితరము?

విదు— అమ్మా. త్రిపథగ?

గీ. ఏ నెవఁడనయ్యు భవదీయసూను దయను
గౌరవకుటుంబమందు నొక్కరుఁడనైతి
బతితపావని! నాకు సవ్యమగు మరణ
మిచ్చి కాపాడు మమ్మరో! యిదియచాలు.

గంగ— గీ. మీరలిరువురు గుంతి గాంధారి సంజ
యుండు గొండొకవని దపముండి పాండ
వులు గతింపక మున్న వోవుదురు; యాద
వులు నశించినపైఁబాండవులునశింత్రు.

మఱియు నొక్కవిశేషంబు. పాండవాగ్రజుండును నీవును ధర్మాంశ సంభవు లగుటంజేసి నీతేజమ్మమ్మహాత్మునియం దైక్యమ్మునొందఁగలదు.

(గంగ నిష్క్రమించును)

వ్యాసు— తండ్రీ! విదుర!

క. కొండొక కతమున మాండ
వ్యుం డాగ్రహమంది ధర్మ నొగి శపియించెన్
దండధరుఁడు వాసీపు
త్రుండై నాకతన నిట్లు దోచెను వత్సా.

కృష్ణు— మన మిఁక ని మ్మహాభాగునకు నుచితకృత్యములు నెఱవేర్ప భాగీరథికిం జని స్నానమ్ము లాచరింపవలయును. (అందఱును నిష్క్రమింతురు)

— గద్య —

ఇది శ్రీ....తిరుపతి వేంకటేశ్వర ప్రణీతంబగు
పాండవాశ్వమేధమ్మనఁ జతుర్థాంకము.

ఓం

శ్రీ మత్పరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము.

## పంచమాంకము

(అంత ధౌమ్యులు ప్రవేశించును)

ధౌమ్య— (సంతోషముతో) భగవదనుగ్రహమువలన నేఁటికి మా యజాత శత్రునకు మంచిదినములు వచ్చినవి.

చ. మృతుఁడగు నుత్తరాసుతుఁడు కృష్ణు దయన్ బ్రతికెన్; దుషార ప
ర్వతమున కేగి యయ్యెడల వ్యాసులు చెప్పినయట్టు లద్రిజా
పతిని యజించి యందుఁ గల పాతఱలన్ బెకలించి ద్రవ్యము
న్నతముగఁ దెచ్చె; యాగము నొనర్చుటయే కొదవింక మీదటన్.

ఓహో! ఇట్టి యాగ మెప్పుడును గన్నదియు విన్నదియుఁ గాదుగదా!

గీ. సవనపాత్రల లెక్కేమి? శాల గూడ
బంగరువుతోడ నిర్మింపఁబడియె; నిందుఁ
గొదవయేమి? మరుత్తిచ్చె గొల్లగాఁగ
ద్విజుల; కదియెల్ల వీరి యధీనమయ్యె.

అహహ! ఆ బ్రాహ్మణులు పట్టుకొని పోయినది పట్టుకొని పోఁగా మిగిలినదే యింత యున్నప్పు డంతయు నెంతయుండునో! ఇంతకు నిప్పటి సుకృత మా మరుద్భూపాలునిది. కాదు కాదు, ఋత్విక్కులది. సంశయ మేమి? ద్రవ్యస్వామికిఁ గదా తజ్జన్యసుకృతము చెందవలయును. (యోజించి) సుకృతము మా టట్టులుండ బ్రాహ్మణ ద్రవ్యాపహరణ దోషము తటస్థించు చున్నదే! ఐనను,

గీ. వారు పాతఅవై చెడి పట్టునందు
సమయము నొనర్చికొనిరఁట "జనుఁ డెవండు
దీని గనుఁగొను నిది వానిదే" యటంచు
గాన విప్రస్వహరణశంక యిట లేదు.

(పరికించి) అడుగో ! అశ్వోత్సర్జనము చేయించుటకై నాచే నంపఁబడిన నా ప్రియశిష్యుండు కాణ్వుండు వచ్చుచున్నాఁడు. ఇతనివలనఁ గొన్ని విశేషములు దెలియఁగలవు.

(అంతట శిష్యుఁడు ప్రవేశించును)

కాణ్వు— గురువరా ! నమస్కారము.

ధౌమ్యు— విద్యాభివృద్ధి ర్భూయాత్. చక్కఁగా నాయశ్వోత్సర్జనమును నెఱవేర్పింపఁ గలిగితివి కదా !

కాణ్వు— దేవర యాశీర్వచమున నెందును గొదువ రాలేదు.

ధౌమ్యు— అచ్చటి విశేషములఁ గ్రమముగాఁ జెప్పుదువుగాక.

కాణ్వు— చిత్తము. ప్రథమమున నేను ధర్మరాజుగారి యెదుటి కేగినతోడనే నమస్కరించి మీ కుశలం బడిగిరి.

ధౌమ్యు— ఆశీర్వచనము సమయానుగుణముగాఁ జేసితివా ?

కాణ్వు— చిత్తగింపుఁడు.

ఉ. పోయిన వంశమా నిలిచె; భూరి యశ మ్ముదయించె; యాగమా
చేయఁగ నుంటి; సర్వమును సిద్ధమ; సాధ్య మొకండు లేదు నీ
కోయవనీశ ! దీవనల నొందు టెఁకెందుకుఁ గాని, యైననున్
శ్రేయము తృప్తికిం దగదు, చేకొనుమయ్య మహోదయమ్ములన్.

ధౌమ్యు— (సంతోషముతో) ఇఁక నేమి ! నేను నీ వింతవాఁడవని యనుకోలేదు సుమీ ! తరువాత ?

కాణ్వు— దానిపై రాజుగారు "ఇపుడు కావింప నున్న యశ్వమేధము నిర్విఘ్నముగా నెఱవేరున ట్లాశీర్వదింపవలయు" ననిరి.

ధౌమ్యు— కార్యాసక్తిచే నాతఁడటు కోరెనే కాని, అందులకు మన యాశీర్వచన మెందుకు ?

క. ధనహీనుండయ్యును నొ
క్కని బాధింపకయె వ్యాసు కారుణ్యమునన్
ధనకనకవస్తువాహన
ఖని యయ్యెన్ యాగ మింకఁ గా కేమగునో!

ఇది యిట్లుంచుము.

గీ. నాలుగు సముద్రములఁ బోలజాలు ననుజు
లవుల గృష్ణుండు సర్వలోకావనుండు
సిద్ధసంకల్పుఁడాతండు సేయఁబూనె
నిందు విఘ్నములనుగూడ నెందు కబ్బు.

తరువాత ?

కాణ్వ— అశ్వమును వదలుచు వెనువెంబడి పోదలచిన యర్జునుతో నారాజ శేఖరుఁడు చెప్పిన మాటలు కడు నీతిదాయకములుగా నున్నవి.

ధౌమ్య— ఆతని నోట నెప్పు డేది యుచ్చరించినను నది యట్టిదే, ఐనను విందుము చెప్పుము.

కాణ్వ— మనవి చేయుచున్నాను. అజాతశత్రుఁడు తమ్మునింబిలిచి,

చ. తురగమువెంట నేగుము; చతుర్జలరాశిపరీతభూపురం
దరు లెవరున్ నిరోధము నొనర్ప; రొనర్చినచోఁ గృపారసం
బురలఁగ నప్పటప్పటికి నొప్పెడిరీతి నొనర్చు మాగ్రహ
స్ఫురణము చూపి వేగ పొరిపుచ్చకు మింతకె చచ్చి రెల్లరున్.

ధౌమ్య— చక్కగా నుపదేశించినాఁడు. దానిపైఁ బార్థుఁ డేమనియెను ?

కాణ్వ— ఇట్లు పలికెను. "అన్నా ! ధర్మనందన !

తే. ధర్మజునియశ్వ మన్న నేధరణిపతియు
నడ్డగింపఁడు సమరం బనవసరంబు.

ధౌమ్య— సంశయ మేమి ?

కాణ్వ— గీ. ఎదిరిఁ దన్ను నెఱుంగక యెవ్వఁడేని
యడ్డినను వాని యసువుల కాస గొనను"

ధౌమ్యు— ఇతఁడుమాత్ర మెవరు? ధర్మరాజు తమ్ముఁడు కాఁడా యేమి? తరువాత?

కాణ్వు— మరలఁ బాండవాగ్రిజుండు, ఆయారాజులతోఁ దనమాటలుగా నిట్లు విన్నవింపు మనియెను.

ధౌమ్యు— ఓహో! ఏమయా యీ వినయము! ఏమని చెప్పమనియెను?

కాణ్వు- ఉ. జ్ఞాతులఁ దక్కుభూపతులఁ జంపిన పాపము నిస్తరింప మే
మీ తఱి నశ్వమేధమున కిచ్చ యొనర్చుట; యంతెకాని ప్ర
ఖ్యాతికిఁ గాదు; మీరు త్వరగా సవనమ్మను జూడరండు, ద
ర్పాతిశయమ్ముచూపకుఁ; డహంకృతి కాలముకాదు భూపతుల్!

ధౌమ్యు— సరే, ఆయన చెప్పవలసినసంగతి కనుకఁ జెప్పినాఁడు. కాని నిజముగా నొక్కొక్క రాజెవఁడేని యెదురైనచో నంతమాత్రమునకు మరలఁడు.

కాణ్వు— అట్లు మరలనివారిం గుఱించి యిట్లు జరుపు మనెను.

ధౌమ్యు— ఎట్లు?

కాణ్వు—ఉ. సారథిఁ గొట్టియో, రథముఁ జక్కడగించియొ వాజులన్ వెసన్
బాఱఁగఁ దోలియో, ధను వపాస్తముఁ జేసియొ నారిఁద్రుంచియో
వారి కొకింత నీదు బలవైఖరి సూపుదు గాని, చావరా
దేరును, నట్టివార్త విని యే సయిరింపఁగఁజాలఁ దమ్ముఁడా!

ధౌమ్యు— ఆతని వచనము లెన్ని విన్నను దనివి తీరదు. తరువాత?

కాణ్వు— అశ్వముపెంట పార్థుఁ డరిగిన యనంతరమునఁ గౌంతేయాగ్రిజుండు నన్నుం జూచి,

తే. అన్నియును చెప్పియే నరు ననిపినాఁడఁ
గాని మది సందియం బధి మాన దకట
ఎక్కడేమగునో! యెవ్వరెదురుకొందు
రో యెవరిద్రుంచునో దయయుడిగియితఁడు.

ధౌమ్యు— సర్వమును శుభమేయగుగాక. రాజా! నీకీ సంశయ మెందుకు?

క. ఏడమూడి ననిపినచోఁ దుం
దుడు కేదియునేని యచటఁ దొడగిన దొదరున్
గడు శాంతుఁడు గవ్వడి యీ
తఁడు మఱచునె నీదునాజ్ఞ ? తత్తఱపడునే ?

కాణ్వ— నేనును ఇట్లే పలికితిని. తరువాత నా నృపాలుఁడు,

తే. ధర్మసంవేది విజ్ఞాని తండ్రివెనుక
తండ్రియంతటివాఁడు పెత్తండ్రి యమ్మ
హాత్మ్మకడ కేగి యాతని యాజ్ఞవడసి
యశ్వమేధమ్మునకుఁ గర్తనగుట మేలు.

అని నన్ను వీడ్కొని పితృదర్శనమునకుఁ జనియెను.

ధౌమ్య— ఇది ముఖ్యముగా నిట్లు జరుగఁదగినదే. నాతోడ నేమియుఁ జెప్పుమనలేదా ?

కాణ్వ— "ఋషుల నందఱిని సత్వరమునఁ బిలిచి రావలయు" నని తమతో మనవిఁ జేయు మనియెను.

ధౌమ్య— సరే. అర్జునుం డశ్వముపెంటఁ బుడమి నెల్ల గ్రుమ్మరి రాజపుత్రులం దోడ్కొని వచ్చునంతకు మనమీపని నెఱవేర్చుకొనలేక పోదుమా యేమి ? (యోజించి) యెందుకేనియు ముందుఁ దనకున్న పని నెఱవేర్చుకొనుట కడు మంచిది. కావున మనము ఋష్యానయనార్థ మరుగుదము రమ్ము. (నిష్క్రమింతురు)

(అంత ధనుర్ధరులై యిరువురు రాజపుత్రులు సూర్యవర్మకేతువర్మలు ప్రవేశింతురు)

సూర్య—ఉ. మూకలతోడఁ బోరి కడు ముష్కరకృత్యము సేయుచుంటి నా
రాక యెఱింగియున్ మరలి రావదియేమి ? మఖాశ్వ మేన చ
మ్మ్మ కదియంగఁ బట్టితిని ! మేటి మగండవ యేని నాపయిం
దాఁకి రణం బొనర్పుము పినాకి నెదుర్చుట నేఁడు చూచెదన్.

అర్జు— (తనలో) ఓహో ! యీ బాలురఁ జూచిన నామనంబు కరుణామయం బగుచున్నది. (ప్రకాశము) క్షత్రియకులాంకురములారా! నామాట విని మీరీ యశ్వము జోలికి రాకుఁడు.

గీ. అశ్వమేధదీక్షితుఁడయి యన్న మిమ్ము
పిలువ నంపింప వచ్చితిఁ బిలుపుఁగొనుఁడు;
బందుగులమైన మన కేల బవరమిచట ?
గదలి మీరెల్ల వత్తురుగాక యటకు.

కేతు— (గర్వముతో) మేము జన్యమునకు వచ్చువారమే కాని జన్నము నకు వచ్చువారము కాము.

ఉ. బందుగు లంచుఁ బల్కితివి, బందులు గారె సుయోధనాదు ? లే
చందమునన్ రణంబు కొనసాగెను మీ ? కది యెల్ల నేఁడు చూ
డం దలపోని వచ్చితిమి టక్కరి మాటలఁ బోవ దింకఁ; బో
రందగు గెల్వఁగాఁదగు దురంగమమున్ మరలింపఁగాఁదగున్.

అర్జు— మీతో నేనొక్కమాటఁ జెప్పెదను. దానివి మీరన్యథా గ్రహింపక విశ్వసించి ప్రాణత్రాణం బొనరించి కొనుఁడు.

క. "మన రణముననే పోయిరి
జనపాలకులెల్ల వారిసంతానములన్
మనము గరుణింపఁ గావలె"
నని ధర్మజుఁ డానతిచ్చె ననికిఁ జొరకుఁడీ.

సూర్య— (మీసము దువ్వుకొనుచు) ఏమీ ! మీయన్నగారిట్లు సెలవిచ్చినా రేమి ? ఓహో ! యేమి యాయన యోగ్యత !

గీ. ధర్మరాజను మాట మాత్రంబ కాని
యంతయు నధర్మమే యతఁడాచరించె ;
నతని తమ్ముని నిన్నిపు డని వధింప
బుద్ధివచ్చెడుఁ బాప మాభూమిపతికి.

అర్జు—(తనలో) ఓహో ! అధికప్రసంగములోనికి దిగుచున్నాఁడే ? అయి నను నింకొక సారి చెప్పి చూచెద (ప్రకాశము)

గీ. గాండివంబిది పీడల్ల పాండవుండు
అక్షయంపుఁ దూణీరము లరయుఁ డివిగొ

అదుగో! కపిరాజు కేతనమందుగనుఁడు
వినుఁడు నామాట యశ్వంబువిడిచి చనుఁడు.

కేతు— (గర్వముతో) అశ్వమ్ము విడిచి చనుట నీవా ? మేమా ?

చ. "ఇరువురు వీర లే నొకడనే" యని భీతిలఁ బోకుమయ్య ! యొ
క్కరు నొకమాఱు గైకొనుము గైకొను మొక్కరు నొక్కమాఱు; మున్
విరటుని యింట ఐంట వయి వీఁక ననేకులతోడఁ బోరి తం
చెఱఁగినయట్టు లోకు లను టింతయు నిట్టిది యయ్య! వాసవీ!

సూర్య— (క్రోధముతో)

గీ. గాండివం బని యాపయిఁ బాండవుఁడని
పేరు చెప్పినయంతనే భీతి పుట్టె
నొక్కొ! యిదియేమొ చూత మీ యుక్తులేల ?
దిగుము రణరంగమునకు, నే దిగితి నిదిగొ.

(నిష్క్రమించును)

అర్జు— (తనలో) ఓహో! వీనికిఁ గొంచెము చవిఁ జూపిన గాని బుద్ధి కలుగదు. అమ్మా! గాండివమ!

చ. కలన వధించి నీకు బలిగా నొనరించితిఁ బెక్కుమంది రా
జులఁ గడుఁ దృప్తిగంటి "వరిసూదన"మన్ యశమున్ వరించి తిం
కలుగఁగఁ బోకు మమ్మ! సమయ మ్మగునప్పు డజాతశత్రు వా
క్కులు స్మృతికెక్కఁజేసి యొకకొంత ననున్ వెనుదీయఁ జేయుమా.

(నిష్క్రమించును)

కేతు— (పరికించి) ఓహో! నా యన్నయే ముందు నారాచములు విడిచి నాఁడే! అరరే! అందులో నొకటి యర్జును శిరము దునుమవలసినదే కాని యొక్కింత తప్పిపోయినది. (విని) అర్జునుఁ డేమో యనుచున్నాఁడు.

(తెరలో) గీ. బాలకుఁడ వయ్యు మెచ్చంగవచ్చు నిన్ను
నాల మింతటితోనైనఁ జాలు నుడుగు
మేమి ప్రాణమ్ములన్న నీకింత బరువె ?
బ్రతుకఁజాలవె ? వలవని కుతుకమేల ?

కేతు— అన్న దీని కేమి యుత్తర మిచ్చునో ?

(తెరలో) గీ. బాలకుఁడ నంచు నన్నేల గేలిచేసె ?
దాహవమునకు వృద్ధులకన్న బాలు
రే తగినవారు నీవిది యెఱుఁగవొక్కొ ?
బాలకుఁడుగాఁడె యల్ల సుభద్రకొడుకు ?

కేతు— తగిన యుత్తరమునే చెప్పినాఁడు కాని యుపమానము మాత్ర మంత జయసూచకముగా లేదు. మరల నర్జునుఁ డేమో యనుచున్నాఁడు.

(తెరలో) క. అల సౌభద్రేయుని నీ
తలఁపున నెఱిఁగియును నన్నుఁ దాకుట మేలే ?
కులము నిలుప నుంకింపుము
చల ముడుగుము యజనమునకుఁ జనుదె మ్మనఘా.

కేతు— అక్కటా ! యింత శాంతిగల మహాత్ముఁడు మును రణ మెట్లొనరించెనో ? (విని) అన్న మరల నేమో యనుచున్నాఁడు.

(తెరలో) గీ. యజన మటు లుంచు మిప్పుడీ యాజి చూడు
మవులఁ దక్కిన కార్యమ్ము లరయవచ్చు
రాచపుట్టువుఁ బుట్టి నారాచముననె
కాక యుత్తర మిత్తురే వాకు నొడివి ?

కేతు— (విని) అతఁడును నారి సారించుచున్నాఁడు. బలే ! ఇప్పట్ల నన్న యెన్నదగిన పనిఁజేసినాఁడు. ఒక శరమైనను దనకుగాని సారథికిగాని రథమునకు గాని తగులకుండఁగనే వారించినాఁడు. ఇఁక నిప్పు డర్జునుఁ డేమి చేయునో ? అదుగో ధనుస్సునకు గుఱిచూచుచున్నాఁడు. (తత్తఱపాటుతో) అప్పుడే విఱిగినదే ధనుస్సు. బలే ! చచ్చినం జచ్చుగాక. యితనితో యుద్ధ మొనర్చినదే జన్మము. అన్న మఱియొక ధనువు గైకొని యమ్ముల విడుచుచున్నాఁడు.

(అంత నితని తమ్ముఁడింకొకడు ధృతవర్మ యనువాఁడు ప్రవేశించును)

కేతు— (చూచి) తమ్ముఁడా ! నీవు గూడ నెందుకు వచ్చితివోయి ? ఇతనికి మేము చాల మనియా ?

ధృత— క. నరుఁడాకి సమర మొనరుప
గర మనురాగమ్ము గలదు గాన వనున్ స
త్వరమునఁబంపుము రాచకొ
మరులకుఁ బందువులుగా సమరకృత్యంబుల్ !

కేతు— అటు చూడుము.

గీ. అన్న వైచిన బాణమ్ము లన్ని ద్రుంచి
యన్నరుం డొక్క యమ్మున నన్ను గొట్టె

అక్కటా, అయ్యో !

పొమ్మసిల్లె నతండు(ధైర్యము దెచ్చికొని) ఏ రణ మ్మొనర్చి
బదులు తీర్చెద నిదె పోయి పార్థునడచి. (నిష్క్రమించును)

ధృత— ఓహో ! ఏమి ? యీ యుద్ధచమత్కారము !

చ. ఒకరు విగిడ్చు బాణముల నొండొక రంతరమందుఁ ద్రుంచుచున్
ప్రకటనఁ జేయఁ బూనిరి స్వబాహుపరాక్రమముల్ ; క్రమమ్ముగా
సుకరము గాక యుద్ధ మిది సూడ భరమ్ముగఁ దోఁచె; నన్న యిం
తకుఁ బయిచేయి యయ్యె నికఁ దప్పనిదే జయ మంచు నెంచెదన్.

పార్థుఁడు శరములు విడుచుట గట్టిపెట్టి యేమో యనుచున్నాఁడు.

(తెరలో)ఆ.వె. అన్నపాటుజూచి తాతఁడిప్పటికిని
మూర్ఛదెలియఁడయ్యె ముగ్ధమతివి
గాకు, మింకనైనఁ గొంతేయుజన్నమ్మ
చూడరమ్మ బవరమేడ ! పొమ్ము.

ధృత— అన్న తగిన యుత్తరముమ జెప్పకపోఁడు.

(తెరలో) జన్నమా ? చూచెడిది బన్నమా ?

గీ. బవరము నొనర్చుపట్ల నెవ్వరికినేని
మూర్ఛవచ్చుటయంత తప్పుగ గణింప
రంతమాత్రాన జయమందినట్టు లాత్మ
సంతసించుట మాత్ర మొకింత తప్పు.

ధృత— పార్థుఁడు మరల నేమో యనుచున్నాఁడు.

(తెరలో) తే. తాతదండ్రులు నాటి యుద్ధమునఁ జిచ్చి
రనెడి పౌరుషమును మానుమయ్య! వారి
కన్న నధికుండ వెందును గావు నీవు
ఇంతకును దగ్గ కారణ మేని లేదు.

ధృత— (చూచి) అన్న యాతనిమాట వినిపించుకొనకయే శరపరంపరలు నిగుడ్చుచున్నాఁడు. అడుగో! అతడును మొదలు పెట్టినాఁడు. (సంతోషముతో)

గీ. అన్నబాణమ్ము ఫాలమ్మునందుదాకి
పార్థు డొక్కింత కనలి విస్ఫారఘోర
శరమొకంటను నరదమ్ముఁ జక్కడంచె
సారథిని నొంచె వేఱొక్క శరము నించి.

అదిగో! అన్న యనేకబాణమ్ముల నొక్కుమ్మడిగాఁ బ్రయోగించి యతని జీకాకు పఱచుచున్నాఁడు. అయ్యో, పాపము! అర్జునుని ధనుస్సు చేతినుండి జాఱి క్రిందఁ బడినది. ఇతఁడు మునుపటి యర్జునుఁడు కానట్లు తోచుచున్నాఁడు. ఇదే మనకు జయము రాఁదగిన సమయము గానున్నది. పార్థుఁడు మరల ధనువుఁగొని రథముపైకి జనుచున్నాఁడు. (ప్రక్కగా దృష్టి నిగుడ్చి) అదిగో! సమయమునకు మన యమాత్యుఁడు గూడ వచ్చుచున్నాడు. (మంత్రి ప్రవేశించును.)

మంత్రి—కుమారా! తుదకుయుద్ధమేస్థిరమైనదేమి? సంధికుదురలేదా! ఆయన తనంతఁ దాను సంధికి వచ్చినపుడు మనమెందుల కొప్పఁగూడదు?

ధృత— ఆ.వె. చనునె? చంకదుడ్డు శరణార్థితోసంధి
యన్న యాజ్ఞయంట! యాగమంట!
కరుణ నిట్టులంట గానియుద్ధమునకు
జంకదంట! యెట్లు సంధిపొసఁగు?

మంత్రి— (చూచి) కుమారా! అటు చూడుము. పీయన్న రథముపై మూర్ఛిల్లి యొరగుచున్నాఁడు.

ధృత— (తత్తఱముతో) ఇదె నేను వచ్చుచున్నాను. విలువుము. విలువుము. (పోఁబోవును)

మంత్రి-(చేయిపట్టుకొని)అరుగవచ్చునుగాని నామాటమాత్ర మొకటివినుము.

ఉ. కిరీడి యనంగ లోకముల కేవల మొక్కట నెత్తివచ్చినన్
బాడి యొకింత తప్పకయ భస్మ మొనర్పగఁజాలువాఁడు మీ
రోడుట తప్పుగా దతని. కున్నతియే పయిపెచ్చు. నిల్చి పో
రాడితి రింతవట్టు, చనదా యికనైనను సంధిసేయుటల్ !

ధృత— నీ మాటలు నాకిప్పుడు చెవి కెక్కవు. (నిష్క్రమించును)

మంత్రి— (విని) పాపము ! అర్జునుఁడు నావలెనే బోధించుచున్నాఁడే !

(తెరలో) గీ. రాచపుట్టువు పుట్టిన రాణ కింత
వట్టు పోరాడితిరి మెచ్చవచ్చు మిమ్ము
నందులో నీదు సాహస మద్భుతంబు
చిన్నతనమయ్యు ననికి వచ్చితివి కదగి.

నీవు మీ త్రిగర్తకులమునకు వన్నెదెచ్చితివి. సంతసించితిని. మీ యన్నల
సేదదేర్చి యింకనైన బవరం బుడుగుము.

మంత్రి— (చూచి) ఆమాటలు వినిపించుకొనకయే ప్రావృడ్జలధరమ్ము
పగిది శరము లుఱుముచు నిగుడ్చుచున్నాఁడు. పాపము ! అర్జునుఁ
డెంత కరుణాశాలియో గాని యాబాణములు వారించుకొనుటయే తప్ప
నొకశరముననేని యితనిం గొట్టకున్నాఁడు. కాని రథమును మాత్రము
నుఱుము సేసినాఁడు. అక్కటా ! ఇప్పుడైనను జాలించినబాగుండునుగదా!

క. అడిదముబలకయు గొని బిగు
వెడలక యయ్యనఘుమీద నితఁ డేగఁగ గ
వ్వడి చిఱునగ వడరఁగఁజే
యొడిసి తటాలునను బట్టియును దెగఁడు కటా !

ఇక్కడికే తీసికొని వచ్చుచున్నాడు. (ఇరువురును బ్రవేశింతురు)

మంత్రి— (వినయముతో) ఆర్యా ! నమస్కారము. ఈశిశువును మీరు
బ్రతికించితిరి.

అర్జు— (నవ్వుచు) ఏమోయి ; త్రిగర్తవంశాభరణమా ! ఇంక నేని యశ్వ
మునువదలి తప్పక నీయన్నలతోఁగూడ మాయన్నగారి జన్నమునకు
వచ్చెదవు కదా !

ధృత— (సిగ్గుతోఁ దలయూఁపుచున్నాఁడు)

అర్జు— మీ రిరువురును బోయి మూర్ఛ మునిఁగియున్న రాకొమరుల నేదదీర్పుఁడు.

(మంత్రియును ధృతవర్మయును నిష్క్రమింతురు)

అర్జు— (పరికించి) అదిగో! అశ్వమప్పుడే ముందువోవుచున్నది. నేనుఁ గూడఁ బోవలయును. ఇఁక ముందుఁ బ్రాగ్జ్యోతిషపురమ్ము సమీపించఁ గలదు. అయ్యెడ భగదత్తునిపుత్త్రుఁడగు వజ్రదత్తుండు తండ్రివలని వైరమ్మున నడ్డురావచ్చును. (పరిక్రమించును, వజ్రదత్తుఁడుప్రవేశించును)

వజ్ర— (సంరంభముతో)

గీ. అడ్డగింపుఁడు గుఱ్ఱమల్లదిగొ! పోవు
చున్నయది కట్టిపెట్టుఁడే నుక్కడంతు
వాసవుఁడు వచ్చెనేని, యవ్వాసవాత్మ
జుండు లెక్కయె సందియమొండు వలదు.

అర్జు—రాజపుత్త్రా! నీకు శౌర్యమనాదిసిద్ధమే కాని నామాట యొకటివినుము.

క. "ఇదివఱకె రాజులెల్లరు
చదిసిరి యెవ్వారినేనిఁ జంపవలదు పి
ల్వఁ దగున్ జన్నమ్మున" కం
చు దయామతి యన్న సెప్పెఁజూ నా కనఘా!

వజ్ర—(గర్వముతో)మీయన్న నీకట్లానతిచ్చినదినిజమేయైయుండును. కాని,

ఉ. ఏనయి రాఁగ నుంటి మిము నెల్లర నెక్కటి పోరఁ ద్రుంప, నీ
వే ననుఁ జేర వచ్చితివి; వెఱ్ఱినె, నిన్నిఁకఁ బోవనిత్తునే?
మానము గల్గి నిల్వు; మును మా జనకుం డతి వృద్ధుఁ డౌటచేఁ
బ్రాణము గోలుపోయె; బదు లప్పటి కిప్పుడు తీర్చి పుచ్చెదన్.

అర్జు— (తనలో) కౌంతవఱకు రణము నడిచినపిమ్మటఁగాని మన సామ వచనము లితని కెక్కవు. అందులో నితఁడు సామాన్యుఁడా! నరకాసురుని మనుమఁడు. (ప్రకాశము)

తే. అనికి రమ్మంటి వచ్చెద నంతెకాని
నిన్ను జంపుట కాజ్ఞ మా యన్న యిడఁడు
ఎందుకిట్టివృథారణ మెవరుమెత్తు ?
రశ్వమునువీడి యరుగుమా యవులకనఘ !

వజ్ర— (గర్వముతో)

తే. గీ. వట్టిమాటలఁ బోయెడివాఁడుగాఁడు
వజ్రిదత్తుండు నిన్నుఁ జావఁగ నడంచుఁ
దోడు లేకుండ వచ్చితి తోయజాక్ష
బిలువనంపుమ ! యిరువురఁబిలుకుమార్తు.

అర్జు— (పరిహాసముగా) తోయజాక్ష నెదిర్చిన సీతాతగారి గతి నీ వెఱిఁగినదేకదా ? వృథా గర్వాలాపము లెందుకు ? నామాట వినుము.

వజ్ర— మొట్ట మొదటఁ గేవలము గర్వాలాపములుగఁదోచినను ననుభవ కాలమ్మున నిక్కపు విలాపములుగాఁ గనుపట్టునులే ! రణరంగమున కవతరింపుము.

అర్జు— (తనలో) ఓహో ! వీనికిఁ బట్టుదల గట్టిగానున్నదే. కానిమ్ము. క్రమముగాఁ దగ్గక పోవునా ? (ఆకాశమువంకఁ జూచి) ఓ యంబర చరులార !

చ. కనుఁగొనుఁడయ్య మీ రిపుడు గాండివిసేత కృపారసమ్ముమై
వినిచెడు పల్కులన్నియును వీటికిఁ బుచ్చి యితండు దానయై
చెనకుచు నున్నవాఁ డొకటఁజే యెటు జాఱునొ ? యేమి యౌనొ ? యె
వ్వనికిని హాని నాకతన వాటిలకుండెడిగాక మీకృపన్.

(ఇరువురు నిష్క్రమింతురు)

(గంధర్వుఁడు ప్రవేశించును)

గంధ— (తనలో) భారత యుద్ధానంతరమున నేటికి మరలఁ దగినవానితో నర్జునుని యుద్ధము జూచుట తటస్థించినది. (చూచి) అదుగో, వజ్రిదత్తుఁ డైరావతము ననుకరించు నేనుఁగుపై నుండి యమ్ములు విడుచుచున్నాడు. అర్జునుఁడు వాని నెల్ల నవలీలగాఁ ద్రుంచుచున్నాడు.

(పెదవి విఱిచి) ఇతని సంరంభమే కాని యతని సంరంభము లేశ మును గానరాదు. కాకున్నఁ బార్థునికిది యొక లక్ష్యమా? అరరే! యేనుఁగు పీనుఁగైనదే! (పరిశీలించి)

క. గద కేలఁ బూని కడు దు
ర్మదమున భగదత్త సుతుఁడు మండలగతులన్
బొదలుచు వైశమ నరుని య
రదమ్ముపయికి దుముకు నదిగో రభస మ్మడరన్.

ఓహో! గాండీవి గదగూడఁ జూర్ణము జేసినాడు. పాపము! వజ్ర దత్తుఁడు నిరాయుధుఁడై యతఁ డింతకు మున్న విడిచిన యంపగముల వారించునుపాయము లేక కాఁబోలును, వెనుకకు జరుగుచున్నాడు. (సంతోషముతో) సెబాసురా! రాచకొడుకా!

క. వెన్నిచ్చినచోఁ దప్పిద
మన్న భయమ్మునఁ బిఱింది కటు చనుచును నీ
వ న్నరు మొగంబుపై దృ
ష్టి న్నిగుడుచుచుంటి నీదుచేవ యలతియే.

ఆహా! కరుణాశాలి యగు నర్జునుఁడు శరప్రియోగమ్ము చాలించి యితని వెనువెంట వచ్చుచున్నాడు.

(ఇరువురును యథోక్తముగాఁ బ్రవేశింతురు.)

అర్జు— (గౌరవముతో) కుమారా! నీసాహసము శ్లాఘ్యమైనది.

క. చనుదేవలెఁ జూమ్మీ! నీ
యనుగులుఁ జుట్టములు నీవు నందఱు సవనం
బునకున్; వచ్చెడి పున్నమ
దినమున కటనుండవలె విధిగ రాజమణీ!

వజ్ర— (సిగ్గుతో) మీయాజ్ఞ శిరసా వహించుచున్నాఁడను.

గంధ— (తనలో) మరల నేదేనిఁ దగినయుద్ధము దటస్థించినప్పుడు రావచ్చును. ఇఁక నెందుకు? (నిష్క్రమించును.)

అర్జు— (చూచి) అప్పుడేయశ్వము ముందరుగుచున్నది. ఇఁక సింధుదేశము

సమీపమగును. అచ్చట నా తోఁబుట్టువు దుస్సలకొడు కుండును. అతఁడు
గూడ నశ్వము నడ్డుపెట్టునా? దుస్సల యట్టిపని కొప్పికొనఁ గూడదు.
(పరిక్రమించును) అప్పుడే వచ్చితిమి. అదిగో ః సింధునది.

(తెరలో) క. పోనీకుఁ డశ్వమును రా
టూనుఁడు లేకున్న కొదువ చొప్పడకుండం
గా నేగి పట్టుఁ డమరే
శానతనూజుండు మనకు శత్రుండు కదా ః

అర్జు— (సంశయముతో) రాజపుత్రుఁడు లేకపోవుట యెందుచేతనో? వీర
లెవరై యుందురో? రాజబంధువులై యుండ నోపుదురు. అక్కటా ః
దుస్సల కింతటిలో నీదుఃఖ మెట్లు దటస్థించెనో?

(దుస్సల మనుమని నెత్తుకొని ప్రవేశించును)

దుస్స— అన్నా, యర్జునా ః యీపసిబాలుని రక్షింపుము, రక్షింపుము.

అర్జు— (కౌఁగిలించుకొని) అక్కా ః నీకొడుకేమాయె ?

దుస్స— (దుఃఖముతో) ఏమి చెప్పుదును. నీ వశ్వమువెంట వచ్చుచుంటి
వనువార్త నింతకుఁ బూర్వమే చారులవలన విని బెంగఁబెట్టుకొని
నే నెంత బోధించినను నమ్మఁజాలక తుదకు మరణించెను.

అర్జు— (విచారముతో)

చ. కటకట ః రాచపుట్టు విధి కాల్పనె ? పేర్వినుమాత్రఁ బ్రాణ మా
ద్భుట ఘటియించు పాతకునిఁ జూచుట కెవ్వఁడు రోయకుండు ః న
క్కటికము లేని పుట్టువులకన్నఁ బిశాచము మేలుగాదె ? యే
మిటికి భయంబుఁ జెందెఁ ? దనమీఁదికి వే నని కుత్సహింతునే ః

ఒక్క తనమీఁదికే గాదు, "రాచనిసువుల జోలి కించుకయుఁ బోకయే
యశ్వమును దిప్పుకొనిర" మ్మనికదా ః యన్న యాజ్ఞాపించినాఁడు.
నా రాకఁజెప్పినవార లీమాటఁ గూడ నెందుకుఁ జెప్పరైరో ?

దుస్స— ఒకరెందుకుఁ జెప్పవలెను ? నేను "పీకించుకయు భయము లే"
దని చెప్పితిని. కాని, తండ్రియవస్థ దలఁచుకొని భీతిల్లి తుట్టతుదకు
నన్నుఁ బుత్రశోకార్తిలో ముంచినాఁడు.

అర్జు— అక్కా! విచారింపకుము. గతించినదానికేమి చేయఁగలము? (పిల్లవాని నెత్తికొని) తండ్రీ! నీవు దీర్ఘాయుష్మంతుఁడవు కమ్ము. (దుస్సల నుద్దేశించి)

తే. గీ. అన్న కావింపనున్నాఁడు యాగ మొకటి
రమ్ము మనుమనితోడ నీరాక కెదురు
చూచుచుందుము మానెదుసుమ్ము మాకు
లేరు నీకన్న నక్క సెల్లెండ్రువేఱ.

దుస్స— తప్పక వచ్చెదను. అన్నా! తల్లిదండ్రులకుఁ గుశలమకద!

అర్జు— ఆ! క్షేమముగా నున్నారు. నీరాకకు వారును నెదురు చూచుచుందురు. ఇఁక నీవింటికి వరుగుము. (దుస్సల మనుమనితో నిష్క్రమించును.)

అర్జు— (చూచి) అప్పుడే యశ్వము ముందుఁ బోవుచున్నది. ఇటుపైని గొన్నిదేశములు తిరిగినపిదపఁ బాండ్యదేశము తటస్థించును. అచ్చటి మణిపూరపురము నాప్రియురాలగు చిత్రాంగద పుట్టినిల్లు.

తే. గీ. పెండ్లియాడితి నప్పుడు పేర్మికొలఁది
మరల నొకపరి యేనియు నరయ నైతిఁ
దరుణి నన్నెంత దూఱునో! దనయుఁ డేమి
యయ్యెనో? యెటులుండెనో? యరయఁబడదు.

కానిమ్ము, అశ్వముం గలిసి కొనియెద.

(నిష్క్రమించును.)

— గద్య —

ఇది శ్రీ....తిరుపతి వేంకటేశ్వర ప్రణీతంబగు
పాండవాశ్వమేధమ్మునఁ బంచమాంకము.

ఓం

శ్రీ మత్సరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము.

## షష్ఠాంకము

[ అంతర్నాటకము ]

(నాంది)

తే. గీ. ఆర్తుల కెవండు సంజీవనౌషధంబు
కల్పపాదప మెవఁడు భక్తగణములకు
నెవనిమాయ దురూహ మా యీశ్వరుండు
శుభములిడు జగన్నాటక సూత్రధారి.

సూత్ర— (నాంద్యంతమునఁ బ్రవేశించి) మారిష ః ఇటు రమ్ము.

మారి— ఇదె వచ్చితిని.

సూత్ర— నాటక మాడుఁ డని యాజ్ఞాపించియు ధర్మరాజుగా రిప్పటికిని సభకు విచ్చేయని హేతువేమో ?

మారి— తమ్మునియొద్దనుండి వార్తాహరులేని రాలేదని యోజించుచున్నారఁట. అక్కతననేకదా కాలయాపనకై మనలం బిలిపించుట ః

సూత్ర— (దృష్టినిగుడ్చి) అదిగో ః రాజుగారు దయచేసినారు. మన మిఁక నాటక మారంభింతము.

(అంత ముగ్గురు తమ్ములతో ద్రౌపదీసమేతముగ ధర్మరాజు ప్రవేశించును.)

మారి— ఈనాఁడు మన మేనాటకము ప్రదర్శింపుదము ?

సూత్ర— ప్రకృతోచితమగు బభ్రువాహనవిజయము.

మారి— చక్కఁగా యోజించినావు. కాని యాకతమున వారి మనస్సునకు నొప్పి కలుగునేమో ?

సూత్ర— "పుత్రాదిచ్ఛేత్పరాజయమ్" కనుక బభ్రువాహనునిచే నర్జునుఁడు జయింపఁ బడుటకు వా రానందమునే పొందుదురు.

(తెరలో)

నిటలఘటితాంజలిపుటుండనై యేను మాతండ్రి దర్శనమునకుఁ బోవుచుండ నసంబద్ధప్రలాపము లాడుచున్నారేమి?

మారి— (విని) అర్జునుని దర్శనమునకు బభ్రువాహనుండు వచ్చుచున్నాఁడు గాన మనమిఁకఁబోవుదము. (నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

(అంత నర్జునుఁడును బభ్రువాహనుఁడును వేఱువేఱు వైపులను బ్రివేశింతురు)

బభ్రు— మా పెద్దతండ్రిగా రశ్వమేధయాగదీక్షితులై యశ్వము వెంట మాతండ్రిగారి ననిపిరనియు, వారు మాపురము సమీపమునకు వచ్చిరనియు వింటిఁ గావున నెదురేగి వారిని బురంబునకుఁ దీసికొనివచ్చి సన్మానించి జన్మమును గృతార్థముగాఁ జేసికొనియెద. (పరిక్రమించి) అరుగో, తండ్రిగారు! (సమీపించి)

చ. తనయుఁడ బభ్రువాహనుఁడఁ దండ్రి! భవచ్చరణాబ్జ దర్శనం
బునఁ గృతినైతి, మజ్జననమున్ కడు మాన్యత గాంచెఁ, బట్టణం
బున కొకసారి వచ్చి పరిపూత మొనర్పఁగ వేఁడుకొందు, మ
జ్జనని యిటుల్ ననుం బనిచె, సర్వము విన్నప మాచరించితిన్.

అల్లదె, యమాత్యపురోహితసామంతాదు లందఱును దమ రాకకై యెదురు చూచుచున్నారు. కృపావలోకనంబుల వారలనెల్ల వీక్షింపఁగోరెద.

ద్రౌప— (తనలో) మూఁడుమూర్తుల నితఁడు నిజముగాఁ బాండవమధ్యమునివలెనె యున్నాఁడు. నాటకమైనను వేషము లిట్లుండిన నది రమణీయముగ నుండును.

ధర్మ— (తనలో) ఓహో తమ్ముఁడా! నిన్నుఁజూచి యెంతకాల మైనదోయి! నేఁటి కీ నాటకులకతన మరల నినుఁ జూడగల్గితివి.

భీము— (తనలో) ఇతఁడా, బభ్రువాహనుఁడు! తమ్మునికి నితనికిని భేదమే కనుపట్టదు.

నకు— (తనలో) ఇందుల కన్న యేమని యుత్తర మిచ్చునో?

సహ— (తనలో) కొమరుఁడు వచ్చి నమస్కరించినఁ గౌఁగిలించుకొని గౌరవింపక యేమో కోపముగా నుత్తర మిచ్చుచున్నాఁడు.

అర్జు— (అనాదరముతో)

ఉ. "నా కొమరుండ" వంచు నెటు నమ్మెదు? నశ్వముఁ గట్టిపెట్టితో?
వీఁక నెదిర్చితో? యిదియు విం దగునే నరపాలసూతి? కీ
రాక గనుంగొనంగ నిను "రా కొమరుండ" వటన్నమాటకే
లోకము విశ్వసింప దెటులో యిఁక "నాకొమరుండ" వన్నచోన్.

ధర్మ— దేవీ! చూచితివా తమ్ముని యవివేకము? నేను జెప్పిన సంగతులు మరచి నట్లున్నాఁడు. తనంతటఁ దానే కయ్యమునకు దిగుచున్నాఁడు.

ద్రౌప— నాథా! యిది నాటకము గదా! కవులు వారివారి యిష్టానుసారముగాఁ గల్పింతురు.

భీము— అవును. నీవనినట్లే. లేనిచో నిట్లు విరుద్ధముగా నతఁ డెన్నఁడును మాట లాడఁడు.

బభ్రు— (చిన్నవోయి తనలో) అక్కటా! లోకోత్తరుఁడైన వివేకి తండ్రి యేమి కతమున నిట్లాడి యుండునో? నే నెంత సంతోషమ్మున నిక్కడికి వచ్చితినో యంత విచారముగాఁ బోవలసిన వాఁడ నైతిని. కానిమ్ము. ఏమైనను జనకునితో వివాదము సమంజసము గాదు.

క. "జనకునికి విరోధించిన
తనయుఁడు తనయుండు గాఁడు తల్లికిఁ దత్పు
త్రుని కతన సతీమణి నా
దను నపయశ మబ్బు" నందు రమలమనీషుల్.

ఇంతకు నన్ని యనఘుఁడు మాతామహ కుటుంబమున కిచ్చివేయుటంబట్టియుఁ బుట్టినది మొద లిందనుకఁ జూడకుంటం బట్టియుఁ బ్రేమ బంధము తెగియుండును. "స్నేహము ప్రవాసాశ్రయమున నశించు" నని

కదా పెద్దలు చెప్పుదురు! (మరలి పోవుచు) తల్లికడ కరిగి ఆపె యేమనునో చూచి కాని యెందులకును స్వతంత్రింపఁగూడదు.

గీ. గర్భమునఁ బదిమాసముల్ కష్టమనక
తన్ను ధరియించి మోసి యంతట నఖండ
మైన వేదనఁ బ్రసవించినట్టి తల్లి
జనకుకన్నను హెచ్చగు శతగుణంబు.

ధర్మ— పాపము! తలవంచుకొని మరలిపోవుచున్నాఁడు. (ఆతని నుద్దేశించి) తండ్రీ! కురుకులోద్భవుండ వగు నీకిదియే యుచితము. ఎవ్వరో యొక్కరు దక్క మన వంశంబున నవినీతు లిప్పటికి జనింపలేదు.

ద్రౌప— ఇది నాటకము. అటు చూడుఁడు. ఒక నాగకన్యక ప్రవేశించుచున్నది.

(అంత నులూపి పాతాళము నుండి ప్రవేశించును)

భీము— ఈమె యెవరో?

నకు— చిత్రాంగద యేమో?

సహ— చిత్రాంగద నాగకన్య గాదు గదా! తినఁబోవుచు రుచు లెందుకు? ముందు తేలవచ్చును.

ఉలూ— కుమారా! యిట్లు నిర్విణ్ణమానసుండవై యేగుచుంటివేమి? మీతల్లి మాత్రము నిన్ను "రణము మాను" మను ననుకొంటివా? తండ్రి మనోరథమ్ము నెఱవేర్పుము. శూరులకుఁ దండ్రియుఁ గొడుకును నన్నయుఁ దమ్ముఁడు నను భేద ముండదు. అందులోఁ బాండు వంశసంజాతులకు బొత్తిగా బాంధవ్య మవిచార్యము.

ధర్మ— ఈపె యెవరో గాని మంచినీతియే బోధించుచున్నదే. అకటా! నా కతన వంశమున కెట్టి దుష్కీర్తి వచ్చినది. దేవీ! చిగురుమాట నీవు వింటివికదా?

ద్రౌప— నాటకము గదా, దీనిని మన మంత లెక్కగాఁ జూచుకోరాదు.

ధర్మ— ఎందుకు చూచుకోఁ గూడదు? ఇం దసత్య మేమున్నది? నేను బంధు ఘాతుకుఁడను గానా యేమి?

ద్రౌప— అగుదురు, శూరు; దానికేమి? అటు చూడుడు.

బభ్రు— (తనలో) ఎవరీమె! ఇంతకును నాలో నే ననుకొన్న సంగతు లెట్లు గుఱుతించినది. (ప్రకాశము) తల్లీ! ముందు నీ వెవ్వరవో నా కానతీయవలయు.

తే. గీ. కార్తికేయుని జననివో? కాక మన్మ
థాంబవో? జయంతు తల్లివో? యల్లసప్త
ఋషులమాతవో? త్రిజగమ్ములెల్లఁ గనిన
యాదిశక్తివో? వచియింపుమమ్మనాకు.

భీము— అడుగఁ దగిన సంగతి నడిగినాఁడు.

నకు— ఇంతకు నీమె "యితనితల్లి మాత్రము గా" దని తేలినది.

సహ— అంతయు నిప్పుడు విస్పష్టమగును.

ఉలూ— తండ్రీ! నీకు నేను బెద్దతల్లి నగుదును. మీ యమ్మకన్న మున్న మీతండ్రి నన్ను గాంధర్వవివాహమున వరియించె. నా పే రులూపి. పాతాళము నివాసము, నాగకన్యకను. నీ వియ్యెడఁ దల్లివెనుకఁ దల్లి నగు నామాట విశ్వసింపుము. తండ్రి మనోరథం బీడేర్పుము.

సహ— ఇక్కడికిఁ దేలినది కదా!

నకు— వధూనికా! నమస్కారము.

భీము— ఇది నాటకము.

ద్రౌప— (నవ్వుచు) నాథా! మీతమ్మునికిఁ దీర్థయాత్ర బహుఁ(ఇ)ష్టతో జరిగి నదిసుఁడీ!

ధర్మ— (అనాకర్ణితముగా) ఈమె యాకారముఁజూచినఁ బరమపతివ్రత వలెఁ బొడకట్టుచున్నది. ఇంతకు మున్ను వినికియు నిందుకు భిన్నముగా లేదు. అట్టి యీమె యేలొకో, యిప్పట్ల నిట్టి దురుపదేశం బొనరించి కుమారుని మనముఁ ద్రిప్పుచున్నది!

ద్రౌప— దురుపదేశమేమి? "తండ్రియాజ్ఞను శిరసా వహింపు" మని బోధించు చున్నది.

ధర్మ— నీవు పక్షపాతముగాఁ జెప్పుచున్నావు. "చెల్లెలుగదా!" యని చెల్లెలిమాట సాధించుట నిష్పక్షపాతము గలవారల కుచితమా?

ద్రౌప— (నవ్వి) ఇంతకు నిది నాటకము గదా!

ధర్మ— నా మనమునకు నిది నాటక మనిపింప కున్నయది.

ద్రౌప— కాకేమి, యటు చూడుఁడు.

బభ్రు— (తనలో) ఈ సంగతి తల్లికతన మున్ను విని యున్నదే. ఇంతకు మా యిరువురకును రణము దైవచోదితమై యున్నది. లేనిచో నీపె కాకతాళీయముగా నియ్యెడకు వచ్చి యిట్లేల బోధించును. (ప్రకాశము) తప్పకనీయాజ్ఞ నిర్వర్తింతును.

ఉలూ— నాయాజ్ఞగాదు. తండ్రియాజ్ఞ.

బభ్రు— ఉభయులును మాన్యులే కదా! ఇదిగో, యుద్ధసన్నద్ధుండనై యరు దెంచెదను. (నిష్క్రమించును)

ధర్మ— (తనలో) "ఇది యుచితము గా" దని తమ్మునితో బోధింపుదునా? లేనిచో నేమిచిక్కువచ్చునో? అయినను గొంతసేపు చూచి యట్లొన రింప వచ్చును.

ఉలూ— (తనలో) అకృత్యమైనను నవసరముం బట్టి చేయఁబూనినందుల కిక్కొమరుం డంగీకరించెను. లేనిచో నిమ్మహానుభావునికి భీష్మవధ జనితదోషంబు వేయి జన్మంబు లనుభవించినను దీఱదు. ఇంతకు వసువు లనుగ్రహించి యిట్టి యుపాయ మొనరించినారు. (పరిక్రమించి) అదుగో, నాప్రియుఁడు! తిరిగియు నెన్నాళ్ళ కీతని దర్శనమునకు నోఁచికొంటిని! ఇంతకు నాచెట్ట వట్టినది మొద లేదియో యొక చిక్కు మ్మహామహానికిఁ దటస్థించుచునేయున్నది. నేనుదురదృష్టవంతురాలను. అంతియ కాదిప్పుడు పరమ దుర్మార్గురాలనుగూడ నగుచున్నాను. కాని చోఁ దండ్రికిని గొమరునకును వైరము పెట్టుదునా? చిత్తమా! యొక్కింతసేపు కాఠిన్య మవలంబింపుము. లేనిచోఁగార్యము నెఱవేఱదు.

భీమ— అదుగో! కుమారుఁడు సన్నద్ధుండై వచ్చినాఁడు.

(బభ్రువాహనుఁడు ప్రవేశించును.)

నకు— ఇతఁడు రెండవ యభిమన్యుఁడే.

సహ— ఏమో? వినయముగాఁ జెప్పుచున్నాఁడు.

బభ్రు—

చ. కనుఁగొను మయ్య తండ్రి ! యిఁక గాండివమున్ సగుణంబొనర్పు "నీ
యనుమతియే ప్రధాన" మని యాహవమున్ బొనరింప వచ్చినాఁ
డను; "దనయుండు వీఁ"డను కటాక్షము చూపఁగఁ బోకు; మేనునున్
గనికర మూనఁ "దండ్రి" వని; కాఁదగు నెయ్యదియో రయమ్మునన్.

ధర్మ— ఓహో ! చిలికి చిలికి గాలివాన యగుచున్నదే !

ద్రౌప— మీతమ్ముఁ డేమో యానందముతో ననుచున్నాఁడు. వినుఁడు.

అర్జు— (సంతోషముతో) కుమార! నీ మ్రొక్కిప్పుడు గైకొంటిని. ఇదిగో! ఆశీర్వచనము.

గీ. మనుముచిత్రాంగదను వీరమాతఁ జేయు
మేలమి మాకు యశమ్మునుగలుగఁజేయు
మస్థిర శరీరమున కేమి, యశము మనకు
ముఖ్య మద్దాన నీమది మునుఁగుఁగాక.

ధర్మ— (తత్తఱపాటుతో) దేవీ! వింటివా ! తమ్ముని నోట నెప్పుడును రాని మాటలు వచ్చుచున్నవి. శరీర మస్థిర మట ! ఇట్లెందు కనవలెను ?

ద్రౌప— అస్థిరముకాక సుస్థిరమా ! అందేమి తప్పున్నది? శేషము వినుఁడు.

అర్జు— రణభూమి నలంకరింపుము. ఇదె నేను వచ్చుచున్నాఁడను.

(నిష్క్రమించును.)

ధర్మ— వినుట కేమున్నది. రణమునకుఁ బ్రారంభించినారు. ఇదుగో, నేను బోయి వారించెదను. (లేవఁబోవును)

ద్రౌప— (చేయిపట్టుకొని) నాథా ! యేమి మీ వెఱ్ఱి ! యిది నాటకముగదా !

ఉలూ— ఇక్కడికి నేను సగము కృతార్థురాలను. తక్కిన కొదువ శీఘ్రముగనే తీఱవచ్చును. (పరికించి) కుమారుఁడు వింట నమ్ములు సంధించియును నెందులకో జాల మొనర్చుచున్నాఁడు. అవును, ముందు తండ్రి విడిచినం గాని విడువఁడు. పరమపతివ్రత యగు చిత్రాంగదకును నఖండ నీతిధురంధరుం డగు విజయునకును బొడమి కుమార్గమున నీతఁ డడుగువెట్టునా ? అదిగో, నాదయితుఁడే ముందుగా నమ్ములు

విడుచుచున్నాఁడు. అక్కటా! కన్నకొమరునిపైఁ గఱకుటమ్ములను విడుచుటకు నాథా, మీకుఁ జేతు లెట్లు వచ్చినవి! బలే! యొకరికన్న నొకరు! తండ్రి శరములలో నొక్కటియుఁ దక్కకుండఁగ నన్నిటిని నొక్క యమ్మునసే చూర్ణము చేసినాఁడు. (విని) వాఁడుఁ దేమో యను చున్నాఁడు.

(తెరలో)

క. మెచ్చితిఁగదోయి! మదికిన్
వచ్చెను నీచర్య; "పాండువంశమ్మున ను
ద్యచ్చరితు లెందుఁ గల" రను
నచ్చెరు విది యొదవుఁగాక యఖిల జగతికిన్.

ధర్మ— దేవీ! నన్నెందుకు వారించెదవు? సుతి మించుచున్నది. ఎవరో యొకరు తెగక తీరదని యూహించెదను.

ద్రౌప— నాథా! "యిది నాటక" మని యెన్నిసార్లు మనవి చేసినను మీ మన మిట్లు పరాయత్త మగుచున్నదేమి?

ధర్మ—కొలఁది దినములకిందట నాకొక దుస్స్వప్నము వచ్చినది. అప్పటి నుండియు నామనము మనముగా లేదు.

ద్రౌప— ఇన్నాళ్ళనుండియుఁ జెప్పరై తిరేమి? దాని పర్యవసాన మెట్టిది?

ధర్మ— పర్యవసానము శుభముగా నుండఁబట్టియే యింతవఱకు జీవింపఁ గలిగితిని.

ద్రౌప— అట్లయిన నిఁకఁ బరితాపమెందులకు? స్వస్థచిత్తులరై కనుఁగొనుఁడు.

ఉలూ— (తనలో) ఈ యుద్ధ మొకలాగు జరిగినచోఁ గడు నెన్నఁదగి యుండును. వీరలకుఁ బరస్పరజ్ఞాన మించుక ప్రతిబంధించుచున్నది. (చూచి) ఓహో! తుదకుఁ జూడశక్యము గాకున్నదే? ఒకరి నొక రెట్లు కొట్టుకొనుచున్నారో! ఇట్టు లిఁక నొకక్షణకాల మున్న నొక్కరే కాదు. ఇరువురును దెబ్బలపడలసినవారే. వలదని వారింతునా! (యోజించి) అయ్యో! మరల నజ్ఞానమునఁ బడుచున్నాను. వారించి

స్నీక సమరాంగణమ్మున
నే కాయము విడిచి స్వర్గ మేగె మృగాక్షీ!

ధర్మ— అయ్యో, వెఱ్ఱితమ్ముఁడా! ఇప్పు డీమెకు మరల నాసంగతి యెందు లకు జ్ఞప్తికిఁ దెచ్చితివి.

ఉలూ— (కన్నీరు నించును.)

చిత్రా— అక్కా! ఊఱడిల్లుము. రాచకొడుకుల కిది యుచితమేకదా!

అర్జు— దేవీ! నాగరాజనందని!

క. ఏరి కని విచారింపుద
మోరాజీవాక్షి! కొమరు లొక్కటఁ దెగి రీ
భారతరణమున విది భూ
భార తరణమగుట నట్లు పనుపడె నబలా!

ద్రౌప— అక్కా! ఐదుగురుకొమరులను నేను మ్రింగితిని. ఏమిచేయు దము? ఊఱడిల్లుము. (కన్నీరువిడుచును)

ధర్మ— దేవీ! ఊఱడిల్లుము.

చిత్రా— ఆయనకుమాత్రము కొమరుఁడు గాఁడా? విచారము లేకపోవునా? శోకించిన ఫలితమేమి? ఊఱడిల్లుము (కన్నీరు దుడుచును)

ఉలూ— అక్కా! తండ్రికిని గొడుకునకును గలహము పెంచెడి పాప జాతికి నాకట్టి కొడు కెందుకు దక్కెను.

చిత్రా— పరమ యోగ్యురాలవగు నీవు మిన్నక యిట్టిపని నాచరింతువనిన నామది నమ్మకున్నయది. యిందేదేనిఁ గారణ ముండితీరవలెను.

ద్రౌప— (తనలో) ఈమె వితర్కము కడు శ్లాఘనీయము.

ఉలూ— కారణము లేకేమి? "భీష్మునిఁ గపటోపాయమునఁ జంపినం దులకై నాధునికి నరకబాధ తప్పకతటస్థించు"నని యొకనాఁడువింటిని.

అర్జు— (తనలో) ఓహో, యెట్టి దుష్కీర్తి సంపాదించుకొంటిని!

క. హరిసెప్పఁ గాక యగ్రిజుఁ
డఱ లేకటు లొప్పుగాఁక యక్కట నేనీ
దురిత మ్మొనర్ప నగునే?
శరీరముల్మాపోవుఁగాని చన నపకీర్తుల్.

ధర్మ— (విచారముతో) అవును, తమ్ముఁడా! దేహములు క్షణభంగురములు కాని కీర్త్యపకీర్తులు కల్పాంతస్థాయులు.

చిత్రా— ఎవరివలన వింటివి ?

ఉలూ— వసువులవలనను, భాగీరథివలనను.

ధర్మ— దేవీ! యిక్కడికిఁ గొంత దేలినది.

ద్రౌప— తక్కినది గూడ విని కాని చెప్పఁజాలను.

చిత్రా— ఎక్కడ ?

ఉలూ— గంగయొద్దను.

చిత్రా— తరువాత వారిని నీవేమి కోరితివి ?

ఉలూ— పాదములపైఁ బడి యీ నరకమునకు నిష్కృతి యేదేని యనుగ్రహింపక తప్పదని వేఁడు కొంటిని.

ధర్మ— సాధ్వీమణీ! మంచి యుపకారము నాచరించితివి.

చిత్రా— వార లేమనిరి ?

ఉలూ— ఇది తప్పక యనుభవించియే తీఱ వలసిన దని నొడివిరి.

ధర్మ— సుకృతదుష్కృతము లూరక యెటు తీఱును ?

చిత్రా— పర్యవసానమును దెల్పుము.

ఉలూ— "తుట్టతుదకు నీతని కొమరుఁడు బభ్రువాహనుని చేతిలో నితఁడోడి పరిమృతుం డయ్యేనేని యితని కీపాపము తీఱు" ననిరి.

చిత్రా— తరువాత ?

ఉలూ— మాతండ్రి యనుగ్రహమున నాకెట్టులేని సంజీవనమణి యంత దుర్లభము కాదని యెంచి, యట్లనే జరుగునట్లనుగ్రహింపుఁ డని కోరితిని.

ధర్మ— ఇక్కడికిఁ దేలినది. చచ్చినవాని నీమె సంజీవనమణిచే బ్రతికించినది. ఇంతకును నాతమ్మునికి గండము దాఁటి పోయినది. ఇఁక గంగ యిచ్చిన శాపము మఱొక్కటై యుండదు.

ద్రౌప— నాధా, అట్లనే యగుఁగాక! కాని యిది నాటకము. ఎంతవఱకు సత్యమో ?

బభ్రు— (తనలో) అట్టి యుజ్జీవనౌషధ ముండుటం బట్టియే యీామె మా కలహమునకు సమ్మతించినది.

అర్జు— (తనలో) ఓహో, దీని ముఖ్యాంశ మిది :

క. వసువులు గంగయు నొక్కట
గుసగుసలాడంగ విని యిగురుఁబోడి తదీ
యసమాచార మెఱిఁగి య
వ్వసువులఁ బ్రార్థించి యిట్టి వల నార్జించెన్.

చిత్రా— అక్కా : నిన్నొకటి యడుగుచున్నాను. జగదేక వీరుఁడగు నాథుని నీ శిశువెట్లు జయింపఁగలిగెనో ? యని సందేహించుచున్నాము.

భీము— నాకును నిదియే గొప్ప సంశయము.

ఉలూ— నేనప్పుడే వసువులను బ్రార్థించితిని.

చిత్రా— ఏమని ?

ఉలూ— మీ ర మ్మహామహుని జయింపఁ దగు సామర్థ్యముఁ గొమరునకుఁ గలుగఁ జేయవలయు నని.

బభ్రు— (తనలో) ఇప్పటికి నేను నిరపరాధిని.

సహ— తగినంత తృప్తిగా లేదు. వసువులు రుద్రునికన్న నెక్కువవారా ?

నకు— మహాదేవుఁడు భక్తపరాధీనుఁడు గదా ! అయ్యనఘుని జయించుట మన మొక గొప్పగాఁ జూచుకొనఁ దగదు.

ధర్మ— తమ్ముఁడా ! నీవు చెప్పినదే సముత్తరము. వసువులకు మన్నపై ననుగ్రహముండదు కదా ?

గీ. ఒక్క వసు నంశ మగు భీష్ము వోర్చుటకుఁ ద
రంబు గాదయ్యె మును సమరమున మనకు;
నట్టి వా రేద్దురఁట ! పయి ననుజ మరణ
రోషరూషితు లఁట ! యిందు దోష మేమి ?

చిత్రా— అక్కా ! యింత పరిశ్రమము చేసి నాథునికి నరకము బాపిన నీ మేలు నే నేమని కొనియాడఁగలను.

ఉలూ— స్వకార్యమునకై యేనింత శ్లాఘింపఁ దగను.

చిత్రా— కుమారా! జనకునకు నమస్కరించి క్షమాపణ కోరుకొనుము.

బభ్రు- (నమస్కరించి)

క. ఎఱిఁగియు నెఱుఁగక చేసిన
పొరపాటు క్షమించి నన్నుఁ బుత్రుని బరమా
దర మొలుకు కటాక్షమ్ముల
నరయుము నీయాజ్ఞ యేదియైన నొనర్తున్.

అర్జు— (కౌఁగిలించుకొని) తండ్రీ! నీవెందుకు క్షమింపఁబడవలయును?

గీ. నరకముఁ దరించుటకుఁ గదా! నరులు కొమరు
లం గనుట! నీకతన నా ఫలమ్ముఁ గంటి.
నాత్మజుఁడు తండ్రికన్నను నధికుఁడైన
యప్పుడే కద తండ్రికి నబ్బు ముదము!

అనేకులఁ గొమరులఁ గన్నను నేను నీకతన ధన్యుండ. నీమనమ్మున నిందులకు లేశమ్మను సంశయము వలదు. వచ్చు చైత్ర పూర్ణిమ నాఁటికి నీతల్లు లిద్దఱి తోడను నశ్వమేధమ్మున కరుదెమ్ము.

బభ్రు- (వినయముతో) జనకుని యాజ్ఞ శిరసా వహించితిని. తండ్రీ! ఒకసారి పురమ్మునకు విచ్చేసి పిదప దయచేయవలయు నని ప్రార్థించెదను.

అర్జు— కుమారా! నేను దీక్షఁ బూనిన కతన నిప్పటికి రా వలనుపడదు. కావున న న్నుపరోధింపకుము. నీవు నీతల్లులతోఁ బురమ్మునకుఁ జనుము. న న్ననుపుము. నేనింకను గాంధారాది దేశమ్ము లీ యశ్వమ్ముతోఁ జరింపవలయును. ఇప్పటికే యన్న నాకై యెదురు చూచుచుండును.

(అందఱును నిష్క్రమింతురు)

(ఇది అంతర్నాటకము.)

ధర్మ— (దెసలు పరికించి) తమ్ముఁడా! ఇంతలో నెక్కడి కేగితివి?

ద్రౌప— ఇప్పటికి నాటకము పరిసమాప్తమైనది. పాత్రము లన్నియు నిష్క్రమించినవి.

ధర్మ—

చ. అరిగెఁ దురంగమమ్మువెను కర్జునుఁ డెంతయొ కాలమయ్యె; సం
గరములె తారసించెనొ? సుఖమ్ముగ దేశమె చూచుచుండెనో?

యెఱుఁగఁగ రాదు, వా ర్తయును నిప్పటి కియ్యెడ కంపఁ డయ్యె; ద త్తఱపడు మానసం బకట! తమ్ముని౯ జూడక యెట్టు లోర్చెదన్.

భీము— అన్నా! సకల భూచక్రముం గ్రుమ్మరి కాని రా వలను పడదు కదా! అది గాక మధ్యమధ్య యుద్ధములు దటస్థించుచున్న ట్లిప్పటి నాటకము వలననే మనకు విస్పష్ట మగుచున్నది.

ద్రౌప— నాటకముమాట కేమి గాని తగిన సహాయు లెవ్వరును లేకుంటచే నా మనము కొందల మందుచున్నయది.

ధర్మ— అట్లనకుము. ఇదియును సత్యమే యై యుండును. "త్రికాలజ్ఞుఁ" డని కదా యక్కవిని౯ బేర్కొనిరి.

నకు— దేవీ! అసహాయశూరునకు సహాయ మెందులకు?

క. ఖాండవ మేర్చెడు తఱి గో
మండలి మరలించినపుడు మఱి యెవ్వరు తో
డుండిరి? కోరం దాతం
డొం డెద్దియు గాండివమ్ము నొక్కఁడు దక్కన్.

సహ— దేవీ, పాంచాలి!

గీ. శూలికన్నను జగముల శూరు లొరులు
లేరు గద! యమ్మహాత్ముతో బోరు నపుడె
అన్న యసహాయుఁ డితరుల నెన్న నేల
యతని లావు నెఱింగియు వెతలు దగునె.

భీము— తమ్ముఁడా! చక్కఁగ నొడివితి.

క. అన్న యిటు లాచరించిన
వెన్నేనియుఁ గలవు దురము, లిది యొక లెక్క!
మొన్నటి బవరం బంతయు
నన్న పయిం జెల్లె ననుట కత్యంతరమే?

ధర్మ— అది యట్టిదియ, యైనను నెవరికిఁ దగినట్లు వారు పాటు పడుటం బట్టియే జయింపఁగలిగితిమి. ఇందులో నొకరి కొకరు దీసిపోవు వా రెవరును గారు.

చ. అలఁతులె ద్రౌపదేయులు ? మహా బలశాలి ఘటోత్కచుండు దాఁ
గొలఁదియె ? శౌరి యల్లున కొకొం డిల సాటియె ? సాత్యకిన్ దగం
బలికిన నోట నింకొకనిఁ బల్కఁ దరంబె ? కవల్ విరస్యులే ?
బలమున నీకు సాటియగు పార్థివు నొక్కని నేవిఁ గంటిమే.

ద్రౌప— నాఁడు సౌగంధికకుసుమానయనమ్మున కియ్యనఘు నంపినయది మొదలు నా కొంటిగా నిం దెవ రెయ్యెడ కరిగినను మన సొప్పదు.

ధర్మ— అవును, అప్పటి యలజడి కితఁడు గనుకనే కాని మఱియొక్కని కా ముక్కడి రక్కసుల బారిఁ జిక్కకుంట హుళిక్కి. ఐనను గార్యావసరముం బట్టి యొంటరిగా నితని నంప వలసి వచ్చినది.

నకు— అవసరము లేదని యూరకొనిరి గాని బావ నంపినచో వెళ్ళనే వెళ్ళను.

సహ— అవును. అట్లొనర్పవలసినది. వా రిరువురకు సఖ్య మసామాన్యము.

ధర్మ— నిజమే కాని, కొంచెము సంశయించితిని.

క. మనకున్ సంధి యొనర్పఁగఁ
జనుదెంచిన నాఁటఁగోలె శ్రాంతి యనుట యొ
క్క నిమేషమ్మును నెఱుఁగఁ డి
తని నిఁక మోమోట పెట్ట ధర్మం బగునే!

ద్రౌప— ద్వారకనుండి యెవరేని శ్రీకృష్ణుని యనుచరులు వచ్చిరేమో? ఆ సమీపమున నున్నయెడ జాడఁ దెలియ నయ్యెడిని.

(అంతఁ గృష్ణుఁ డొక వార్తావహునితోఁ బ్రవేశించును.)

కృష్ణ— (తనలో) పాండవాగ్రజుండు తమ్ముని జాడఁ దెలియమిని జింతిల్లుచుండంబోలు. పార్థునియుదంతమును జేకొనివచ్చిన యీ పశుపాలునిచే నతని మనోవ్యాకులతను బోఁగొట్టెదను. (సమీపించును.)

ద్రౌప— అన్నా! యిప్పుడే నీమాట చెప్పుకొనుచున్నారము. మాటలోనే నీవు వచ్చితివి.

ధర్మ— (పశుపాలు నుద్దేశించి) ఇతఁడు ద్వారకనుండి వచ్చెనా యేమి?

కృష్ణ— అవును. మీ తమ్ముఁ డితనిచేఁ దన కుశలవార్త నంపించినాఁడు.

భీము— (ఆదరముతో) అతఁ డప్పుడే ద్వారకకు వచ్చి యటనుండి వెడ లెనా యేమి ? అట్లయినఁ గొలఁది దినమ్ములన యిటకు రావచ్చును.
ధర్మ— ఓయీ ! మాతమ్ముఁడు కుశలముగ నున్నాఁడు గద? నీపేరెవరు ?
పశు— క్షేమముగనే యున్నారు. నాపేరు పశుపాలుఁడు.
ద్రౌప— (తనలో) అమ్మయ్యా ! యిక్కడికి బ్రతికితిమి.
నకు— పశుపాలా ! ఏమేమి సంగతులు చెప్పి పంపెను ?
సహ— త్రోవలో నెక్కడెక్కడ యుద్ధములు జరిగినవో ?
భీము— జరాసంధ పౌత్రుఁడు మేఘసంధి తప్పక యశ్వము నడ్డగించు నని యోజించెదను.
కృష్ణ— (నవ్వుచు) మీరందఱును నన్ని ప్రశ్నలను వేసిన దేనికని యతఁ డుత్తరము చెప్పును ?
ధర్మ— ఓయీ ! తక్కినసంగతులు పిమ్మటఁ జెప్పవచ్చును, గాని యతని కొమరుఁ డగు బభ్రువాహనునికి నతనికిని సంగరము జరిగినమాట నిక్కమేనా ?
పశు— ఆవిషయము నాతోఁ జెప్పలేదుగాని యాకుమారునిఁ గుఱించి మీతో నిట్లు మనవి చేయుమన్నారు.
ధర్మ— ఎట్లు ?
పశు— క. అరుదేరఁగ నున్నాఁ డం
బరచరులకు నేని నోరువఁగా రాని దురు
ద్ధరశక్తి బభ్రువాహనుఁ
డెఱిఁగి యతని గౌరవించు టెంతయు నొప్పున్.
భీము— నిక్కముగా జరిగియే యుండును. లేనిచో నతని నంతగాఁ గొని యాఁడఁడు.
నకు— కొనియాడకేమి ? అతఁ డతని పుత్రుఁడు గదా !
సహ— అందుచేతనే నుతికిం దగ కుండుట.
ధర్మ— ప్రధానమైన యంశమునే తెలిసికొన్నావు కావు. కానిమ్ము, ఇఁక నేమేమి సంగతులు చెప్పెను ?

పశు— ఇదిగో, మనవి చేయుచున్నాఁడను.

తే. గీ. ధరణియెల్లను దురగమ్ము దిరిగి వచ్చె
యచ్చట నృపాలతనుజాతు లడ్డపడియు
సంధియొనరించుకొని రొక్క సమరమునను
రాచకొమరులు చాలేదు రాజచంద్ర.

భీము— సంధి యొనరించుకొన్నప్పుడు చచ్చుట యేల తటస్థించును ?

ధర్మ— తరువాత, తరువాత ?

పశు— క. బలములఁ జంపియొ రథముల
నిలఁ గూల్చియొ సారథులను హింసించియొ భీ
తిలఁజేసి సంధికిన్ మదిఁ
గలిగించితి నెల్ల రాచకాన్పుల కనఘా !

ధర్మ— తండ్రీ ! మంచిపని చేసితివి. అంతమాత్రమును హింస జరుగకుండ నెఱవేఱినది కాదేమి !

భీము— పశుపాలా ! మేఘసంధి సంగతిని గుఱించి చెప్పవైతివి.

పశు— పూర్వవైరమును మదిఁ బెట్టుకొని మేఘసంధి యశ్వము నడ్డగించి నప్పు డాయన యిట్లనియె నఁట.

ధర్మ— ఎట్లు ?

పశు— క. మాయన్న యేరినిం జా
నేయకు మని యాజ్ఞ యిచ్చె నెందుల కని నన్
డాయంగ వచ్చెదవు వీ
మ్మా ! యనువులు నీకు భరమె ! మముఁబోవిమ్మా.

నకు— ఇంతమాత్రమున కతఁడు మరలువాఁడు గాఁడే !

పశు— క. అను మాటలు చెవిఁబెట్టక
నను నారాచములఁ గొట్టినన్ వడుమనె వా
నినిఁ ద్రుంచి యతని రణసా
ధనములఁ దునుమాడితివి బ్రధరాములమూఁటన్.

సహ— పాపము ! విరథుఁడైనాఁడు. ఇఁక సంధి సేయక చేసెడి దేమి ?

పళు— ఆ. వె. అంత నీడఁబోక యాతఁడు గదగొని
ప్రళయకాలశమను పగిదిఁ గదియ
మెచ్చి యొక్క యమ్ము వుచ్చి యగ్గద భగ్న
ముగ నొనర్చి వాని కౌగి విటంటి.

భీము— చిన్నవాఁడైనను దాతతండ్రుల పేరు నిలుపక పోలేదు; తరువాత ?

పళు— క. నిలిపితివి తాతతండ్రుల
బలము పరాక్రమము యశము బాపురె ! నీకుం
దలకఁ బనిలేదు ప్రాణ
మ్ములకుం దెగఁ రమ్ము జన్మమును గనుఁగొనఁగన్.

నకు— పాపము, సిగ్గిలుచు "మంచిదే" యని తలయూఁపెను గాఁబోలును.

సహ— శకునికొమరుఁ దేమైన నడ్డువచ్చెనేమో ?

ధర్మ— అవును, అది ముఖ్యముగా వినఁ దగినదియే ?

పళు—శకునికొమరుఁడు తన బలములతో నడ్డువచ్చినప్పుడు మీతమ్ము లిట్లనిరఁట.

ధర్మ— ఎట్లు ?

పళు— క. చిన్నతనము మానుము ? మా
యన్న నినున్ జన్మమునకు నరుదెమ్మనె ? వి
ల్వ న్నేను వచ్చితిని; రా
వన్నా ! బంధుగులు కయ్యమాడుట తెన్నా ?

సహ— అది యతఁ దసమర్థతగాఁ బరిగణింపం బోలు !

పళు— ఆ. మీరవినట్లే జరిగినది. అంత నతండది పెదచెవినిఁబెట్టి మీయన్న గారిపై శరపరంపరలు నిగుడ్చుచుండగవియుటయు నా నృపనందను శరమ్ముల వారించి కిరీటమ్ము మాత్ర మొక్కయమ్మునఁ గూలనేసిరఁట.

ధర్మ— అంత నైన నతఁడు మరలఁ లేదేమి ?

పళు— అటుపై నేమి జరుగునో యని, మంత్రి అడ్డమై యారాకొమరుని యరదము వెనుకకుఁ బట్టించుటయుకాక శరణమ్ము వేఁడికొనిరఁట.

భీము— మంత్రులు దెలివిగలవారుగాఁ దోఁచుచున్నారు.

నకు— పిమ్మట మీసోదరు లిట్లు పలికి రంట.
ధర్మ— ఎట్లు?
నకు— ఆ. వె. అన్న సెలవు లేమి యట్లుండ మాయమ్మ
వంకఁ బుట్టినింటివారు వీరు
కాన నితని నేను గాంధారనృపపుత్రిఁ
దలఁచి విడుచు టెట్లుఁ దప్పదుసుఁడీ!
ద్రౌప— అవును. ఆయమ నిట్లు గౌరవింప వలసినదే.
ధర్మ— ఇంతకును "కుశలముగా నున్నాఁ" డని చెప్పితివి, అంతే చాలును.
భీము— అన్నా! నాటకులవలనఁ జూచిన యంశము నిక్కమే యగునా?
ధర్మ— నిక్కమే. కానిచో నతఁ డతని నంత "గౌరవముగాఁ" జూచు
మని నొక్కి వక్కాణింపవలసి యుండదు.
నకు— ఇప్పుడో, యింకనో అన్న రానే వచ్చుచున్నాఁడు. అన్నియును
నతనివలననే తెలియఁగలవు. (అంత నర్జునుఁడు ప్రవేశించును)
కృష్ణ—(చూచి) అడుగో! మీతమ్ముఁడు వచ్చినాఁడు.
ధర్మ— (తత్తఱపాటుతో లేచి కవుఁగలించుకొని)
క. తమ్ముఁడ! నేమమెగద దే! శమ్మునకు స్నీకుఁ? ద్రోవ సంగ్రామములే
యెమ్మెయినడిచెను?నశ్వము! నెమ్మెయిమరలించితి? వచియింపుము నెమ్మిన్.
సహ— అన్నా! నీ వితనిని ముందుగాఁ బుచ్చుటచే నింకను నెన్నాళ్ళకో
కాని రావనుకొన్నారము.
అర్జు— ఇతనితోడనే నేనును ద్వారకనుండి బయలుదేఱితిని. పిదపయుద్ధము
లెక్కడను లేమింజేసి యితఁడు వచ్చునప్పటికే రాఁ గలిగితిని.
ధర్మ— అంతకు మున్ను విశేషించి సంగరములు జరిగినవేమి!
అర్జు— జరిగినవి కాని,
క. నీయాజ్ఞం దల నిడికొని! యాయా దేశములనెల్ల నశ్వమువెంటన్
బోయి యిట కేగుదెంచితి! నేయెడలను రాకొమరుల హింసయొనర్పన్.
నకు— అన్నా! బభ్రువాహనుంగుఱించి యంతగాఁ జెప్పి పుచ్చితివేమి?
అర్జు— అతని పరాక్రమం "విద మిత్థ" మని చెప్ప నాతరము గాదు.

ధర్మ— అట్లయిన మేము విన్నసంగతి యథార్థమే కావచ్చును.
అర్జు— ఎట్లు వింటిరి? నే నితనితో నాసంగతి విస్తరించి చెప్పలేదే!
ధర్మ— త్రికాలజ్ఞుఁడగు నొక కవి వ్రాసిన దృశ్య ప్రబంధమువలన నీశి వతఁడు దెగవేసినట్లును మరలసంజీవనమణిచే బ్రతికినట్లును గనను...
అరు— ఇంతయును జరిగినమాట సత్యమే.
ద్రౌప— నాథా! ముందుగా మీరతవి నేమంటిరి?
అర్జు— (సంశయించును)
కృష్ణ— బావా! సంశయ మెందుకు? వీ రంతయు నెఱిఁగినదే, దానిని ఋజువు చేసికొనుటకుఁ గాఁబోలును, అడుగుచున్నది.
అర్జు— మొదల నతఁడు తండ్రియెడం జూపవలసిన యాచారమును వినయ మును జూప నే నిట్లంటి.

తే. గీ. అర్థఁ గలిగిన నశ్వమ్ము నడ్డవలయు
వంతియే కాని "కొమరుఁడ" నంచు వచ్చి
టిదియు నొక రాచపాడియే యెఱుఁగఁ జెపుమ
"నాడుకొమరుండ" వనుటకు సమ్మనంటి.

ధర్మ— తమ్ముఁడా! యిప్పట్లమాత్రము నీవు తొందరపడితివి సుమీ!

క. "జనకుఁడ" వని నినుఁ బేర్మిన్
గనవచ్చిన పుత్రుఁగాంచి కౌఁగిలియిడుచె
ల్లను బోయె నట్టులుంచుము
"తనయుఁడుగా" వనుట గొప్ప తప్పిదము సుమీ!

అర్జు— (తలవంచుకొని యూరకొనును)
కృష్ణ— (నవ్వుచు) ఇం దితని తప్పే మున్నది? కురువంశజుల కిదియొక యపూర్వముగాదు.

క. భరతుని దుష్యంతుండు కొమరుఁడనియెఱిఁగియును బేర్మమన్నింపక పెక్కురుగల సభ నవమానము పఱపఁడె తనజనని వెంటవచ్చినవానిన్?

ద్రౌప-(చిఱునవ్వుతో)అనుటకవకాశము గలుగుటంబట్టికదా యనుచున్నావు?
ధర్మ— ఇంతకును నియ్యది నీలోపము కాదు. శాపవశమున నీకట్టిబుద్ధి

యనివార్యమై కలిగియుండును. (కృష్ణు నుద్దేశించి) బావా! నాతమ్మన
కెప్పుడును నాకతన దుఃఖమే గాని సుఖము లేక పోయెఁ గదా!

కృష్ణు— ధర్మనందనా! ఎంతులకీయసమయనిర్వేదము! ఇది యీతని
లక్షణముల యందలి దోషమే కాని నీదోషముగాదు.

ధర్మ— గీ. అన్నియును మహారాజ చిహ్నములె కావి
యే దెసను నీతనికి దోసఁ గింత లేదు
కష్టమే తప్ప నకట సుఖ మ్మొకింగఁ
డిప్పటి కదేమి హేతువో? యెఱుఁగఁ జెపుమ!

కృష్ణు— ఈతని కష్టమునకే కాదు, యావత్కుటుంబకష్టమునకును గారణ
మగు దోష మొక్కటి సర్వలక్షణలక్షితుండగు నితనియందుఁ జంద్రు
నకుఁ గళంకమువలె నున్నయది.

ధర్మ— అది యెయ్యది?

కృష్ణు— ఆ. వె. అన్నియవయవమ్ము లనురూపములె యయ్యు
నూను లించుకంతియురువు లితని
కక్కుతమున నిట్టి యాపత్తు లబ్బె మీ
కెల్లరకును దీని నెఱుఁగు మధిప!

ధర్మ— ఇది సాముద్రికశాస్త్రదోషము. దీని కేదేని యుపశాంతి యుండదా!

కృష్ణు— ఇది యిదివఱకే యనుభవముచేఁ దీఱిపోయినది. అయినను సర్వ
దోష హరంబగు నశ్వమేధమును గావించుచునే యుంటివి. ఇఁక
విచారమెందుకు?

(అంత ధౌమ్యులు ప్రవేశింతురు.)

ధౌమ్యు— క. ముని లెల్లరు విచ్చేసిరి
జననాథతనూజులెల్లఁ జనుదెంచిరి యిం
దున కేర్పఱచిన యల దిన
మును దాదాఁపయ్యె దీక్షఁ బూనుము నృపతీ!

తే. గీ. వేదఘోషమ్ము పురమెల్ల విస్తరించె
రాజరథఘోషములు పురిఁ దేజరిల్లె

నందఱును నీదు నభివృద్ధి నాత్మఁ గోరి
యున్నవా రింతకును మోదముండు నొక్కొ!

ధర్మ— పరమసంతోషము. ఇది యంతయును దమ యాశీఃప్రభ
నియ్యనఘుని దయయును.

కృష్ణ— నీ యదృష్టమును నీతమ్ముల భాగ్యరేఖయును.

చ. అరుల జయించి రాజ్యరమ నందితి; వంతియకాక యన్వయాం
కుర మది నిల్చెఁ దమ్ముఁడును గొప్పవిపత్తు తరించె; ధారుణిం
దిరిగి తురంగమ మ్మరుగుదెంచె; మునిప్రవరుల్ త్వదీయ మ
ధ్వరము తిరమ్ముగా జరుప వచ్చిరి నిచ్చలు మోద మందుచున్.

ధౌమ్య-రాజా: నీకింతకన్న నేమిప్రియముగావలెను? అయిన నిట్లగుఁ?

తే. గీ. వేదశాస్త్రమ్ములందును విప్రులందు
గోవులందును సజ్జన కోటియందుఁ
బ్రజల కత్యంతసద్భక్తి ప్రబలుఁ గాక!
క్షేమ మడుగంటుఁ గాక! సౌఖ్యమగుఁ గాక!

మఱియు,

క. మది ముదమున నెల్లజనులు
స్వదేశ రాజులను వారివర్తనలును నె
మ్మది కెక్కఁ జేసికొని స
త్పదమున వర్తింతురుగాక! పరమాత్మకృపన్.

— గద్య —

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతీ శతావధాని తిరుపతి వేంకటేశ్వరవిరచితంబైన
పాండవాశ్వమేధమ్మునందు సర్వంబును షష్ఠాంకము.
శ్రీ మత్పరదేవతార్పణమస్తు!

UNIVERSITY OF HYDERABAD
BC

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

TP
Cl. No. 82 Acc. No. 2979
V55P

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD LIBRARY

TP Acc. No. 2979

Call No. 82 V 55 P

Author వెంకటేశ్వరకవులు, తిరుపతి

Title పాండవాశ్వమేధము

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on [illegible] date.

2. Borrowers are [illegible]sponsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean